సోమవారం
17•6•2019

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

కరీంనగర్ • వెల. రూ. 6.50 • సంపుటి 8 • సంచిక 353 • పేజీలు: 16 + 16

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

జయహో భారత్

ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై భారీ విజయం

రోహిత్‌శర్మ సూపర్ సెంచరీ • అదరగొట్టిన హార్దిక్, కుల్దీప్, శంకర్

వన్డేల్లో అత్యంత వేగంగా 11 వేల పరుగుల మైలురాయిని దాటిన ఆటగాడిగా కోహ్లీ సరికొత్త రికార్డు

ప్రతిష్ఠాత్మక ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై భారత్ అజేయ రికార్డు చెక్కుచెదరలేదు. అభిమానులు ఒళ్లంతా కండ్లు చేసుకుని చూసిన మెగాటోర్నీలో మనోళ్లు పాక్‌ను పాతరేశారు. శత కోటి భారతావని మది విజయగర్వంతో ఉప్పొంగిపోయింది. మాతో పెట్టుకుంటే మసే అన్న రీతిలో కోహ్లీసేన చూపించిన పరాక్రమం..క్రికెట్ బతికున్నంతకాలం ప్రతిఒక్కరికి గుర్తుండిపోతుంది. బంతి బంతికి తమ శౌర్యాన్ని ప్రత్యర్థికి రుచిచూపించిన భారత్ విజయ పతాక ఎగురవేసింది. యుద్ధంలా సాగిన మ్యాచ్‌లో ప్రత్యర్థిని మట్టికరిపించింది. ఆదివారం మాంచెస్టర్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్ 89 (డక్‌వర్త్ లూయిస్ పద్ధతి) పరుగులతో పాకిస్థాన్‌పై భారీ విజయం సాధించింది. తొలుత హిట్‌మ్యాన్ రోహిత్‌శర్మ (113 బంతుల్లో 140; 14ఫోర్లు, 3సిక్స్‌లు) సూపర్ సెంచరీకి తోడు కెప్టెన్ విరాట్ కోహ్లీ (65 బంతుల్లో 77, 7 ఫోర్లు), రాహుల్ (78 బంతుల్లో 57; 3 ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీలతో నిర్ణీత 50 ఓవర్లలో 336/5 భారీ స్కోరు చేసింది. పాక్ బౌలర్లను ఉతికి ఆరేస్తూ రాహుల్, రోహిత్ నిర్మించిన పటిష్ఠమైన ఇన్నింగ్స్‌ను కోహ్లీ మరోస్థాయికి తీసుకెళ్లాడు. హిట్‌మ్యాన్ పేరుకు సార్థకతను చేకూరుస్తూ రోహిత్ కొట్టిన కొట్టుడుకు మాంచెస్టర్ మైదానం దద్దరిల్లిపోయింది. లక్ష్యఛేదనలో శంకర్ (2/22), హార్దిక్ (2/40), కుల్దీప్ యాదవ్ (2/32) ధాటికి పాక్ 40 ఓవర్లలో 6 వికెట్లకు 212 పరుగులకు పరిమితమైంది. కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి.. భారత్ చేతిలో ఏడో ఓటమి మూటగట్టుకుంది.

- వివరాలు ఆటలో

7-0
ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై భారత్ విజయాలు

2
ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై విరాట్ కోహ్లీ (107) తర్వాత సెంచరీ చేసిన రెండో భారత బ్యాట్స్‌మన్ రోహిత్

భవనాల అప్పగింత నేడు

- కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి జగన్‌కు ఆహ్వానం
- విభజన అంశాలపై ఏపీ సీఎంతో చర్చ

నేడు విజయవాడకు సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సోమవారం విజయవాడ వెళ్లనున్నారు. అక్కడ ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో భేటీ అవుతారు. ఈ నెల 21న జరిగే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఏపీ సీఎంను ఆహ్వానించనున్నారు. అనంతరం విభజన చట్టంలో పొందుపర్చిన ఇరు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు. సచివాలయంలోని పలు బ్లాకులతో పాటు, హైదరబాద్‌లోని భవనాల అప్పగింతపై ఇప్పటికే ఏపీ ప్రభుత్వం సుముఖత వ్యక్తంచేసింది. ఈ నెల 19లోగా సచివాలయ భవనాలు ఖాళీ చేస్తామని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

మిగతా 8వ పేజీలో

- తెలంగాణకు సచివాలయంలోని పలు బ్లాకులు.. ఏపీ డీజీపీ కార్యాలయం, లేక్‌వ్యూ గెస్ట్‌హౌజ్ అప్పగింత
- నేటి సాయంత్రంతో పూర్తికానున్న ప్రక్రియ
- ఏపీకి హెర్మిటేజ్, సీఐడీ భవనాల కేటాయింపు
- 27న కొత్త సచివాలయానికి శంకుస్థాపన!
- పాత ప్రదేశంలోనే నిర్మాణానికి నిర్ణయం
- తాత్కాలిక సచివాలయంగా బూర్గుల భవనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంలో భాగంగా సోమవారం కీలకమైన భవనాల అప్పగింత కార్యక్రమం చేపట్టనున్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ ప్రభుత్వానికి హైదరాబాద్‌లో కేటాయించిన భవనాలను తిరిగి అప్పగించనున్నట్టు ఏపీ అధికారులు.. తెలంగాణ అధికారులకు స్పష్టంచేశారు. సచివాలయంలోని పలు బ్లాకులతోపాటు, ఏపీ డీజీపీ కార్యాలయ భవనం, లేక్‌వ్యూ గెస్ట్‌హౌజ్‌లను తెలంగాణకు అప్పగించనున్నారు. సచివాలయంలోని అన్ని బ్లాకులు తెలంగాణ ఆధీనంలోకి రానుండటంతో ఈ నెల 27న నూతన సచివాలయానికి శంకుస్థాపన చేయనున్నట్టు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఆహ్వానించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం విజయవాడ వెళ్లనున్నారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న సమస్యలపై కూడా చర్చించనున్నారు.

ఏపీ సీఎం జగన్ చొరవతో అప్పగింతలో వేగం

తెలంగాణ ప్రభుత్వంతో స్నేహపూర్వకంగా ఉండాలని నిర్ణయించుకున్న ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి.. హైదరాబాద్‌తో తమకు అవసరం లేదని భావించి భవనాలను అప్పగించడానికి ముందుకువచ్చారు. దీంతో సచివాలయంతో పాటు ఇతర భవనాల అప్పగింత ప్రక్రియ వేగం అందుకున్నది. సచివాలయంలో ఏపీకి కేటాయించిన కే బ్లాక్‌లో పోస్టాఫీస్, బ్యాంకు, వైద్యశాల ఉన్నాయని, దీంతో ఈ బ్లాక్‌ను తెలంగాణకు అప్పగించినట్టేనని ఏపీ అధికారులు తెలిపారు. ఎల్ బ్లాక్, జే బ్లాక్‌లతోపాటు హెచ్ సౌత్‌బ్లాక్‌ను సోమవారం సాయంత్రం వరకు అప్పగిస్తామని పేర్కొన్నారు. హెచ్ నార్త్‌బ్లాక్‌లో ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ఉన్నది. హైదరాబాద్‌లో ఖాళీగా ఉన్న ఇతర శాఖాధిపతుల కార్యాలయాల భవనాలను కూడా అప్పగించనున్నారు. ఏపీ ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఏపీ డీజీపీ కార్యాలయం, లేక్‌వ్యూ గెస్ట్‌హౌజ్

మిగతా 8వ పేజీలో

రైతుబంధుతో సిరుల పంట

- 1.38 కోట్ల ఎకరాలకు సర్కారు పెట్టుబడి సాయం
- 1.24 కోట్ల ఎకరాలకు చేరనున్న పంట విస్తీర్ణం
- ఆహారధాన్యాల ఉత్పత్తి లక్ష్యం 1.28 కోట్ల టన్నులు
- గత ఏడాదితో పోలిస్తే 2 లక్షల టన్నులు అధికం
- ఈ ఏడు 6 లక్షల ఎకరాలకుపైగా పెరుగనున్న వరిసాగు
- 2019-20 వ్యవసాయశాఖ ప్రణాళికలో వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న రైతుబంధు పథకంతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం, ఉత్పత్తి గణనీయంగా పెరుగనున్నది. చాలా ప్రాంతాల్లో ఇప్పటివరకు నిరుపయోగంగా ఉన్న భూమి సైతం సాగులోకి రానున్నది. రైతులకు సర్కారు ఎకరాకు రూ.5 వేల చొప్పున 1.38 కోట్ల ఎకరాలకు ముందస్తు పెట్టుబడి అందిస్తుండటం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టడంతో బీడు భూములు సైతం బాగుపడి సిరులు కురిపించనున్నాయి. ప్రాజెక్టులు, నాణ్యమైన 24 గంటల కరంట్, మిషన్ కాకతీయ తదితర సంక్షేమ పథకాలతో వ్యవసాయానికి మంచి ఊపు వచ్చిందని స్వయంగా రైతులే చెప్తున్నారు. సాగు విస్తీర్ణం, ఉత్పత్తి పెరిగేందుకు ముఖ్యంగా రైతుబంధు పథకం దోహదం చేస్తున్నదని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుత వానకాలం, యాసంగి

మిగతా 8వ పేజీలో

భావిపౌరులకు బంగారుబాట

నిర్మల్‌లోని గురుకుల విద్యాలయం

- నేడు 119 నియోజకవర్గాల్లో బీసీ గురుకులాల ప్రారంభం
- బాలురకు 63, బాలికలకు 56
- లాంఛనంగా ప్రారంభించనున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

2

200 మంది రైతులకు పాస్‌పుస్తకాలు లేవు

ధర్మగంట

అధికారుల నిర్లక్ష్యంతో అందని రైతుబంధు సాయం

రైతు పథకాలకూ దూరం

న్యాయం చేయాలంటూ రైతుల ఆందోళన

ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం ఆళ్లపాడులో ఆందోళనకు దిగిన రైతులు

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం 200 మంది రైతుల పాలిట శాపంగా మారింది. పాత పట్టాదార్ పాస్‌పుస్తకాలతోపాటు భూమికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగాచేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనలో అందాల్సిన కొత్త పాస్‌పుస్తకాలు అందలేదు. దీంతో ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం ఆళ్లపాడుకు చెందిన అన్నదాతలు రైతుబంధుతోపాటు రైతుబీమా పథకాలను పొందలేకపోతున్నారు. ఏడాదిన్నరగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడంలేదు. చివరికి అధికారులు అడిగిన లంచం డబ్బులు ఇచ్చినా పాస్‌పుస్తకాలు అందలేదని అన్నదాతలు ఆదివారం గ్రామ కూడలిలో ఆందోళనకు దిగారు. విలేకరులను పిలిపించి తమ గోడును వెళ్లబోసుకున్నారు.

4

ఐదు లక్ష్యాలతో అఖిలపక్షం

ప్రధాని మోదీ అధ్యక్షతన ఎల్లుండి సమావేశం

పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం ఉన్న అన్ని పార్టీల అధినేతలకు కేంద్రం లేఖ

ప్రధాన ఎజెండాగా ఒకే దేశం- ఒకే ఎన్నికలు..

నేటి నుంచి పార్లమెంట్ • 19న స్పీకర్ ఎన్నిక

9



స్నాతకోత్సవానికి ముస్తాబైన ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియం

నేడు ఓయూ 80వ స్నాతకోత్సవం

- హాజరుకానున్న గవర్నర్ నరసింహన్ ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్
- సర్వం సిద్ధంచేసిన అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రతిష్ఠాత్మక ఉస్మానియా యూనివర్సిటీ 80వ స్నాతకోత్సవాన్ని సోమవారం వర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. దీనికి రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా 850 మందికి పీహెచ్‌డీ పట్టాలు, వివిధ అంశాల్లో ప్రతిభకనబర్చిన 292 మందికి బంగారు పతకాలను అందజేయనున్నారు. 79వ స్నాతకోత్సవాన్ని ఆరేండ్ల కిత్రం 2013లో నిర్వహించారు. స్నాతకోత్సవానికి ఓయూ వీసీ ఎస్ రామచంద్రం ఆధ్వర్యంలో సర్వం సిద్ధంచేశారు. ఠాగూర్ ఆడిటోరియంలో స్థలాభావం కారణంగా పట్టాలు, పతకాలు అందుకొనే విద్యార్థులతోపాటు అతిథులు, అధ్యాపకులు, సిబ్బంది, అధికారులకు మాత్రమే ప్రవేశం కల్పించనున్నారు. మిగతా విద్యార్థుల కోసం ఆడిటోరియం బయట ఎల్ ఈడీ స్క్రీన్లను, టెంట్లను ఏర్పాటుచేశారు.

భావిపౌరులకు బంగారుబాట

- నేడు 119 నియోజకవర్గాల్లో బీసీ గురుకులాల ప్రారంభం
- లాంఛనంగా ప్రారంభించనున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భావిపౌరులకు బంగారుబాటలు పరుచుకున్నాయి. పేదింటి బిడ్డలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు విద్యాలయాలు సిద్ధమయ్యాయి. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాలయాలు సోమవారం ఒకేసారి ప్రారంభంకానున్నాయి. వీటిలో బాలుర గురుకులాలు 63 కాగా, బాలికలవి 56 ఉన్నాయి. ప్రతి నియోజకవర్గంలో సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేల చేతులమీదుగా గురుకులాలను లాంఛనంగా ప్రారంభించేందుకు బీసీ సంక్షేమశాఖ ఏర్పాట్లుచేసింది. బీసీల్లోని పేదలందరికీ నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో గురుకుల విద్యాలయాలను రాష్ట్ర ప్రభుత్వం అధికసంఖ్యలో ఏర్పాటుచేస్తున్నది. తెలంగాణ ఆవిర్భావం నాటికి రాష్ట్రంలో బీసీ గురుకులాలు 19 మాత్రమే ఉండగా.. సీఎం కేసీఆర్ పాలనలో సోమవారం ప్రారంభించే 119 కలుపుకొంటే వాటి సంఖ్య 281కి చేరనున్నది. ఏకకాలంలో 119 బీసీ గురుకులాలను ప్రారంభించడం ఒక్క తెలంగాణలోనే సాధ్యపడింది. ఈ విద్యాసంవత్సరం మొత్తం 281 బీసీ గురుకులాల్లో 92,340 మంది విద్యార్థులకు చదువుకొనే అవకాశం దక్కనున్నది.

నేడు ప్రారంభంకానున్న 119 బీసీ గురుకులాల వివరాలు

నియోజకవర్గం	క్యాటగిరీ	ఏర్పాటుచేసే ప్రాంతం	మండలం
గద్వాల	బాలికలు	బిజ్జారం	మల్దకల్
అలంపూర్	బాలురు	శాంతినగర్	వడ్డేపల్లి
నారాయణపేట	బాలికలు	కోటకొండ	నారాయణపేట
మహబూబ్‌నగర్	బాలురు	మన్యంకొండ	మహబూబ్‌నగర్
దేవరకద్ర	బాలురు	చిన్నచింతకుంట	చిన్నచింతకుంట
మక్తల్	బాలికలు	నర్వ	నర్వ
జడ్చర్ల	బాలురు	నవాబ్‌పేట	నవాబ్‌పేట
నాగర్‌కర్నూల్	బాలికలు	తాడూరు	తాడూరు
అచ్చంపేట	బాలురు	అంబటిపల్లి	లింగాల
కల్వకుర్తి	బాలికలు	కడ్తాల్	కడ్తాల్
కొల్లాపూర్	బాలురు	సింగోటం	కొల్లాపూర్
వనపర్తి	బాలురు	కడుకుంట్ల	వనపర్తి
మల్కాజిగిరి	బాలికలు	మల్కాజిగిరి	మల్కాజిగిరి
కూకట్‌పల్లి	బాలికలు	బాలానగర్	బాలానగర్
మేడ్చల్	బాలురు	మేడ్చల్	మేడ్చల్
కుత్బుల్లాపూర్	బాలురు	కుత్బుల్లాపూర్	కుత్బుల్లాపూర్
ఉప్పల్	బాలురు	ఉప్పల్	ఉప్పల్
రాజేంద్రనగర్	బాలురు	రాజేంద్రనగర్	రాజేంద్రనగర్
ఇబ్రహీంపట్నం	బాలురు	మంచాల	మంచాల
ఎల్బీనగర్	బాలికలు	హయత్‌నగర్	హయత్‌నగర్
మహేశ్వరం	బాలురు	కందుకూరు	మహేశ్వరం
శేరిలింగంపల్లి	బాలికలు	మియాపూర్	మియాపూర్
చేవెళ్ల	బాలికలు	షాబాద్	షాబాద్
షాద్‌నగర్	బాలికలు	మొగిలిగిద్ద	ఫరూఖ్‌నగర్
పరిగి	బాలుర	పరిగి	పరిగి
వికారాబాద్	బాలికలు	కేరెల్లి	ధరూర్
తాండూరు	బాలికలు	బషీరాబాద్	బషీరాబాద్
కొడంగల్	బాలురు	దౌల్తాబాద్	దౌల్తాబాద్
ముషీరాబాద్	బాలికలు	ముషీరాబాద్	ముషీరాబాద్
అంబర్‌పేట	బాలికలు	అంబర్‌పేట	అంబర్‌పేట
ఘోషామహల్	బాలికలు	ఘోషామహల్	ఘోషామహల్
చాంద్రాయణగుట్ట	బాలికలు	చాంద్రాయణగుట్ట	చాంద్రాయణగుట్ట
మలక్‌పేట	బాలురు	మలక్‌పేట	మలక్‌పేట
చార్మినార్	బాలురు	చార్మినార్	చార్మినార్
జూబ్లీహిల్స్	బాలికలు	షేక్‌పేట	షేక్‌పేట
నాంపల్లి	బాలికలు	నాంపల్లి	నాంపల్లి
బహదూర్‌పుర	బాలికలు	బహదూర్‌పుర	బహదూర్‌పుర
కంటోన్మెంట్	బాలికలు	సికింద్రాబాద్	సికింద్రాబాద్
కార్వాన్	బాలురు	కార్వాన్	కార్వాన్
యాకుత్‌పుర	బాలురు	యాకుత్‌పుర	యాకుత్‌పుర
ఖైరతాబాద్	బాలురు	ఖైరతాబాద్	ఖైరతాబాద్
సనత్‌నగర్	బాలురు	సనత్‌నగర్	సనత్‌నగర్
సికింద్రాబాద్	బాలురు	సికింద్రాబాద్	సికింద్రాబాద్
నారాయణ్‌ఖేడ్	బాలికలు	బాచుపల్లి	కల్హేర్
మెదక్	బాలురు	మెదక్	మెదక్
నర్సాపూర్	బాలికలు	ఎల్లారెడ్డి	ఎల్లారెడ్డి
అందోల్	బాలురు	అల్లాదుర్గం	అల్లాదుర్గం
జహీరాబాద్	బాలురు	ఝరాసంగం	ఝరాసంగం
పటాన్‌చెరు	బాలురు	ఐనోల్	ఐనోల్
సంగారెడ్డి	బాలికలు	సంగారెడ్డి	సంగారెడ్డి
సిద్దిపేట	బాలికలు	చింతమడక	సిద్దిపేట రూరల్
దుబ్బాక	బాలురు	హబ్సిపూర్	దుబ్బాక
గజ్వేల్	బాలికలు	తూప్రాన్	తూప్రాన్
జుక్కల్	బాలురు	నిజాంసాగర్	నిజాంసాగర్
బాన్సువాడ	బాలికలు	వర్ని	వర్ని
ఎల్లారెడ్డి	బాలికలు	ఎల్లారెడ్డి	ఎల్లారెడ్డి
కామారెడ్డి	బాలురు	బీబీపేట్	బీబీపేట్
ఆర్మూర్	బాలికలు	ఆర్మూర్	ఆర్మూర్
బోధన్	బాలికలు	సలూర	బోధన్
నిజామాబాద్ అర్బన్	బాలురు	నిజామాబాద్	నిజామాబాద్
నిజామాబాద్ రూరల్	బాలురు	రాంపూర్	డిచ్‌పల్లి
బాల్కొండ	బాలికలు	బాల్కొండ	బాల్కొండ
ఆదిలాబాద్	బాలికలు	జైనథ్	జైనథ్
బోథ్	బాలురు	నర్సాపూర్	ఇచ్చోడ
సిర్పూర్	బాలురు	చిన్నరాజుపల్లె	దహేగాం
ఆసిఫాబాద్	బాలికలు	ఆసిఫాబాద్	ఆసిఫాబాద్
చెన్నూరు	బాలురు	చెన్నూరు	చెన్నూరు
బెల్లంపల్లి	బాలురు	తాండూర్	తాండూర్
మంచిర్యాల	బాలికలు	మంచిర్యాల	మంచిర్యాల
నిర్మల్	బాలికలు	సారంగపూర్	సారంగపూర్
ఖానాపూర్	బాలురు	ఉట్నూర్	ఉట్నూర్
ముథోల్	బాలికలు	ముథోల్	ముథోల్
కోరుట్ల	బాలురు	బీర్పూర్	సారంగపూర్
జగిత్యాల	బాలికలు	ధరూర్‌క్యాంప్	ధరూర్
ధర్మపురి	బాలికలు	పెగడపల్లి	పెగడపల్లి
కరీంనగర్	బాలురు	కొత్తపల్లి	కొత్తపల్లి
చొప్పదండి	బాలురు	బూర్గుపల్లి	బూర్గుపల్లి
మానకొండూరు	బాలికలు	మానకొండూరు	మానకొండూరు
హుజూరాబాద్	బాలురు	వీణవంక	వీణవంక
హుస్నాబాద్	బాలికలు	హుస్నాబాద్	హుస్నాబాద్
మంథని	బాలురు	కాటారం	కాటారం
రామగుండం	బాలురు	రామగుండం	రామగుండం
పెద్దపల్లి	బాలికలు	పెద్దపల్లి	పెద్దపల్లి
వేములవాడ	బాలురు	లింగంపేట	చందుర్తి
సిరిసిల్ల	బాలికలు	సిరిసిల్ల	సిరిసిల్ల
జనగామ	బాలురు	బచ్చన్నపేట	బచ్చన్నపేట
స్టేషన్‌ఘన్‌పూర్	బాలికలు	రఘునాథపల్లి	రఘునాథపల్లి
భూపాలపల్లి	బాలురు	భూపాలపల్లి	భూపాలపల్లి
ములుగు	బాలికలు	కొత్తగూడెం (పాకాల)	కొత్తగూడెం
డోర్నకల్	బాలురు	దంతాలపల్లి	దంతాలపల్లి
పాలకుర్తి	బాలికలు	మొండ్రాయి	కొడకండ్ల
మహబూబాబాద్	బాలికలు	గుమ్మడూర్	మహబూబాబాద్
నర్సంపేట	బాలురు	నల్లబెల్లి	నల్లబెల్లి
పరకాల	బాలురు	సంగెం	సంగెం
వరంగల్ పడమర	బాలికలు	కాజీపేట	కాజీపేట
వరంగల్ తూర్పు	బాలురు	ఖిలావరంగల్	ఖిలావరంగల్
వర్ధన్నపేట	బాలికలు	వర్ధన్నపేట	వర్ధన్నపేట
పినపాక	బాలికలు	పినపాక	పినపాక
ఇల్లందు	బాలురు	టేకుపల్లి	టేకుపల్లి
కొత్తగూడెం	బాలికలు	పాల్వంచ	పాల్వంచ
అశ్వారావుపేట	బాలురు	అశ్వారావుపేట	అశ్వారావుపేట
భద్రాచలం	బాలురు	భద్రాచలం	భద్రాచలం
ఖమ్మం	బాలురు	రఘునాథపాలెం	రఘునాథపాలెం
పాలేరు	బాలురు	కూసుమంచి	కూసుమంచి
మధిర	బాలురు	వనంవారి కృష్ణాపురం	ముదిగొండ
వైరా	బాలురు	వైరా	వైరా
సత్తుపల్లి	బాలికలు	సత్తుపల్లి	సత్తుపల్లి
నాగార్జునసాగర్	బాలురు	తిరుమలగిరి (సాగర్)	తిరుమలగిరి (సాగర్)
మిర్యాలగూడ	బాలురు	అవంతిపురం/అలిపురం	మిర్యాలగూడ
మునుగోడు	బాలురు	మునుగోడు	మునుగోడు
నకిరేకల్	బాలురు	నకిరేకల్	నకిరేకల్
నల్లగొండ	బాలికలు	అప్పాజిపేట	నల్లగొండ
దేవరకొండ	బాలికలు	దేవరకొండ	దేవరకొండ
హుజూర్‌నగర్	బాలికలు	గుడుగుంట్లపాలెం	పాలకవీడు
తుంగతుర్తి	బాలికలు	మద్దిరాల	మద్దిరాల
కోదాడ	బాలురు	చిలుకూరు	చిలుకూరు
సూర్యాపేట	బాలురు	ఆత్మకూర్ (ఎస్)	ఆత్మకూర్ (ఎస్)
భువనగిరి	బాలికలు	వలిగొండ	వలిగొండ
ఆలేరు	బాలురు	రాజాపేట	రాజాపేట

ఇక గ్రామాల్లో అభివృద్ధి పరుగులు

సంపూర్ణంగా అమలులోకి కొత్త చట్టం

నేటినుంచి సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు జాయింట్ చెక్ పవర్

నూతన పంచాయతీరాజ్ చట్టం నేపథ్యంలో మరోసారి మార్గదర్శకాలు

జిల్లా, మండలం, గ్రామాలవారీగా విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామాల్లో నూతన పంచాయతీరాజ్ చట్టం సంపూర్ణంగా అమలులోకి వచ్చింది. ఈ చట్టాన్ని గతేడాది జూన్ నుంచే అమల్లోకి తీసుకువచ్చినా.. కొన్ని సెక్షన్లపై మినహాయింపు ఇచ్చారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు జాయింట్ చెక్‌పవర్‌తోపాటు మొత్తం ఆరు అంశాలపై గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదు. తాజాగా శనివారం నూతన పంచాయతీరాజ్ చట్టంలోని 6(10), 34, 37(6), 43(10), 47(4), 70(4), 113(4), 114(2), 141 సెక్షనలను నోటీఫై చేస్తూ ప్రభుత్వం గెజిట్ ఇచ్చింది. దాంతో కొత్త పంచాయతీరాజ్ చట్టం సంపూర్ణంగా అమల్లోకి వచ్చినట్లయింది. గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేందుకు జాయింట్ చెక్‌పవర్ కల్పించనున్నట్టు చట్టంలో పేర్కొన్నారు. గతంలో కార్యదర్శితో కలిసి సర్పంచ్‌కు జాయింట్ చెక్‌పవర్ ఉండగా.. ప్రస్తుతం ఆ పవర్‌ను సర్పంచ్, ఉపసర్పంచ్‌కు ఇచ్చారు. గ్రామాల్లో స్వచ్ఛత నిర్వహణ బాధ్యతను పాలకవర్గానికి కట్టబెట్టారు. కొత్త మార్గదర్శకాల ప్రకారం.. ఇక నుంచి ఇంటి ముందట చెత్త వేస్తే ఆ ఇంటి యజమానులదే బాధ్యత. ఇంటి ముందు చెత్త వేస్తే రూ.500, మురుగునీటిని రోడ్డుమీదకు వదిలితే రూ.5 వేలు జరిమానా విధిస్తారు. ఒక్కో కుటుంబం తమకు నిర్దేశించిన ప్రకారం తప్పనిసరిగా ఆరు మొక్కలు నాటాలి. వాటిలో కనీసం మూడు మొక్కలు ఎదిగేట్టుగా చూడాలి. మొక్కలను పెంచనివారికి ఆస్తిపన్నుకు రెండింతలు జరిమానా విధించేలా మార్గదర్శనాలు జారీచేశారు.

ప్రగతి సాధనే ప్రథమ లక్ష్యం

కొత్త చట్టాన్ని సంపూర్ణంగా అమల్లోకి రావడంతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా, మండలం, గ్రామాలవారీగా చట్టంపై అవగాహన తీసుకొస్తున్నారు. గ్రామాల ప్రగతి సాధనే లక్ష్యంగా కొత్త చట్టాన్ని రూపొందించినట్లు పేర్కొంటున్నారు. పంచాయతీ నిధుల్లో 30 శాతం కార్మికుల జీతభత్యాలకు, నీటి సరఫరాకు 15 శాతం, పారిశుద్ధ్యం నిర్వహణకు 15 శాతం, వీధిదీపాల నిర్వహణకు 15 శాతం, అంతర్గత రోడ్ల మరమ్మతులకు 20 శాతం నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. పంచాయతీ సమావేశాలు, ఇతర ఖర్చుల కోసం 5 శాతం నిధులు వాడుకోవాలి. ట్రేడ్ లైసెన్సులు, జనన, మరణాల నమోదు, వివాహ ధ్రువీకరణపత్రాలు జారీ, గ్రామ రికార్డులు అప్‌డేట్ చేయడం వంటి బాధ్యతలను కార్యదర్శికి అప్పగించారు. ఇకపోతే పాలకవర్గాలు.. పరిశుభ్రత మొదలుకొని గ్రామాల అభివృద్ధి, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి. హరితహారం, స్వచ్ఛతతోపాటు గిరిజనులు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమంపై దృష్టిపెట్టాలి. ప్రతినెలా పంచాయతీ సమావేశం, రెండునెలలకు ఒకసారి గ్రామసభ నిర్వహించి, అభివృద్ధి పనులను గ్రామస్థులకు వివరించాలి. పబ్లిక్ రోడ్లు, వంతెనలు, కాల్వల మరమ్మతు, తాగునీటి పైపులైన్ల నిర్మాణం, నిర్వహణ, మురుగుకాల్వల నిర్వహణ, నిత్యం వీధులు శుభ్రపరచడం, పాడుబడ్డ బావులను పూడ్చడం, పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాటు, చెత్త సేకరించి తడి, పొడి చెత్త వేరు చేయడం, డంపింగ్‌యార్డుల నిర్వహణతోపాటు వర్మీకంపోస్ట్ తయారుచేయడం వంటి బాధ్యతలను పాలకవర్గాలకు అప్పగించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు అన్ని ప్రభుత్వ సంస్థల్లో పచ్చదనం, పరిశుభ్రత నిర్వహించాలి. ప్రతి వారం మురికికాల్వలు శుద్ధిచేయడం, ప్రతి 15 రోజులకు ఒకసారి దోమలను నియంత్రించే పనులు చేపట్టాలి.

జరిమానాలు.. వ్యయాలు

నివేశన స్థలాలు, ఖాళీ స్థలాలు, రోడ్లు, పబ్లిక్ ప్రాంతాలను అక్రమించేవారికి జరిమానా విధించే అధికారం పాలకవర్గాలకు కట్టబెట్టారు. ధర్మాదాయం, ట్రస్టుల నుంచి నిధులు సేకరించడం, సర్వీసు ఇనాంలపై శిస్తు వసూలు, మత్స్యక్షేత్రాల నుంచి పన్ను వసూలు, పెద్ద, చిన్న తరహా ఖనిజాల తవ్వకాలపై సీనరేజీ వసూలు చేసి గ్రామాభివృద్ధికి వినియోగించాల్సిన బాధ్యత పాలకవర్గానిదే. పంచాయతీ సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చులను సూచిస్తూ నిధులు విడుదల చేసుకొనే అధికారం పాలకవర్గాలకు ఉన్నది. ప్రభుత్వం అనుమతితో పంచాయతీ నిధులను దేశరక్షణ నిధికి ఇవ్వవచ్చు. బీదలు, అనాథలు, నిరుపేదలు, వ్యాధిగ్రస్థులకు సహాయంచేసే అవకాశం కల్పించారు. అలాగే, ప్రభుత్వ నిధులు, ఆర్థిక సంఘం నిధులు, బీఆర్‌జీఎఫ్, ఇతర ప్రభుత్వ నిధులను నియమ నిబంధనలను అనుసరిస్తూ వెచ్చించాల్సి ఉంటుంది.

విభజన హామీలపై చర్చకు సమయమివ్వాలి

- అంశాలవారీగా కేంద్రానికి మద్దతిస్తాం
- కేంద్రం ఫెడరల్ స్ఫూర్తిని ప్రదర్శించాలి
- అఖిలపక్ష సమావేశంలో టీఆర్ఎస్‌పక్ష నేతలు కేకే, నామా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలతోపాటు రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను చర్చించడానికి పార్లమెంట్‌లో సమయమివ్వాలని టీఆర్ఎస్ పార్టీ కోరింది. విభజనకు సంబంధించిన అనేక అంశాలు పార్లమెంట్ సాక్షిగా చట్టంలో పేర్కొన్నా ఇంతవరకు వాటిని అమలుచేయలేదని స్పష్టంచేసింది. పార్లమెంట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి టీఆర్ఎస్ నుంచి పార్లమెంటరీ పార్టీ నాయకులు కే కేశవరావు, లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు అంశాలను లేవనెత్తిన కేకే, నామా.. వీటిపై చర్చించేందుకు పార్లమెంట్ సమావేశాల్లో తగిన సమయం కేటాయించాలన్నారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరుగడానికి టీఆర్ఎస్ సహకరిస్తుందని, అదేసమయంలో కేంద్రం కూడా అన్నివర్గాల సమస్యలు ప్రస్తావించేలా, చర్చించేలా సమయమివ్వాలని సూచించారు. పార్లమెంట్ సజావుగా నడువడంలో ప్రధాన బాధ్యత అధికారపక్షంపై ఉంటుందని నామా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అధికారాలు బదలాయించాలని, ఫెడరల్ స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. అంశాలవారీగా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని టీఆర్ఎస్ తెలిపింది. మెజార్టీ ఉన్న కారణంగా మిగిలిన పక్షాలను పట్టించుకోకుండా వెళ్లవద్దని పలు పార్టీల నేతలు సూచించగా.. టీఆర్ఎస్ మద్దతు తెలిపింది. ఈ సమావేశంలో తాగునీటి సమస్యపై పలు పార్టీల ప్రతినిధులు సూచించగా.. తెలంగాణలో చేపట్టిన మిషన్ భగీరథ, కాళేశ్వరం తదితర ప్రాజెక్టుల గురించి నామా నాగేశ్వర్‌రావు వివరించి చెప్పారు. అలాగే ఈ ప్రాజెక్టులకు అదనపు నిధులు కేటాయించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. విద్యపై చర్చ జరిగిన సమయంలో తెలంగాణలో ప్రవేశపెట్టిన గురుకుల విద్యావిధానం విజయవంతమైనదని, మంచి ఫలితాలు వస్తున్నాయని నామా పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును తీసుకురావాలని టీఆర్ఎస్ పార్టీ కేంద్రాన్ని డిమాండ్ చేసింది. మహిళా రిజర్వేషన్లకు తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని మరోసారి ప్రకటించింది.

ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి టీఆర్ఎస్ నుంచి హాజరైన పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావు

ముహూర్తం

సూర్యోదయం: 5.46 గంటలకు

సూర్యాస్తమయం: 6.48 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం, పౌర్ణమి మధ్యాహ్నం 2.02 వరకు, తదుపరి కృష్ణపక్షం పాడ్యమి, నక్షత్రం: జ్యేష్ఠ ఉదయం 10.44 వరకు, తదుపరి మూల, అమృతఘడియలు: తె.జా. 1.43 నుంచి 3.19 వరకు, రాహుకాలం: ఉదయం 7.24 నుంచి 9.02 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.51 నుంచి మధ్యాహ్నం 12.43 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.20 నుంచి సాయంత్రం 4.12 వరకు, వర్జ్యం: రాత్రి 7.06 నుంచి 8.42 వరకు.

లోకం పోకడ

మీరు స్కైప్‌లో దర్శనమిస్తే కానుకలు పేటీఎం ద్వారా పంపిస్తా స్వామి!

జేఏసీ భేటీకి వక్రభాష్యం

- ఉద్యోగుల్లో చిచ్చుపెట్టించేందుకు 'ఆంధ్రజ్యోతి' కుట్ర
- ఎవరూ ప్రస్తావించని అంశాలతో వ్యతిరేక ప్రచారం
- సర్కార్‌ను బద్నాం చేసేందుకు కుటిలయత్నాలు
- ముక్తకంఠంతో ఖండించిన జేఏసీ నేతలు
- ప్రభుత్వంతో సామరస్యంగానే వ్యవహరిస్తామని వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు పచ్చమీడియా మరోసారి ప్రయత్నించి బొక్కాబోర్లా పడింది. ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారంటూ 'ఆంధ్రజ్యోతి' అక్కసును వెళ్లగక్కింది. ఉద్యోగ సంఘాల సమావేశాన్ని పావుగా వాడుకుని చిచ్చుపెట్టేందుకు కుట్రపన్నింది. ప్రభుత్వంతో ఫ్రెండ్లీ వాతావరణాన్ని కొనసాగిస్తున్న ఉద్యోగులను చీల్చే ప్రయత్నాలు చేసింది. జేఏసీ సమావేశంలో ప్రస్తావించని అంశాలను భూతద్దంలో చూపుతూ వ్యతిరేక ప్రచారాన్ని మొదలుపెట్టింది. ఈ తప్పుడు వార్తలను ఉద్యోగ సంఘాల జేఏసీ ఖండించింది. సామరస్యంగానే పోరాడి డిమాండ్లను సాధించుకుంటామని, ఉద్యోగుల వ్యతిరేక ప్రభుత్వమంటూ జేఏసీలో ఎవరూ ఎక్కడా పేర్కొనలేదని తెలిపింది. తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ శనివారం టీఎన్జీవో భవన్‌లో సమావేశమై కొన్ని సమస్యలపై చర్చించింది. మధ్యంతర భృతి, పీఆర్సీ, విభజన నేపథ్యంలో ఏపీకి వెళ్లిన ఉద్యోగులను తెలంగాణకు తీసుకురావడం, పదవీ విరమణ వయస్సు పెంపు వంటి అంశాలను చర్చించారు. రెవెన్యూ శాఖ ప్రక్షాళన నేపథ్యంలో ఆ శాఖ ఉద్యోగ సంఘం ప్రతినిధులు మాట్లాడారు. ఒకరిద్దరు చేసిన తప్పులను తమ శాఖ మొత్తానికి ఆపాదించవద్దని, దీనిపై త్వరలోనే సీఎం కేసీఆర్‌తోపాటు సీఎస్‌ను కలిసి విన్నవిస్తామని తెలిపారు. సమావేశానంతరం జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మమత మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వంతో స్నేహబంధాన్ని కొనసాగిస్తూనే సమస్యలు పరిష్కరించుకుంటామని స్పష్టంచేశారు. సమస్యలపై పోరాడుతామని గానీ, ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదనిగానీ వారు పేర్కొనలేదు. ఏపీలో 27 శాతం ఐఆర్ ఇచ్చినందున ఇక్కడ కూడా ఇవ్వాలనే డిమాండ్ వచ్చినా.. దీనిపై ప్రభు త్వం నిర్ణయం తీసుకుంటుందని జేఏసీలో చర్చించారు. తెలంగాణ ఉద్యమం అనంతరం రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఉద్యోగులు అడగకుండానే ఐఆర్‌తోపాటు పీఆర్సీ, తెలంగాణ ఇంక్రిమెంట్ ఇచ్చిన విషయాలను గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యోగుల సంక్షేమం, సమస్యలను పక్క రాష్ట్రాలతో ముడిపెట్టరాదని రవీందర్‌రెడ్డి, మమత తేల్చిచెప్పారు. వీటన్నింటినీ పచ్చమీడియా వక్రీకరించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగులు ఉద్యమాన్ని మొదలుపెట్టారంటూ నానా హడావుడి చేసింది. చిలుక పలుకుల 'ఆంధ్రజ్యోతి' దీన్ని పెద్ద రాద్ధాంతంగా చూపింది. జేఏసీ సమావేశంలో మాట్లాడని అంశాలను ప్రస్తావించింది. తమ అక్కసునంతా ఉద్యోగుల పేరిట ప్రచురించింది. జేఏసీ నేతలు వెల్లడించిన అంశాలను ప్రస్తావించకుండా బురదజల్లే ప్రయత్నం చేసింది.

ప్రభుత్వంతో మాది స్నేహబంధమే

- సామరస్యంగానే సమస్యలన్నీ పరిష్కరించుకుంటాం
- ఉద్యోగుల వ్యతిరేక ప్రభుత్వమని ఎవరూ అనలేదు
- పచ్చ మీడియా కుటిలయత్నాలు ఫలించవు
- 'ఆంధ్రజ్యోతి' కథనం పూర్తిగా అవాస్తవం
- జేఏసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మమత స్పష్టీకరణ

కారం రవీందర్‌రెడ్డి

మమత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'ఆంధ్రజ్యోతి' తీరును ఉద్యోగ సంఘాల జేఏసీ ముక్తకంఠంతో ఖండించింది. ఉద్యోగుల్లో చిచ్చుపెట్టే ప్రయత్నాలను సహించేదిలేదని జేఏసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మమత ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వానికి అండగా ఉంటూనే సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాడే హక్కు ఉద్యోగులకు ఉన్నదని అన్నారు. 'ఆంధ్రజ్యోతి' కథనం అవాస్తవమని, ప్రజల ఆశీర్వాదంతో వరుసగా రెండు సార్లు అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య స్నేహబంధమే కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆదినుంచే టీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారని, ప్రభుత్వం కూడా ఉద్యోగుల పట్ల సానుకూల ధోరణితో వ్యవహరిస్తున్నదని తెలిపారు. 'ఇప్పుడు కొందరు ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య అగాధాన్ని సృష్టించాలని కుట్రలు పన్నుతున్నారు. ఉద్యమకాలం నుంచి కలిసి పనిచేసిన మా మధ్య చిచ్చుపెట్టే కుట్రలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఫలించవు. శనివారం జరిగిన జేఏసీ సమావేశంలో ఉద్యోగులు తమ డిమాండ్లను ప్రభుత

విశిఖ శ్రీ శారదపీఠ ఉత్తరాధికారి శిష్య
తురీయాశ్రమ దీక్షా స్వీకార మహోత్సవ ఆహ్వానము
విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు
జగద్గురు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి
వారి దివ్యాశీస్సులతో....
విశాఖ శ్రీ శారదాపీఠ ఉత్తరాధికారి
కుమార శర్మ (బాలస్వామి)
శిష్య సన్యాసాశ్రమ స్వీకారమహోత్సవ
కార్యక్రమానికి విచ్చేస్తున్న
తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రివర్యులకు
స్వాగతం - సుస్వాగతం
వేదిక: తేది: 17-06-2019
సోమవారం కృష్ణానది తీరాన,
గణపతి సచ్చిదానంద ఆశ్రమం,
జయదుర్గ తీర్థం,
విజయవాడ, ఆంధ్రప్రదేశ్
శ్రీ కల్వకుంట్ల
చంద్రశేఖర్ రావు గారు
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
మిరియాల రాఘవరావు
విశాఖ శ్రీ శారదాపీఠం ట్రస్టీ
ఛైర్మన్, వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్
శ్రీ వై.యస్.
జగన్ మోహన్‌రెడ్డి గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు

నమస్తే తెలంగాణ

ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE

సొమ్ములిచ్చినా పనికాలే

- ఎకరాకు రూ.15 వేలు లంచం డిమాండ్‌చేసిన వీఆర్వో
- ఎకరాకు రూ.5 వేల చొప్పున అడ్వాన్సుగా ఇచ్చిన రైతులు
- వీఆర్వోపై తాసిల్దార్‌కు ఖమ్మం జిల్లా కామేపల్లి గిరిజన రైతుల ఫిర్యాదు

తమ భూమి పత్రాలను చూపుతున్న ఖమ్మం జిల్లా కామేపల్లి గిరిజన రైతులు

కామేపల్లి: అక్రమాలకు అలవాటుపడిన కొందరు వీఆర్వోలు అమాయక రైతులతో ఆడుకొంటున్నారు. పాస్‌పుస్తకాల కోసం ఎకరాకు ఇంత లంచం ఇవ్వాలంటూ డిమాండ్‌చేస్తున్నారు. ఖమ్మం జిల్లా కామేపల్లి రెవెన్యూ పరిధిలోని కొంతమంది గిరిజన రైతులు.. పాస్‌పుస్తకాల కోసం స్థానిక వీఆర్వో నాగేశ్వర్‌రావును ఆరు నెలల క్రితం సంప్రదించగా ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు ఖర్చవుతుందని తెలిపాడు. దీంతో రెండు విడుతల్లో డబ్బులు చెల్లించేలా వీఆర్వో నాగేశ్వరావుతో ఒప్పం దం చేసుకొని తొలివిడుత డబ్బులు ఇచ్చా రు. అయినప్పటికీ ఇప్పటిదాకా సదరు వీఆర్వో రైతులకు పాస్‌పుస్తకాలు ఇవ్వలేదు. రైతులు అడిగితే రేపు, మాపు అంటూ తిప్పించుకొంటున్నారు. దీంతో విసుగు చెందిన రైతులు ఇటీవల తాసిల్దార్ కార్యాలయంలో నాగేశ్వర్‌రావును నిలదీశారు. అప్పటికీ ఎటువంటి హామీ ఇవ్వకపోవడంతో తాసిల్దార్ పుష్పలతకు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారు. తమకు భూమి ఉన్నా పాస్‌పుస్తకాలు రాలేదని.. దీంతో ప్రభుత్వం అందించే పెట్టుబడిసాయం కూడా పొందలేకపోతున్నామని వాపోయారు. తమ నుంచి డబ్బులు వసూలుచేసిన వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అర్హులైన రైతులకు న్యాయం చేస్తామని త్వరలోనే రైతులకు పాస్‌పుస్తకాలు అందిస్తామని తాసిల్దార్ పుష్పలత హామీఇచ్చారు.

ఫైల్ మాయంచేశారు

నాకు కామేపల్లి రెవెన్యూలోని సర్వేనంబర్ 14/ఆ లో ఎకరం, 19/ఆ లో 15 గుంటలు, 764లో 1.26 ఎకరాల భూమి ఉన్నది. నాకు పాస్‌పుస్తకం రాలేదు. వీఆర్వో నాగేశ్వర్‌రావుకు తెలుపగా ఒక్కో ఎకరాకు రూ.15 వేలు ఖర్చు అవుతుందని అడిగాడు. దీంతో నాకు ఉన్న మూడెకరాలకు గాను మొత్తం రూ.40 వేలు ఇస్తామని తెలిపి మొదటి విడుతగా రూ.20 వేలు నగదు చెల్లించాను. డబ్బులు ఇచ్చి ఆరు నెలలు అవుతున్నది. పాస్‌పుస్తకం రాలేదు. మిగతా డబ్బులు ఇవ్వలేదనే కారణంతోనే నా భూమి పత్రాలకు సంబంధించిన జిరాక్స్ పత్రాలు, దరఖాస్తు ఫారాలను మాయంచేసి పనిచేయకుండా ఆపాడు. ఈ విషయంపై తాసిల్దార్‌కు ఫిర్యాదుచేశాను.

- అజ్మీరా బాబురావు, కామేపల్లి, గిరిజన రైతు

రూ.6 వేలు ఇచ్చా

మాకు సర్వే నంబర్ 162లో 2.20 ఎకరాల భూమి ఉన్నది. పాస్‌పుస్తకం కోసం వీఆర్వోను అడుగగా లంచం డిమాండ్‌చేశాడు. చేబదులుగా తెలిసిన మరో రైతు వద్ద రూ.6 వేలు తీసుకొని వీఆర్వోకు ఇచ్చాను. అయినా కూడా పాస్‌పుస్తకం రాలేదు. ఏమిటని ప్రశ్నిస్తే రేపు, మాపు అంటున్నాడు. వీఆర్వో చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. దీంతో తసిల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేశాను.

- ఆంగోత్ విజయ, కామేపల్లి, గిరిజన మహిళా రైతు

200 మంది రైతులకు పాస్‌బుక్‌లు లేవు

అధికారుల నిర్లక్ష్యంతో అందని రైతుబంధు ■ రైతు సంక్షేమ పథకాలకూ దూరం

ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం ఆళ్లపాడులో రైతుల ఆందోళన ■ పైసలిచ్చినా రెవెన్యూ అధికారులు పనిచేస్తలేరని ఆగ్రహం

తమకు న్యాయం జరిగేలా చూడాలంటూ విలేకరుల ఎదుట మొర

బోనకల్లు:

ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం ఆళ్లపాడు రెవెన్యూలోని రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించడంలో వీఆర్వో, తాసిల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తాము ప్రభుత్వం అందించే రైతుబంధు పెట్టుబడి సాయాన్ని నష్టపోయామని బాధితులు ఆందోళనకు దిగారు. ఆదివారం సుమారు 200 మంది రైతులు ఆళ్లపాడు గ్రామ కూడలికి చేరుకొని విలేకరులను పిలిపించుకొని వారి సమస్యలను వివరించారు. ఆళ్లపాడు రెవెన్యూ పరిధిలో రాయన్నపేట, రావినూతల, కలకోట, గోవిందాపురం, బోనకల్లు గ్రామాలకు చెందిన రైతులు ఉన్నప్పటికీ ఒక్క ఆళ్లపాడులోనే సుమారు 200 మందికిపైగా రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందలేదంటూ వారి వద్ద ఉన్న ఆధారాలు చూపుతూ ఆవేదన వ్యక్తంచేశారు. వీఆర్వో చుట్టూ తిరిగినా పట్టించుకోకపోవడంతో, తాసిల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా తమ సమస్యలు పరిష్కారం కాలేదని వాపోయారు. పాస్‌పుస్తకాలు ఇచ్చేందుకు అధికారులు డబ్బులు డిమాండ్ చేసినా ఇచ్చామని, అయినా పాస్‌పుస్తకాలు అందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం అధికారులపై తక్షణమే చర్యలు తీసుకొని, తమకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించాలని వేడుకొన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి వచ్చే రైతుబంధు, రైతు బీమా వంటి రైతు సంక్షేమ పథకాలు వర్తించేలా చూడాలని కోరారు. ఈ ఆందోళనలో గ్రామానికి చెందిన రైతులు అల్లిక లక్ష్మీనారాయణ, అల్లిక రాములు, మరీదు ధనమూర్తి, బుంగా నరసింహా, దొంతుబోయిన గురవయ్య, మర్రి నర్సయ్య, పారా నాగమణి, చెన్నకేశవ నాగరాజు, సలీంబీ పాల్గొన్నారు.

ఎంత తిరిగినా పట్టించుకోలేదు

రెవెన్యూ అధికారుల చుట్టూ పాస్‌పుస్తకాల కోసం కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోలేదు. 5 ఎకరాల భూమి కొని చలానా కట్టినప్పటికీ ఆన్‌లైన్ చేయకుండా వీఆర్వో నిర్లక్ష్యంచేశారు. కేవలం 3 ఎకరాలు మాత్రమేచేసి మరో రెండు ఎకరాలను పెండింగ్‌లో పెట్టారు. ఈ భూమి ఆన్‌లైన్ కోసం రూ.13,500 చలానా తీశా. అయినా నేటికీ పాస్‌పుస్తకం అందించకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే రైతుబంధు సాయం నష్టపోయా. వీఆర్వోపై వెంటనే చర్యలు తీసుకొని ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తించేలా చూడండి.

- అల్లిక లక్ష్మీనారాయణ

ఫైల్ పోగొట్టి ఆన్‌లైన్ చేయడం లేదు

నాకున్న భూమికి పాస్‌పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నాను. కానీ ఆ ఫైల్‌ను వీఆర్వో పోగొట్టి ఆన్‌లైన్ చేయకపోవడంతో రైతుబంధు పథకం కోల్పోయాను. ఫైల్ అక్కడున్నది.. ఇక్కడ ఉన్నది అంటూ కాలయాపనచేయడం తప్ప.. నాకు మాత్రం పాస్‌పుస్తకం ఇవ్వలేదు. ఈ విషయాన్ని తాసిల్దార్‌కు తెలియజేసినప్పటికీ వారు కూడా పట్టించుకోలేదు. నాకు న్యాయం చేసి పాస్‌పుస్తకం అందించాలని కోరుతున్నాను.

- పారా నాగమణి

రైతుబంధు సాయం కోల్పోయా

ఆళ్లపాడు రెవెన్యూలో 2 ఎకరాల భూమి నా పేరిట వారసత్వంగా వస్తున్నది. కానీ రెవెన్యూ అధికారులు మాత్రం ఇంతవరకు ఆన్‌లైన్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం రాకపోవడం వల్ల రైతుబంధు సాయం అందకుండా పోయింది. పాత రికార్డుల్లో నా పేరున 2 ఎకరాల భూమి ఉన్నప్పటికీ ఇంతవరకు ఆ భూమిని నాపేరున ఆన్‌లైన్ చేయలేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయంచేయండి.

- బుంగా నరసింహా

మా మాట!

రెవెన్యూ వ్యవస్థలో మార్పు వస్తున్నది

నమస్తే తెలంగాణ చేపట్టిన ధర్మగంటతో రెవెన్యూ వ్యవస్థలో మార్పు వస్తున్నది. రెవెన్యూ అధికారుల తప్పిదాలు, నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బంది పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూరికార్డుల ప్రక్షాళనతో రైతులకు చాలా మేలు జరిగింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటుండటంతో భూసమస్యలు సత్వర పరిష్కారానికి నోచుకుంటున్నాయి.

- సక్రునాయక్, బుడ్డోనితండా, చందంపేట మండలం, నల్లగొండ జిల్లా

రెవెన్యూశాఖ ప్రక్షాళన శుభపరిణామం

రైతులు, సామాన్య ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ, పురపాలక, రిజిస్ట్రేషన్‌శాఖలను ప్రక్షాళనచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామం. ముఖ్యమంత్రి నిర్ణయాలతో రెవెన్యూ అధికారులు రైతు సమస్యల పరిష్కారానికి ముందుకు వస్తున్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయం వల్ల నేడు రైతుల భూసమస్యలు త్వరగా పరిష్కారానికి నోచుకొంటున్నాయి. ధర్మగంటను ఇలాగే కొనసాగించాలి.

- కే నర్సింహారెడ్డి, వేములపల్లి, నల్లగొండ జిల్లా

లంచం అంటేనే భయపడుతున్నారు

'నమస్తే తెలంగాణ'లో ధర్మగంట పేరిట వస్తున్న పలు కథనాలతో రెవెన్యూ అధికారులు లంచం తీసుకోవాలంటే భయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళన ద్వారా ఏండ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తున్నది. రెవెన్యూశాఖను ప్రక్షాళన చేస్తే అక్కడ అవినీతి పూర్తిగా అంతమవుతుందని భావిస్తున్నా. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రైతులు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారు.

- కర్నాటి సైదిరెడ్డి, రైతు, హాలియా, నల్లగొండ జిల్లా

ధర్మంవైపే ధర్మగంట

రైతు సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న రెవెన్యూ అధికారులపై విచారణ గంట మోగిస్తున్న ధర్మగంట తీరు చాలా భేష్. దశాబ్దాలుగా వీఆర్వోలు, ఆర్ఐలు, సర్వేయర్లు, తాసిల్దార్లు చేస్తున్న నిర్లక్ష్యంతో ఎంతో మంది రైతులు భూ సమస్యలతో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఒకరికి పట్టా ఉంటే, కాస్తులో మరొకరు ఉంటారు. భూమిని సర్వే చేయమని ప్రభుత్వానికి డబ్బులు కడితే, ఏడాది గడిచినా సర్వేయర్ రారు. దీంతో ప్రభుత్వ పథకాలు అందక రైతులు ఆవేదనచెందుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలతో రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. నమస్తే తెలంగాణ చేపట్టిన ధర్మగంట కూడా ధర్మంవైపే నిలువడం అభినందనీయం.

- శిఖ నర్సింహులు, మల్లాపురం, యాదగిరిగుట్ట మండలం

ఆధారాలు లేకుండానే పేరు మార్పు

సమాచారమివ్వకుండానే ఇతరులకు పట్టా ■ న్యాయం చేయాలంటూ వృద్ధ రైతు ఆవేదన

యాదగిరిగుట్ట, నమస్తే తెలంగాణ: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామానికి చెందిన ఆది రామస్వామికి ఏకైక కూతురు మల్లమ్మను 1957లో బీబీనగర్ మండలంలోని వెంకిర్యాలకు చెందిన మార్త యాదగిరికి ఇచ్చి పెండ్లిచేశారు. ఆది రామస్వామికి గుండాల మండలం అనంతారంలో 7.07 ఎకరాల భూమి ఉన్నది. సర్వే నంబర్ 46/ఇలో 2.39 ఎకరాలు, 45/ఆలో 17 గుంటలు, 44/ఇలో 18 గుంటలు, 38/ఇలో 2.06 ఎకరాలు, 46/ఉలో 2.39 ఎకరాలు, 46/ఇ/1లో 1.07 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమిని కూతురైన మల్లమ్మ పేరిట రిజిస్టర్‌చేసి ఇచ్చాడు. మల్లమ్మ 2013లో మృతి చెందారు. నాటినుంచి 2017 వరకు 1-బీ నమూనాలో మల్లమ్మ పేరు కొనసాగుతూనే ఉన్నది. అయితే సర్వే నంబర్ 46/ఇ/1లోని 1.07 ఎకరాల భూమిని మల్లమ్మ నుంచి ఆది సాయిలు పేరుపై మార్చారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ భూమిని సాయిలు పేర ఎలా చేశారని మల్లమ్మ భర్త మార్త యాదగిరి తాసిల్దార్‌ను వివరణ కోరినా ఎలాంటి స్పందన రాలేదు. హైకోర్టుకు వెళ్లినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. ముగ్గురు తాసిల్దార్లు మారినా మల్లమ్మ కుటుంబం సభ్యుల సమస్య పరిష్కారం కానేలేదు. తాజాగా గుండాల తాసిల్దార్‌కు 46/ఇ/1లో గల 1.07 ఎకరాలను ఎలా బదిలీ చేశారో అడుగగా ఎటువంటి పత్రాలు లేకుండానే భూమి పట్టా బదిలీ అయినట్టు తేలింది. ఈ ఏడాది ఫిబ్రవరి 25న పట్టా మార్పుపై పూర్తి ఆధారాలు ఇవ్వాలని కోరితే పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి భూమిపై తగు విచారణ జరిపి తమకు న్యాయంచేయాలని మల్లమ్మ భర్త మార్త యాదగిరి ధర్మగంటను ఆశ్రయించారు.

మార్త యాదగిరి

సాదాబైనామా ఆధారంగా పట్టామార్చాం

మల్లమ్మ బతికున్నప్పుడు ఆ భూమిని ఆది సాయిలు సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసినట్టు ఆధారాలున్నాయి. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా సాదాబైనామా సమస్యలను అధిగమించాలన్న ఉద్దేశంతో మల్లమ్మ పేరిట సర్వే నంబర్ 46/ఇ/1లో ఉన్న 1.07 ఎకరాల వ్యవసాయ భూమిని సాదాబైనామా ఆధారంగా ఆది సాయిలు పేరిట మార్చాం.

- గంగాభవాణి, తాసిల్దార్ గుండాల మండలం

ఏడాది నుంచి తిరుగుతున్న..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'మా నాన్న వీరయ్యకు నలుగురం కొడుకులం. సంగారెడ్డి మండలంలో ఆయనకు 3.6 ఎకరాల భూమి ఉన్నది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేలో.. మా చిన్న తమ్ముడైన సంజీవయ్య ఈ మొత్తం భూమిని మాకు తెలియకుండా తన పేరిట పహాణీలో ఎక్కించుకున్నాడు. ఇది గమనించిన వెంటనే మేము సంగారెడ్డి తాసిల్దార్‌ను 2018 ఫిబ్రవరి 6న కలిశాం. నలుగురికి సమంగా పంచాల్సిన భూమిని ఒక్కడి పేరిటే ఎలా నమోదుచేశారని ప్రశ్నించాం. సంబంధిత ఆర్డీవోకు, జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశాం. వారూ తాసిల్దార్‌కే మా సమస్య పరిశీలనకు పంపించారు. తాసిల్దార్‌ను క్రమం తప్పకుండా కలుస్తూనే ఉన్నాం. సదరు ఎమ్మార్వో ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మేం ఎన్నిసార్లు అడిగినా సప్పుడు చేస్తలేడు. మా నలుగురికి సమంగా చెందాల్సిన భూమి.. ఇలా ఒక్కడి పేరిటే పహాణీలో నమోదు చేయించడం వెనుక పదవీవిరమణ చెందిన ఒక ఎమ్మార్వో హస్తం ఉన్నదని తెలిసింది. ఆ రిటైర్డ్ ఎమ్మార్వో బామ్మర్ది స్థానిక వీఆర్వో అని.. ఆయనే సంజీవయ్యకు రిజిస్ట్రేషన్ చేయడంలో సహాయం చేశాడని తెలిసింది. పైగా, రిటైర్డ్ ఎమ్మార్వో, ప్రస్తుత ఎమ్మార్వోలు ఒకే గ్రామానికి చెందినవారని సమాచారం. అందుకే, ప్రస్తుత ఎమ్మార్వో మాకు సహకరించడం లేదు. పహాణీలో ప్రస్తుతం ఉన్న తమ్ముడి పేరు తొలిగించి, నలుగురు అన్నదమ్ముల పేర్లను నమోదుచేయాలని సంగారెడ్డి తాసిల్దార్‌ను నమస్తే తెలంగాణ 'ధర్మగంట' ద్వారా కోరుతున్నాం.'

- మాణిక్యం, సంగారెడ్డి

భూదాన పత్రం సృష్టించి దోచేశారు

- పట్టించుకోవాల్సిన అధికారులే పెడచెవిన పెడుతున్నారు
- బాధితుడికి ప్రొసీడింగ్ ఇచ్చి.. ఆన్‌లైన్‌లో తొలిగింపు
- ధర్మగంటను ఆశ్రయించిన బాధితుడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్ మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన కొప్పు పెద్ద జంగయ్యకు సర్వే నంబర్ 1116 లో 2-16 ఎకరాల భూమి వారసత్వంగా సంక్రమించింది. పెద్ద జంగయ్య 2007లో మరణించడంతో ఆయన కొడుకైన మహేందర్ సదరు భూమిని తన పేరిట విరాసత్‌చేయాలని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకొన్నారు. దాదాపు ఏడెనిమిదేండ్లు తిప్పుకున్న తర్వాత 2015లో ఎమ్మార్వో సదరు భూమి మహేందర్‌కే చెందుతుందని విరాసత్ ప్రొసీడింగ్ జారీచేశారు. ఎమ్మార్వో ప్రొసీడింగ్ జారీచేసిన కొద్దిరోజులకు దాయాది అయిన కొప్పు ఎల్లయ్య కొడుకులైన బలరాం, నర్సింహ ఈ భూమిపై వివాదం సృష్టించారు. సర్వే నంబర్ 1116 లోని 2.16 ఎకరాల్లో 1.10 ఎకరాల భూమి తమదంటూ అధికారులకు ఫిర్యాదుచేశారు. పెద్ద జంగయ్యే 1998లో తమకు భూదాన సెటిల్‌మెంట్ కింద రూ.12,500 లకు భూమిని విక్రయించారని పేర్కొన్నారు. దీంతో మహేందర్ విరాసత్ ఆగిపోయింది. భూమిపై వివాదం తలెత్తిన నేపథ్యంలో వీఆర్వోతో చింతలపల్లి గ్రామంలో భూమి పంచనామా నిర్వహించారు. పంచనామా అనంతరం విరాసత్ ప్రొసీడింగ్ ఇచ్చిన ప్రకారం సదరు భూమిని మహేందర్ పేరిట ఆన్‌లైన్ రికార్డులో నమోదుచేయడమే సమంజసమని వీఆర్వో నిర్ధారించారు. దీన్ని ఆధారంగా చేసుకొని బాధితుడు మహేందర్‌రెడ్డి ఎన్నిసార్లు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. 2015లో సదరు భూమి మహేందర్‌కే చెందుతుందని ఎమ్మార్వో జారీచేసిన విరాసత్ ప్రొసీడింగ్‌ను 2016లో రెవెన్యూ అధికారులే రద్దుచేశారు. 2017 నవంబర్ వరకు 1116 సర్వేనంబర్‌లోని 2.16 ఎకరాలు భూమి పెద్ద జంగయ్య పేరుపైనే 1-బీలో నమోదై ఉన్నది. రికార్డుల ప్రక్షాళన సందర్భంగా 1.10 ఎకరాలను బలరాం పేరిట పాస్‌పుస్తకాలు జారీచేశారు. మిగిలిన 1.06 ఎకరాల భూమిని మహేందర్‌కు కేటాయించారు.

ప్రొసీడింగ్ రద్దుచేశారు

ఈ సమస్య ఎన్నో ఏండ్ల నుంచి కొనసాగుతున్నది. భూదాన్ సెటిల్మెంట్ దస్తావేజు ప్రకారం పెద్దజంగయ్య పేరిట ఉన్న 2.16 ఎకరాల్లో నుంచి 1.10 ఎకరాలు తొలిగించి కొప్పు బాలరాం పేరిట ఆన్‌లైన్ చేశారు. ఈ సమస్య గురించి నాకు పూర్తిగా తెలియదు. మేం ఏం చేయలేం. మహేందర్ పేరిట 2015లో ఉన్న ఎమ్మార్వో విరాసత్ ప్రొసీడింగ్ ఇచ్చారు. తర్వాత పొరపాటు జరిగిందని రద్దుచేశారు.

- లక్ష్మయ్య, వీఆర్వో, చింతలపల్లి

సమస్య మా పరిధిలో లేదు

మహేందర్‌కు సంబంధించిన ఫైలును కలెక్టర్ దగ్గరికి పంపాం. ఆర్డీవోకు అప్పీల్‌కు వెళ్లమని మెమో వచ్చింది. సమస్య మా పరిధిలో లేదు. ఆర్డీవో అప్పీల్‌కు వెళ్తే సదరు భూమి సమస్యపై నోటీసు జారీచేసి పరిష్కరిస్తారు. గతంలోని ఎమ్మార్వోలు చేసిన తప్పిదం ఇది. ఒక ఎమ్మార్వో ఇచ్చిన ఆర్డర్‌లో వేరే ఎమ్మార్వో జోక్యంచేసుకోవడానికి వీల్లేదు. ఆర్డీవో అప్పీల్‌కు వెళ్లిన తర్వాత ఆయన ఆదేశిస్తే సమస్యను పరిశీలిస్తాం. భూదాన్ సెటిల్మెంట్ దస్తావేజుపై ఏవైనా ఆరోపణలుంటే సివిల్‌కోర్టుకు వెళ్లాలి.

-శ్రీనివాస్, ఎమ్మార్వో, ఆమనగల్

పోరాడే ఆర్థిక స్థోమత లేదు

నేను పేదవాడిని. రోజూ కష్టంచేస్తేనే కుటుంబం గడుస్తుంది. ఈ భూమి కోసం పోరాడే ఆర్థికస్థోమత కూడా నాకు లేదు. సదరు భూమిని మా తండ్రి అమ్మినట్టు భూదాన్ సెటిల్మెంట్ పత్రాలు సృష్టించారు. వాటిపై మా తండ్రి వేలిముద్రలు ఉన్నాయి. మా తండ్రికి సంతకం చేయడం వచ్చు. ఆ భూమిపై ఇప్పటికీ నేనే కాస్తులో ఉన్నా. నా తండ్రి భూమిని దోచేయాలని చూసే వారికి రెవెన్యూ అధికారులే సపోర్ట్ చేస్తున్నారు. నాకు న్యాయంచేసి నా భూమిని తిరిగి ఇప్పించాలి.

- మహేందర్, బాధితుడు

ప్రారంభోత్సవానికి ముస్తాబైన హైదర్‌గూడలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్

నేడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనసభ, శాసనమండలి సభ్యుల కోసం హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో నిర్మించిన నివాస సముదాయాలను సోమవారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అంతకుముందు ఆర్‌అండ్‌బీ, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పూజలు నిర్వహించనున్నారు. 120 మంది చట్టసభల ప్రజాప్రతినిధులు నివాసం ఉండేలా 4.26 ఎకరాల స్థలంలో రూ.166 కోట్లతో నిర్మాణం చేపట్టారు. ఒక్కో ఫ్లోర్‌లో పదిచొప్పున 12 అంతస్తుల్లో 120 క్వార్టర్స్‌ను నిర్మించారు. ఒక్కో క్వార్టర్‌ను మూడు బెడ్‌రూంలతో 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంతో.. మొత్తం 6 లక్షల చదరపు అడుగుల నిర్మాణం చేపట్టారు. వీటికి అనుబంధంగా 325 చదరపు అడుగుల చొప్పున 120 సర్వెంట్ క్వార్టర్స్‌ను, సిబ్బందికి 36 క్వార్టర్స్ ఉన్నాయి. ఒక్కో సభ్యుడికి రెండుకార్లకు అవసరమైన పార్కింగ్ స్థలాన్ని కేటాయించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో 23 సమావేశ క్యాబిన్లను కూడా ఏర్పాటుచేశారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలను కలువడానికి వీలుగా వీటిని నిర్మించారు.

అమెరికాలో దారుణం

అనుమానాస్పద స్థితిలో ఏపీ కుటుంబం మృతి

భార్య, ఇద్దరు కుమారులను కాల్చిచంపి భర్త ఆత్మహత్య?

మానసిక ఒత్తిడే కారణమని అనుమానం

హత్య కోణంలోనూ దర్యాప్తు జరుపుతున్న పోలీసులు

ఐవోవా: అమెరికాలోని అయోవా రాష్ట్రంలో ఘోరం జరిగింది. వెస్ట్ డెస్ మొయినిస్ నగరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ తెలుగు కుటుంబం శనివారం అనుమానాస్పదంగా మృతిచెందింది. భార్య, భర్త, 15 ఏండ్లలోపు ఇద్దరు పిల్లలు తుపాకీ కాల్పుల గాయాలతో ఇంట్లోనే విగతజీవులుగా పడి ఉన్నారు. ఏపీకి చెందిన సుంకర చంద్రశేఖర్(44), సుంకర లావణ్య(41) దంపతులు తమ 10, 15 ఏండ్లవయసు ఉన్న ఇద్దరు కొడుకులతో కలిసి వెస్ట్‌డెస్ మొయినిస్‌లో సొంత ఇంట్లో నివసిస్తున్నారు. కొంత కాలంగా చంద్రశేఖర్ మానసిక పరిస్థితి సరిగా లేదని స్థానికులు చెప్తున్నారు. తుపాకీ గాయాలతోనే నలుగురు చనిపోయారని పోలీసులు నిర్ధారించారు. కుటుంబసభ్యుల్లో ఒకరు తమను కాపాడాలంటూ ఇంటి ఆవరణలో అరుస్తూ కనిపించారని స్థానికులు తెలిపినట్టు పోలీసులు చెప్పారు. భార్యతో పాటు ఇద్దరు పిల్లలను చంద్రశేఖరే తుపాకీతో కాల్చి చంపి.. ఆపై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. మానసిక ఒత్తిడి కారణంగానే ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటాడని భావిస్తున్నారు. వీరిని ఎవరైనా హత్య చేశారా? లేదా మరేదైనా కారణమా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న చంద్రశేఖర్ బంధువులు ఇచ్చిన సమాచారంతో అక్కడకు చేరుకొని.. మృతదేహాలను పోస్టుమార్టం కోసం స్థానిక దవాఖానకు తరలించారు. చంద్రశేఖర్ ఈ ఏడాది మార్చిలోనే ఇంటిని కొనుగోలు చేశారు.

20న రాష్ట్రానికి నైరుతి!

భారత వాతావరణ కేంద్రం వెల్లడి.. తెలంగాణలో మరో రెండ్రోజులు ఎండలే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నైరుతి రుతుపవనాలు ఈ నెల 20న తెలంగాణను తాకే అవకాశం ఉన్నదని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం కల్లా ఆంధ్రప్రదేశ్‌లోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయని, తర్వాత తెలంగాణలోకి విస్తరించవచ్చని వెల్లడించింది. వాస్తవానికి ఈ నెల 13వ తేదీన రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకుతాయని వాతావరణ కేంద్రం తొలుత అంచనావేసినా.. వాయు తుఫాన్ కారణంగా కొద్దిరోజులుగా రుతుపవనాలు మందగించడంతో ఆలస్యమైందని పేర్కొన్నది. రుతుపవనాల్లో కదలిక మళ్లీ పుంజుకున్నట్టు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లోనూ ఎండల తీవ్రత కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. కోస్తాంధ్ర తీరానికి దగ్గరలో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో 4.5 కిలోమీటర్ల నుంచి 5.8 కిలోమీటర్ల మధ్య ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని, ఈ ప్రభావంతో సోమవారం ఒకటి రెండుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

ఆదివారం రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 43.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, భద్రాద్రి కొత్తగూడెంలో 43.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 38.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో నలుగురు వడదెబ్బతో మృతిచెందారు.

చల్లబడ్డ గ్రేటర్ హైదరాబాద్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్‌లో ఆదివారం వాతావరణం కొంత చల్లబడింది. గాలిలో తేమశాతం పెరుగడంతో వేడిగాలుల తీవ్రత తగ్గి, వాతావరణం చల్లగా మారుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. శనివారం గాలిలో తేమ 29 శాతం నమోదవగా, ఆదివారం 40 శాతానికి పెరిగిందని చెప్పారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 38.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 27.6 డిగ్రీలుగా నమోదైందని వెల్లడించారు.

ఎండాకాలం

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	43.4	31.0
భద్రాద్రికొత్తగూడెం	43.2	30.0
మంచిర్యాల	42.5	31.2
మహబూబాబాద్	42.4	29.3
కరీంనగర్	42.2	30.5
నాగర్‌కర్నూల్	42.2	24.4
పెద్దపల్లి	41.9	31.4
ఆదిలాబాద్	41.8	31.2
రాజన్న సిరిసిల్ల	41.7	29.5
సిద్దిపేట	41.7	27.3
జనగామ	41.4	31.8
నిజామాబాద్	41.1	29.8
యాదాద్రి	41.1	28.1
జగిత్యాల	41.0	29.0
సూర్యాపేట	41.0	27.0
వరంగల్ అర్బన్	40.5	30.5
వరంగల్ రూరల్	40.0	31.0
జయశంకర్	40.0	31.0
ములుగు	40.0	27.0
మెదక్	39.8	26.9
జోగుళాంబ గద్వాల	39.8	26.1
రంగారెడ్డి	39.8	25.3
నారాయణపేట	39.5	25.7
మహబూబ్‌నగర్	39.5	25.7
సంగారెడ్డి	39.5	25.1
వనపర్తి	39.1	26.9
కుమ్రంభీం ఆసిఫాబాద్	39.0	29.0
కామారెడ్డి	39.0	28.0
నిర్మల్	39.0	28.0
నల్లగొండ	38.6	24.4
హైదరాబాద్	38.2	27.6
మేడ్చల్‌మల్కాజిగిరి	38.2	27.6
వికారాబాద్	36.9	24.3

అంగన్‌వాడీలకు ఆదరణ

- ప్రీప్రైమరీలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు
- ఇటు పౌష్టికాహారం.. అటు ఓనమాలు
- గ్రామాల్లో విజయవంతంగా సాగుతున్న బడిబాట

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామాల్లో అంగన్‌వాడీ పాఠశాలలకు ఆదరణ పెరుగుతున్నది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కలిగే లాభాలను వివరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమానికి మంచి స్పందన వస్తున్నది. రాష్ట్రంలో 35,400 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో గతేడాది నమోదైన చిన్నారుల సంఖ్య 16.91 లక్షలు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యలక్ష్మికి శ్రీకారం చుట్టింది. గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతిరోజూ కోడిగుడ్డుతో మధ్యాహ్న భోజనం, ఉదయం, సాయంత్రం పాలు, పప్పులు, ప్రొటీన్లతో కూడిన ఆహారం అందించేవిధంగా ఆరోగ్యలక్ష్మిని ప్రవేశపెట్టారు. దీంతో అంగన్‌వాడీకేంద్రాలకు వచ్చే గర్భిణుల సంఖ్య పెరిగింది. బాలింతలకు కూడా ఇదే మెనూ ఇస్తున్నారు. చిన్నారులకు బాలామృతంతో ప్రొటీన్లు, విటమిన్లు కల్గిన ఆహారం అందిస్తున్నారు.

ఓనమాలు నేర్చి.. పెద్దబడికి

అంగన్‌వాడీల్లో చిన్నారుల నమోదు గతంలో పోలిస్తే 300 శాతానికిపైగా పెరిగింది. ఆట వస్తువులు అందుబాటులో ఉంచడం, సమయానుకూలంగా పౌష్టికాహారం పెట్టడం, సంరక్షణ బాధ్యతలు తీసుకుంటుండటంతో చిన్నారులు అంగన్‌వాడీల్లోనే ఓనమాలు దిద్దుతున్నారు. అంగ్‌వాడీల్లో ఓనమాలు నేర్చుకున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీల నుంచి సర్కారు పాఠశాలలకు వెళ్లేవారి శాతం దాదాపు 80 శాతంగా నమోదవుతున్నది.

పేదింటి ప్రయోజనాల కోసమే..

అంగన్‌వాడీల నిర్వహణ చాలా మెరుగుపడటంతో చిన్నారులను అంగన్‌వాడీలకు తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు సఫలమవుతున్నాయి. చిన్నారులకు మంచి ఆహారాన్ని అందించడంతోపాటు అవసరమైతే వారు ఇంటికి వెళ్లేదాకా బాధ్యత తీసుకుంటున్నాం.

- భక్షవమ్మ, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు

బహుళ ప్రయోజనాలు

అంగన్‌వాడీల్లో బహుళ ప్రయోజనాలు అందుతున్నాయి. గర్భిణులకు మంచి ఆహారాన్ని అందిస్తున్నాం. బాలింతలు, చిన్నారులకు కూడా పౌష్టికాహారం ఇస్తుండటంతో అంగన్‌వాడీలపై నమ్మకం పెరిగింది. దీంతో తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకే పంపుతున్నారు.

- నిర్మల, అంగన్‌వాడీ టీచర్

కొనసాగుతున్న ఉత్తరాధికారి దీక్షాక్రతువు

- వేద పండితులు, శాస్త్ర మహాపాధ్యాయుల పర్యవేక్షణ
- వైభవంగా శాస్త్ర, వాక్యార్థ మహాసభలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం
- నేటితో ముగియనున్న సన్యాసదీక్షా ప్రక్రియ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విశాఖ శారదాపీఠం వారసుడి నియామక ప్రక్రియ విజయవాడలో సంప్రదాయబద్ధంగా కొనసాగుతున్నది. మూడురోజులపాటు కొనసాగే ఈ సుదీర్ఘ ప్రక్రియ ఆదివారం ద్వితీయపర్వంలోకి అడుగుపెట్టింది. విజయవాడ దుర్గమ్మ పాదసన్నిధిలో గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమంలో కిరణ్‌కుమార్‌శర్మ సన్యాసదీక్షా క్రతువు శనివారం నుంచి వేదోక్తంగా జరుగుతున్నది. అపరశంకరులు విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర మహాస్వామి పర్యవేక్షణలో ఉత్తరాధికారి తురీయాశ్రమ దీక్షా స్వీకారం చేస్తున్న కిరణ్‌కుమార్‌శర్మ.. ఉదయాన్నే మహాగణపతి, అమ్మవారికి పూజలు చేశారు. సన్యాసదీక్షలో భాగంగా స్వరూపానందేంద్రస్వామి.. శారదాచంద్రమౌళీశ్వరులకు అర్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు కన్నుల పండువగా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. పుణ్యజలాలు, పంచామృతాలతో చేపట్టిన అర్చన అభిషేకాలు భక్తజనావళిని ఆధ్యాత్మిక లోకంలో విహరింపజేశాయి. మరోవైపు బాలస్వామి సన్యాసదీక్ష స్వీకార ప్రక్రియ కూడా ఘనంగా సాగింది. కర్ణాటకకు చెందిన మత్తూరు వేదపండితులు ఈ కార్యక్రమాన్ని శ్రద్ధాభక్తులతో జరుపుతున్నారు. సన్యాస స్వీకరణకు సంబంధించి సన్యాసాంగ ప్రక్రియలు కొనసాగాయి. ఈ సందర్భంగా వ్యాకరణ, తర్క, మీమాంస సహా ఆరు శాస్త్రాలను ఔపోసన పట్టిన ఆధ్యాత్మికవేత్తలు శాస్త్రసభలు నిర్వహించారు. ఆదివారం కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ మంత్రి మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కరణం ధర్మశ్రీ, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తదితరులు స్వామి వారి ఆశీస్సులు పొందారు. కిరణ్‌కుమార్‌శర్మ విద్వన్మణి అని స్వరూపానందేంద్రస్వామి కొనియాడారు. వేదవేదాంగాలు, ధర్మశాస్త్రాలను ఔపాసనపట్టిన వారసుడు పీఠానికి లభించినందుకు హర్షం వ్యక్తంచేశారు.

తెలంగాణ ప్రసాదాలు అందజేత..

శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి ఆధ్వర్యంలో ఏపీలోని విజయవాడలో ఆదివారం నిర్వహించిన ఉత్తరాధికారి శిష్య సన్యాసాశ్రమ మహోత్సవంలో తెలంగాణ అర్చక సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని పలు ఆలయాల నుంచి తీసుకెళ్లిన తీర్థ, ప్రసాదాలను అక్కడ అందించారు. శారదాపీఠాధిపతి ఉత్తరాధికారి కిరణ్‌కుమార్‌శర్మ (బాలస్వామి) పరిచయ వేదికను పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులతో ఈ నెల 26న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించనున్నట్టు ఈ సందర్భంగా తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్‌తో పాటు వివిధ పీఠాలకు చెందిన స్వాములు హాజరుకానున్నారని, రాష్ట్రంలోని బ్రాహ్మణులంతా ఇందులో పాల్గొనాలని కోరారు. సోమవారం విజయవాడలోని శారదాపీఠంలో జరుగనున్న ఉత్తరాధికారి సన్యాసాశ్రమ స్వీకారోత్సవానికి తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. స్వరూపానందేంద్ర స్వామిని కలిసిన వారిలో అర్చక సమాఖ్య ప్రతినిధులు వల్లూరి పవన్‌కుమార్, జీవీఎస్ శ్రీనివాసాచార్యులు తదితరులు ఉన్నారు.

కిరణ్‌కుమార్‌శర్మ సన్యాసదీక్షా క్రతువులో భాగంగా రెండో రోజు పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్ రూరల్: ప్రేమించి పెండ్లి చేసుకుంటానని మాటిచ్చి మోసం చేశాడంటూ ఓ యువతి ప్రియుడి ఇంటి ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన ఆదివారం ఆదిలాబాద్ జిల్లా మావల మండలం వాగాపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. బాధితురాలి కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రామోజీపేటకు చెందిన మంజుల హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో మావల మండలం వాగాపూర్ గ్రామానికి చెందిన రాజారెడ్డితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. నాలుగేండ్లపాటు ప్రేమించుకున్నారు. పెండ్లి చేసుకోవాలని కోరగా.. ప్రియుడు నిరాకరించాడు. దీంతో మనస్తాపానికి గురైన మంజుల ఆదివారం వాగాపూర్‌లోని రాజారెడ్డి ఇంటి ఎదుట ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు స్పందించి ఆమెను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని తోట ఎన్‌క్లేవ్‌లో ఆదివారం బాలల పరిరక్షణ విభాగం, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహాలక్ష్మి అనే అనాథ యువతికి, సుంకరి యాకయ్య అలియాస్ రాజు అనే యువకుడికి అధికారులు వివాహం జరిపించారు. ఈ వివాహవేడుకకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి తిరుమలాదేవి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి సంతోష్‌కుమార్, నగర మేయర్ గుండా ప్రకాశ్‌రావు, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు ఆశ్రితరెడ్డి, గుండు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

- న్యూ శాయంపేట (వరంగల్)

అతివేగానికి కళ్లెం!



హద్దుమీరే వాహనాలపై పోలీసుల దృష్టి

లేజర్ స్పీడ్‌గన్లతో చోదకులకు చలాన్ల వాత

కొత్తగా మరో 30 స్పీడ్‌గన్ల కొనుగోలు

వేగ నియంత్రణే లక్ష్యంగా సిబ్బందికి శిక్షణ

ఫలితమిస్తున్న చర్యలు.. తగ్గుతున్న ప్రమాదాలు

2017లో రాష్ట్రంలో 1,36,999 రోడ్డు ప్రమాదాలు

54 శాతం ప్రమాదాలకు అతివేగమే కారణం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మితిమీరిన వేగంతో దూసుకెళ్లే వాహనాలకు కళ్లెం వేసేందుకు పోలీసు శాఖ చర్యలు చేపడుతున్నది. ఏటా రోడ్డు ప్రమాదాల్లో వేలమంది ప్రాణాలు కోల్పోతుండటం, మితిమీరిన వేగమే ఇందుకు కారణమని శాస్త్రీయ అధ్యయనంలో తేలడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్‌స్పాట్స్‌గా గుర్తించారు. ఈ బ్లాక్‌స్పాట్స్‌లో నిఘాను మరింత పెంచి రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా పోలీసు శాఖ చర్యలు ప్రారంభించింది. గతంలో హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్‌తోపాటు కొన్ని జిల్లా కేంద్రాల్లో వాడిన లేజర్ స్పీడ్‌గన్స్‌ను అన్ని జిల్లాల్లో వాడేందుకు ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 28 లేజర్ స్పీడ్‌గన్స్‌కు అదనంగా మరో 30 లేజర్ స్పీడ్‌గన్స్‌ను కొనుగోలు చేసింది. వీటి వాడకంపై అన్ని జిల్లాల, కమిషనరేట్ల సిబ్బందికి డీజీపీ కార్యాలయంలోని లెర్నింగ్ సెంటర్‌లో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు.

తప్పుచేస్తే తక్షణమే చలాన్

తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలతో పాటు వాహనాల వేగం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బంది లేజర్ స్పీడ్‌గన్స్‌తో మాటువేసి ఉంటారు. స్పీడ్‌గన్‌తో టార్గెట్ చేసిన ఏ వాహనాన్నయినా ఫొటో తీయవచ్చు. డాప్లర్ సిద్ధాంతం ఆధారంగా పనిచేసే స్పీడ్‌గన్ ఆ వాహన వేగాన్ని లెక్కిస్తుంది. వేగం పరిమితికి మించితే వెంటనే ఆ వాహనదారుడికి చలాన్ వెళుతుంది. అయితే గతంలో ఈ ఫొటోలను సర్వర్‌కి పంపి నిబంధనలను అతిక్రమించినట్టు గుర్తించిన తర్వాత చలాన్లు పంపేవారు. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన 30 లేజర్ స్పీడ్‌గన్స్‌తో వేగంగా వెళ్లే వాహనాన్ని ఫొటో తీయగానే ఆ ఫొటోతోపాటు వాహన నంబర్‌ప్లేట్ వివరాలు ఆటోమ్యాటిక్‌గా సర్వర్‌కి వెళ్తాయి. దీంతో వెంటనే చలాన్ జనరేట్ అవుతుంది. వాహనదారుడు 200 మీటర్ల దూరం వెళ్లేలోపే అతడి ఫోన్‌కు మెసేజ్ రూపంలో చలాన్ వెళ్తుంది. ఒక రోజులో ఎన్నిసార్లు మితిమీరిన వేగంతో స్పీడ్‌గన్‌కు దొరికితే అన్నిసార్లు చలాన్లు వస్తూనే ఉంటాయి. దీని వల్ల వాహనదారుల్లో బాధ్యత పెరుగుతుందని, నిబంధనలను పాటించేలా చూడటం ద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషరేట్ల పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డులో లేజర్ స్పీడ్‌గన్స్‌ను వినియోగించి 2016లో 13,008 కేసులు, 2017లో 3,35,331 కేసులు, 2018లో 5,07,605 కేసులు, 2019 ఫిబ్రవరి వరకు 99,892 కేసులు నమోదు చేసినట్టు పోలీస్ అధికారులు వెల్లడించారు.

రాష్ట్రంలోని వేర్వేరు పోలీసు కమిషనరేట్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల (బ్లాక్‌స్పాట్స్) సంఖ్య

కమిషనరేట్ పేరు	2016	2017	2018	2019
హైదరాబాద్	52	50	49	50
సైబరాబాద్	31	29	29	28
రాచకొండ	30	30	30	30
కరీంనగర్	03	10	06	0
ఖమ్మం	09	10	10	10
నిజామాబాద్	07	10	09	08
రామగుండం	10	09	10	01
సిద్దిపేట	10	10	10	10
వరంగల్	18	09	05	10
మొత్తం	170	167	158	147

అతివేగం వల్లనే 54 శాతం ప్రమాదాలు

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) గణాంకాల ప్రకారం 2017లో రాష్ట్రంలో మొత్తం 1,36,999 రోడ్డు ప్రమాదాలు జరుగగా.. వీటిలో 54 శాతం (73,896 ప్రమాదాలు) అతివేగం వల్ల జరిగినవే. ప్రమాద మృతుల్లో 18 నుంచి 35 ఏండ్ల లోపువారే ఎక్కువగా ఉంటున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం జాతీయ రహదారులు, ఔటర్ రింగ్ రోడ్డుల్లో గరిష్ఠ వేగం గంటకు 100 కి.మీ. మించరాదు. ఇది వాహనాలను బట్టి మారుతుంది. అలాగే ఇతర రహదారుల్లో గరిష్ఠ వేగం గంటకు 60 కి.మీ. మించకూడదన్న నిబంధన ఉన్నది. ఈ నిబంధనలను వాహనదారులు అతిక్రమిస్తుండటంతో వేగాన్ని కట్టడిచేసేందుకు లేజర్ స్పీడ్‌గన్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. వీటితోపాటు సిబ్బందిని బ్లాక్‌స్పాట్స్‌లో ఉంచి మితిమీరిన వేగంతో వెళ్లే వాహనచోదకుల్లో మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
సాగు నీటి పారుదల వలయము, నిజామాబాద్ జిల్లా
టెండరు ప్రకటన
టెండరు నోటీసు నంబరు No.01/2019-20 మరియు తేది: 07-06-2019 పనులకు గాను రూ. 191.49 లక్షలకు లభ్యమగు తేది: 13-06-2019 నుండి 20-06-2019 వరకు టెండర్లు ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.inలో చూడగలరు.
సం/- పర్యవేక్షక అభియంత, సాగు నీటి పారుదల వలయము, నిజామాబాద్ జిల్లా.
DIPR R.O.No. 159PP/CL/Advt/1/2019-20 తేది: 15-06-2019

Professor Jayashankar Telangana State Agricultural University
Administrative Office: Rajendranagar: Hyderabad-30, Telangana State, India
ADMISSION NOTIFICATION
Advt. No. 5998/EXAMS/2019(1) Date:15-06-2019
ONLINE Applications are invited from eligible candidates for admission into MPC stream courses viz., B.Tech. (Agricultural Engineering) and B.Tech. (Food Technology) under Farmers Quota for the academic year 2019-20. The last date for submission of online application is **12-07-2019 (4 PM)**. For details visit University website **www.pjtsau.edu.in**
Dr. S. SUDHEER KUMAR, REGISTRAR

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD
Kukatpally, Hyderabad - 500 085, Telangana, INDIA
Advt.No. JNTUH / Admissions/CMU-MBA/2019 Dt.15.06.2019
MBA from JNTUH & CMU-USA Admission Notification 2019-20
Applications are invited from the eligible candidates for admission into MBA program in collaboration with **Central Michigan University (CMU), USA** for the academic year 2019-20.
Course duration: 2 years, first year of study at JNTUH and the second year at CMU, USA. Eligibility Criteria, application, instructions, time table for entrance test etc., are available on the University website www.jntuh.ac.in. Interested candidates can submit application with all necessary documents and a crossed Demand draft **for Rs.1000/-** drawn in favour of the **Registrar, JNT University Hyderabad**, to the **Director, Admissions, JNTUH, by 03.07.2019 with a late fee of Rs.1000/- by 10.07.2019.**
Sd/- REGISTRAR

యాదికొస్తున్నయ్

ఇంతకు మునుపు
గుక్కెడు నీళ్ళ కోసం ఎక్కడెక్కడ తిరిగినం..?
ఎంతయాజ్ఞన జేసినం..?
అదిప్పుడు పీడకల లెక్కున్నది
కాయలుగాసిన భుజాలనడుగు
నీటివిలువ కండ్లవడ్డది
బొబ్బలొచ్చిన పాదాలనడుగు
మైళ్ళ దూరం నడిచిన ఆనవాళ్ళను చూపెడ్తది
పిడుచ గట్టిన నాలుక
తడిలేని పెదాలు
నీరింకిన గుండె
నేలరాలని చినుకు
కంటినుండి జారే కన్నీటి చుక్క

కూతవేటు దూరంలో కనిపించే ఎండమావులు
నీళ్ళకోసం..
ప్రాణమిచ్చే మిత్రులం
దుమ్మన్లమైన దినాలు
ఆ యాది ఎట్లామరుస్తం..!
గుండెచెరువైనప్పుడు చెరువు గుండె మూగవోయింది
అందుకు
చెరువు మీద మొలిచిన ఇండ్లే సాక్ష్యం!
అప్పుడు
నా ఊరు తపస్సమాధిలో కూర్చున్న మహర్షి!
పల్లె పట్నమైనా
పట్నం పల్లెకుబోయినా
ముందు పలుకరించేది నీళ్ళికదా..!
వీడిపోయిన బంధాలు కలిసేది అప్పుడే కదా
ఇప్పుడు..
నెలరాలిన చినుకులు నడకనేర్చినయ్
ఇసుకపోలంలో ఎవుసం జరుగుతున్నది
మూలకు బడిన నాగళ్ళు పొలందున్నుతున్నయ్
చెరువులు నిండుకుండలైనయ్
ఇప్పుడు..
పురుడు బోసుకున్న నిండుచూలాలు
మా ఊరి చెరువు
దోసిట్లకు తీసుకున్న నీటిలో
మా భవిష్యత్తు గోచరిస్తున్నది.. ...!

–జయంతి వాసర చెట్ల
9985525355

తెలుగువారి జీవన విధానాన్ని నిర్దేశించిన నీతి శాస్త్రము వంటి గ్రంథం సుమతి శతకం. దీనికర్త బద్దెన భూపాలుడు. బద్దెన కవిత్రయ యుగానికి చెందినవాడే. సుమతి శతకం రచింపబడిననాటి నుంచి ఈనాటివరకు తెలుగు వాళ్ల నాలుకల మీద నర్తిస్తున్నది. నా చిన్నతనంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న రోజులలో మౌఖికంగా సుమతి శతకాన్ని పాఠంగా చెప్పేవారు. సుమతి శతకంలో భాష అతి సరళమైంది. సులభగ్రాహ్యమైంది. దానిలో వాడిన ఛందస్సు కందము. ఆనాటి నుంచి కవిత్వాభ్యాసం చేసే కవులు ఈ శతకం ద్వారా కంద పద్య రచనలోని మెళకువలను అవగతం చేసుకుంటున్నారు.

వ్యక్తిత్వ వికాస 'సుమతి'

తెలుగు శతక సాహిత్యంలో శతకాలు దైవభక్తిని ప్రచారం చేయడం కోసం ప్రారంభమైనా తర్వాత సమాజ స్థితికి దర్పణంగా అనేకాంశాలను చర్చించడం, వివేచించటం, వ్యాఖ్యానించటం ప్రధానాంశంగా పెట్టుకున్నారు. అలాంటి వాటిలో ప్రాథమికంగా వెలువడిన వాటిలో సుమతి శతకం అగ్రగణ్యమైంది. ఈ కర్త బద్దెన భూపాలుడు ఏ ప్రాంతంలో ఉండేవాడో ఏ ప్రాంతాన్ని పరిపాలించాడో ఇదమిత్థంగా తేల్చి చెప్పలేమని సుమతి శతక పరిశోధకులు డాక్టర్ మచ్చహరిదాసు వెల్లడించారు. ఆయన కాలం సుమారు క్రీ.శ. 1300 అని ఆయన నిశ్చయం.

సుమతి శతకం పద్యాల సంఖ్య నూటికి మించి ఉన్నట్లు తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి ప్రతిలో 150 పద్యాలు ఉన్నాయని తాము మరొక 56 పద్యాలను అదనంగా సేకరించినట్టు డాక్టర్ మచ్చహరిదాసు పేర్కొంటున్నారు. తెలుగు నీతి శతకాలలో కంద పద్య శతకాలే గాక, భాస్కర శతకం వంటి వృత్తాల రచనలు, వేణుగోపాల శతకం, ధర్మపురి లక్ష్మీనారసింహ శతకం వంటి సీస పద్య శతకాలు, ఆటవెలదిలో రాసిన వేమన శతకాలు ఇలా అనేక ఛందస్సులలో పరివ్యాప్తమై ఉన్నవి. ఇవి కాక 'ఆంధ్ర నాయక శతకం' వంటి అధిక్షేప శతకాలు, గోగులపాటి కూర్మనాథ కవి రచించిన 'సింహాద్రి నారసింహ శతకం' వంటి శత్రువుల వలన కలిగే బాధలను వర్ణించిన శతకాలు, ఆనాటి కాలంలో అల్లకల్లోలాలను ప్రతిబింబించే రచనలలో ప్రకాశించేవీ ఉన్నాయి.

తెలుగు పద్య సాహిత్యంలో భారత భాగవతాలను పక్కనపెడితే అధిక వ్యాప్తిలో పఠన పాఠనాలలో ఉన్నవి శతకాలుగానే పేర్కొనవచ్చు. శతకాలలో ప్రధాన లక్షణం సమాజగతిలోని అవకతవకలు, అపసవ్య లక్షణాలు ఆపదలు కలిగించే సన్నివేశాలు వర్ణింపబడుతూ వాటికి పరిష్కారాలు సూచింపబడుతూ ఉన్నవి. సాధారణంగా ఉపదేశం చేసే అంశం ఉపమానంగా, తార్కాణంగా లోకవృత్తి దర్శనంగా కాన వస్తుంది. వేణుగోపాల శతక కర్త లాంటి వారి వాక్కు చురుకుగా, కఠినంగా కానవస్తుంది. ఇతర శతకాలలో ఇది మృదువుగా, మిత్ర వ్యాక్యంగా చెప్పబడుతున్నది. 'సుమతి' శతకంలోని కొన్ని పద్యాల్లో రాజనింద కూడా కనిపిస్తుంది. ఈ కారణంగా ఆయన రాజు కాడేమోనని సుమతి శతక పరిశోధకులు అనుమానిస్తున్నారు. కానీ ఇది సామాన్యమైన దృష్టిలో చూస్తే ఆక్షేపణీయమైనదిగా కనిపించదు. కవి కావ్య నిర్మాణంచేసే వేళలో తాను తన పరిమితమైన వ్యక్తిత్వ పరిమితుల నుంచి బయటపడి సాధారణీకరణం పొంది మొత్తం సమాజ చైతన్యంలో తన్మయత్వం చెంది రచనచేస్తాడు. ఆముక్తమాల్యద వంటి కావ్యాలలో కూడా రాజుల మధ్య వైరుధ్యాలు, దోషాలు, వర్ణనల సందర్భంలో ఆక్షేపణలు కనిపిస్తాయి అందువల్ల బద్దెన.. భూపాలుడు కాడని అనుమానించవలసిన అవసరం లేదు.

ఈ శతక ఆరంభంలో కవి చేసిన ప్రతిజ్ఞ ఇలా ఉన్నది. **'ధారళమైన నీతులు నోరూరగ చవులు పుట్ట నుడివెద సుమతీ'** అని అన్నచోట లోకానికి అన్వయించే లోపాలను ఎత్తిచూపే అనేకాంశాలు, నీతులు ధారాళంగా వెల్లడిస్తాననీ, వాటిని వినేందుకు రుచి కలుగుతుందనీ, ఆసక్తి పెరుగుతుందనీ వెల్లడిస్తున్నాడు.

ఒక పనిచేసే కార్మికుడు, చిన్న ఉద్యోగి తమ జీవితం గడపడానికి ఒక యజమాని మీద ఆధారపడుతారు. అతడు వేళకు తగినట్లు వేతనం చెల్లించక పోతే కేవలం మిడిమేలపు పలుకులు పలుకుతూ ఉంటే అతని కొలువు చేయడం అవసరమని, ఆ ఉద్యోగం వదలి స్వతంత్రంగా కృషి చేయడం మంచిదని తొలిపద్యంలో వివరిస్తాడు. 700 ఏండ్ల పూర్వం స్వతంత్రంగా వ్యవసాయం చేసుకోవడం గౌరవప్రదమైన జీవనానికి సాధనం కావచ్చు. కానీ ఈనాడు భూమి దున్నడం, వ్యవసాయం చేయడం లాభసాటి వృత్తి కాకుండాపోయింది. వ్యక్తి స్వాతంత్ర్యం అణిగిపోయింది. అనేక వ్యవస్థల మీద కర్షకులు ఆధారపడి ఉండవలసిన పరిస్థితి వచ్చింది. ఎరువులను సంపాదించటం, పంట పొలాన్ని వేయి కండ్లతో కాపాడటం, ఫలసాయాన్ని ఇంటికి తెచ్చుకోవడం, దాన్ని అమ్ముకోవటం.. ఇవన్నీ ఈ రోజు క్లిష్టమైన అంశాలే ఐనాయి. ప్రభుత్వం జోక్యంచేసుకోవటం అన్ని స్థాయిల్లోనూ అనివార్యంగా కానవస్తున్నది. ఈ అంశమంతా **'అడిగిన జీతంబియ్యని'** అన్న పద్యంలో కవి బొమ్మ కట్టించాడు.

నిత్య జీవనంలో బంధువులతో కూడిన కుటుంబం, విశాలమైన కుటుంబం సమష్టి జీవనవ్యవస్థలో పరస్పర సహకారం, ఇబ్బందులను తొలిగించి అందరికీ సహకరిస్తూ సుఖ దుఃఖాలను శుభాశుభాలను పంచుకొనే అవకాశం కలిగిస్తున్నది. ఈ బాంధవ్య సందర్భంలో తన కర్తవ్యాన్ని తాను వివరించకపోతే ఆ బంధుత్వం వ్యర్థమైనదే అవుతుంది. ఈ అంశాన్ని సుమతి శతకకారుడు **'అక్కరకు రాని చుట్టము'** అని పరిత్యజించదగిన అంశాలలో ఒకటిగా వివరిస్తాడు. ఐతే సంసారయాత్రలో అందరు బంధువుల విషయంలోనూ అది చెల్లుబాటు అయ్యే అంశం కాదు. అందుకే బద్దెన **'దూరకుమీ బంధుజనుల'** అని మరొక చోట అంటారు. రక్త సంబంధం కలిగి ఉండటం వల్ల బంధువులు తరతరాలదాకా సన్నిహితంగా కొనసాగుతారు. లోకంలో మామూలు స్నేహం ఇంతటి దీర్ఘకాల అనుబంధం కలది కాదు. ఇలా లోక లక్షణాన్ని వెల్లడిస్తూ కవి అక్కరకు రాని చుట్టమే కాకుండా వరమీయని వేల్పును, యుద్ధంలో సహకరించని వాహనమైన గుఱ్ఱాన్ని కూడా పరిత్యజించవలసినదిగా మొహమాటం లేకుండా **'గ్రక్కున విడువంగ వలయు'**నని వెల్లడిస్తాడు.

నివాసయోగ్యమైన ప్రదేశాన్ని ఎన్నుకునేటపుడు ఏయే అంశాలు ప్రధానమైనవో బద్దెన ఒక పద్యంలో వివరిస్తాడు.

'అప్పిచ్చువాడు, వైద్యుడు
ఎప్పుడు నెడతెగక పారు నేరును, ద్విజుడున్
చొప్పడిన యూరనుండుము
చొప్పడకున్నట్టి యూర జొరకుము సుమతీ..'

ఒక గ్రామం వాసయోగ్యమైనదిగా ఉండటానికి అవసరమైన అంశాలు ఈ పద్యంలో చెప్పబడినవి. 1) అత్యవసరమైన సందర్భములలో అక్కరను తీర్చే ధన సహాయం చేసే ఋణమిచ్చే ఋణదాత అవసరం. 2) రోగాలు నొప్పులు వచ్చినా ఏ రాత్రైనా పగలైనా మందు మాకు ఇచ్చే వైద్యుడు ఉండాలి. ఈ వైద్యుడికి ఆ కుటుంబానికి అవిచ్ఛిన్నమైన సంబంధం ఉండటం వల్ల వారి వారి శరీర తత్వాలు, వాత, పిత్త శ్లేష్మ లక్షణాలు బాగా తెలిసి రోగాన్ని వెంటనే నిర్ణయించి మందులిచ్చి బాధా నివారణ చేయగలవాడు వైద్యుడు ఉండాలి.

3) ఆ గ్రామంలో తాగడానికి, పంటల సాగుకై నిరంతరం జలాన్ని అందించే ఒక చిన్న ఏరైనా ఉండాలి. జనులు జలముంటేనే జీవనం కొనసాగించగలుగుతారు. 4) ద్విజుడంటే మానవునికి విజ్ఞానానికి సేతువు వంటి వాడు. అధ్యాపకుడు కావచ్చు. శుభాశుభాలు తెలియస్తే కార్తాంతికుడు కావచ్చు. దైవ ఆరాధనచేస్తూ ప్రజల భక్తిని నిరంతరం పుష్చింపజేసే అర్చకుడు కావచ్చు. ఈ మూడు అంశాలు ద్విజుడు అన్న శబ్దాన్ని విశదపరుస్తాయి. ఈ విధంగా నివాసయోగ్యమైన గ్రామ లక్షణాల్ని బద్దెన చెప్పిన నాటి నుంచి ఈనాటి వరకు విస్తృతార్థంలో అన్వయం చేసుకోవచ్చు. ఆర్థిక సంస్థలు, వైద్యాలయాలు, జల సంపద, విద్యా ఆధ్యాత్మిక సంస్థలు ఈనాటికీ బృహద్రూపంలో కానవస్తాయి.

ఈనాడు ధన సంపాదన జీవనానికి ప్రధాన లక్ష్యంగా మారింది. అన్ని సుఖాలనూ సాధించడానికి ధనమే ముఖ్యకారణమౌతున్నది. ఈ కాలంలో ఒకనాటి పేదవాడు కోటీశ్వరుడుగా మారిపోతున్నాడు. ఒకనాటి ధనికుడు నిర్ధనుడై అనేకమైన అగచాట్లను పడుతున్నాడు. ఈ రెండు రకాలైన వ్యవస్థల్లోనూ సమస్థితి కోల్పోకుండా తనను తాను సంభాళించుకొన్నవారు చిరమైన సుఖాన్ని కోల్పోకుండా అన్నీ సాధించుకోవచ్చు. ఐశ్వర్యం వస్తే కొబ్బరికాయలో నీళ్ళలాగ స్వయంభువుగానే వస్తుంది. అట్లాగే దారిద్ర్యం కూడా ఏనుగు మింగిన వెలగ పండులాగా గుజ్జునంతా పోగొట్టుకొని డొల్ల అయిపోతుంది. ఈనాడు అనేకులు అక్రమార్జన చేసినవాడు అధికారులు పరిశీలించినప్పుడు ఆదాయం మూలాలు చెప్పలేక తబ్బిబ్బుపడి అన్నీ కోల్పోవడం మనం చూస్తూనే ఉన్నాము.

> పాఠశాలలో విద్యాభ్యాస సందర్భంలో లేత వయస్సులో బాలల్లో సామాజిక చింతనను, సమష్టి బాధ్యతను ఆ వ్యక్తి సంపూర్ణ మానవుడుగా ఎదగడం కోసం వ్యక్తిత్వ నిర్మాణం కోసం, సమాజ సామరస్యం కోసం సుమతి శతకం వంటివి తమ బాధ్యతను శక్తిమంతంగా తీర్చిదిద్దుతాయి. శ్రమలేకుండా ముఖస్థమయ్యే ఈ పద్యాలు ఎన్ని తరాలైనా ముందుకు కొనసాగించగలవని నాకు తోస్తున్నది.

ఈ విధంగా సుమతి శతకంలోని ప్రతి పద్యాన్ని పరిశీలిస్తే సమాజంలోని అనేక దృశ్యాలు కళ్ళ ముందుకు సాక్షాత్కరింపజేస్తుంది. ఒక్కొక్క పద్యంలో చెప్పిన అంశాలు ఏ కాలానికైనా అన్వయించేట్టుగా ఉంటవి. ఏదో ఒకటి రెండు సందర్భాల్లో తప్ప.

పాఠశాలలో విద్యాభ్యాస సందర్భంలో లేత వయస్సులో బాలల్లో సామాజిక చింతనను, సమష్టి బాధ్యతను ఆ వ్యక్తి సంపూర్ణ మానవుడుగా ఎదగడం కోసం వ్యక్తిత్వ నిర్మాణం కోసం, సమాజ సామరస్యం కోసం సుమతి శతకం వంటివి తమ బాధ్యతను శక్తిమంతంగా తీర్చిదిద్దుతాయి. శ్రమలేకుండా ముఖస్థమయ్యే ఈ పద్యాలు ఎన్ని తరాలైనా ముందుకు కొనసాగించగలవని నాకు తోస్తున్నది.

సుమారు యాభై సంవత్సరాలకు పూర్వం ఈ శతకాన్ని యస్టీజీ వరదాచార్యులు సంస్కృతంలోనికి పరివర్తం చేశారు. 1960 ప్రాంతాలలో ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు 'కుమతీ శతక'మనే పేర దీనికొక పేరడీ రచనచేశారు.

– కోవెల సుప్రసన్నాచార్య

వాడిపోని పూల కోసం..

వడగాడ్పుల నెదుర్కుంటున్న
కవిత్వం తోటలో
వాడిపోని పూలేమైనా ఉన్నాయేమోనని
వెతుక్కుంటూ
కొత్త కవుల అంతరంగపు చేదబావిలో
మలినం కాని మంచినీళ్ళను
చేదుకుంటా
సమావేశపు నీలాకాశం లోపల
ఎన్నడైనా ఒకటీ అరా
మెరుపు మెరవడం చూసి
మురుస్తుంటా..
విచ్చుకుంటున్న పత్తితోట మీద
ఎప్పుడైనా ఒక అనుకూలవు
జల్లు కురుస్తుందేమోనని
కాచుకుంటా..
అనేకమైన సెలయేళ్ళ
ఒక ఒడుపైన లోయలో
కలిసి నదిగా రూపెత్తినట్లు
కలగంటా..
కాకులు కలిసిన చెట్టు మీద
పాడీ పాడీ
ఏదైనా కోకిల స్వరం
సంతరించుకుందేమోనని
వేచి చూస్తుంటా..

సభలకు అంతంత సమయం
ఎందుకు పెడతావంటే
ఏం చెప్పను..!
మాతృభాషలోనే కాక
సరళ వ్యవహారపు సద్గ్రంథం
చదువుతున్నానని
ఎలా చెప్పను...

–ఏనుగు నరసింహారెడ్డి
8978869183

కల



ఓ కలేదో
నన్ను తప్పించుకు తిరుగుతున్నది!

కలగనడం నాకిష్టమే
నా హక్కు గూడా
అమ్మ ఒళ్ళో కళ్ళు తెరిచినప్పటి నుండీ
చుట్టూరా అనేక కలలు..!

కొన్ని కలల్ని నేనందుకున్నాను
మరికొన్ని కలలు నన్నందుకున్నాయి

న్యూనతకూ ఆత్మ విశ్వాసానికీ నడుమ
నిద్రకూ మెలకువకూ నడుమ
కలల ఊగిసలాట..!
నాకూ కలలకూ నడుమ
ఈ దోబూచులాట మొదటినుంచీ వున్నదే..
కొన్ని కలలు సొగసైనవి
మరికొన్ని గడుసైనవి

కళ్ళు తెరిస్తే ఏముంది
గడుసైన కలలు అదృశ్యమవుతాయి
గ్లాసేడు నీళ్ళు గట గటా
తాగితే కానీ మనసు నిమ్మళం కాదు!

సొగసైన కలలు
ఊహల్లో నుంచీ ఆలోచనలోనుంచీ పుడతాయి
తెరిచినా మూసినా
కళ్ల ముందు కదలాడుతాయి
కంట్లోంచి ఇంట్లోకి..
ఇంట్లోంచి వూర్లోకి..
వూర్లోంచి మైదానంలోకి.. అడవిలోకీ..
విస్తరిస్తాయి...

అవును
కలగనడం నాకిష్టమే
నా హక్కు గూడా

కానీ ఓ కలేదో
నన్ను తప్పించుకు తిరుగుతున్నది..!
గాలంతా బరువు బరువు
వూపిరాడని స్థితి

ఏమో..
బహుశా ఆ కలనుంచి
నేనే తప్పించుకు తిరుగుతున్నానేమో ...

–వారాల ఆనంద్, 9440501281

ప్రకటన

'ఉద్యమం ఉద్యమమే' ఆవిష్కరణ సభ

సామాజిక ఉద్యమకారుడు, కవి, రచయిత ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ రచించిన 'ఉద్యమం ఉద్యమమే' కవితా సంకలనం ఆవిష్కరణ సభ 2019 జూన్ 18న మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో జరుగుతుంది. డాక్టర్ అయాచితం శ్రీధర్ అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా కె.శివారెడ్డి, వాసిరెడ్డి నవీన్, ఆచార్య కె. సుధీర్‌కుమార్, డాక్టర్ నాళేశ్వరం శంకరం హాజరవుతారు.

–ప్రొఫెసర్ రెడ్డి శ్యామల, ప్రొఫెసర్ జి.ఎన్. గాబ్రియల్, భాషాభివృద్ధి పీఠం

వ్యక్తిత్వమే కవిత్వం

(వరవరరావు కవిత్వం–విశ్లేషణ)

పాణి రచన 'వ్యక్తిత్వమే కవిత్వం' పుస్తకావిష్కరణ సభ– 2019 జూన్ 17న సాయంత్రం 6 గంటలకు, హైదరాబాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. దేవిప్రియ అధ్యక్షతన జరుగు సభలో వసంత్ కన్నబిరాన్, కె.శివారెడ్డి, ప్రొఫెసర్ ఎండ్లూరి సుధాకర్, ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే ప్రసంగిస్తారు. డాక్టర్ బి.విజయభారతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. రచయిత పాణి స్పందన ఉంటుంది.

–మలుపు బుక్స్

వ్యాసాలకు ఆహ్వానం

25ఏండ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రస్థానంపై వ్యాస సంకలనం తీసుకురాదల్చాం. 'వర్గీకరణ–సామాజిక న్యాయం' అంశంపై రాసిన వ్యాసాలను 2019 జూన్ 25వ తేదీలోపు డీటీపీ చేసి పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రూపంలో dappollaramesh@gmail.com కు పంపించాల్సిందిగా మనవి.

–డప్పోల్ల రమేష్

'పునరావృత దృశ్యం' ఆవిష్కరణ సభ

పుష్యమీసాగర్ రెండవ కవితా సంపుటి 'పునరావృత దృశ్యం' ఆవిష్కరణ సభ 2019 జూన్ 23న సాయంత్రం 6 గంటలకు, హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరుగుతుంది.శిలాలోహిత అధ్యక్షతన జరుగు సభలో ఎం. నారాయణ శర్మ, ఎస్. హరగోపాల్, డాక్టర్ విరించి విరివింటి, భూపతి వెంకటేశ్వర్లు, పోర్శియాదేవి ప్రసంగిస్తారు. పుస్తకాన్ని సుద్దాల అశోక్ తేజ ఆవిష్కరిస్తారు. నరేష్కుమార్ సూఫి ఆహ్వానం పలుకుతారు.

–కవిసంగమం

కవితలకు ఆహ్వానం

తెలుగు హిందీ భాషల్లో వెలువడుతున్న ద్విభాషా పత్రిక 'భిలాయి వాణి' ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కవితల పోటీకి రచనలను ఆహ్వానిస్తున్నాం. కవితలు ఏ సామాజిక అంశంపై అయినా 20 నుంచి 40 లైన్ల లోపు ఉండాలి. కవితలు 2019 ఆగస్టు 31లోపు అందేలా పంపాలి.

చిరునామా: భిలాయి వాణి, 19–సి, క్రాస్ స్ట్రీట్–1, సెక్టార్–1, భిలాయి–490001. వివరాలకు: 9827408575, 8374134200

కథానికలకు ఆహ్వానం

'డాక్టర్ వేదగిరి రాంబాబు కథానికా పురస్కారం' కోసం 2019 అక్టోబర్ నాటికి 40 ఏండ్లు మించని రచయితల నుంచి కథానికలను ఆహ్వానిస్తున్నాం. 2017,18,19 సంవత్సరాల్లో ప్రచురించబడిన కథానికా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. ఒక్కొక్కటి ఒక కాపీ చొప్పున 2019 ఆగస్టు 14లోపు అందేలా పంపాలి. చిరునామా: సింహప్రసాద్, 401, మయూరి ఎస్టేట్, ఎంఐజీ–2–650, కేపీహెచ్‌బీ కాలనీ, హైదరాబాద్–85. సెల్:9849061668

–సింహప్రసాద్, కన్వీనర్

కొత్త పుస్తకం

మూమెంట్ ఆఫ్ సిగ్నల్

ఒక వ్యక్తి తన పేదరికం, జీవన పరిస్థితులు, వెనుకబడిన సామాజిక స్థితిగతులు, పరిసరాల ప్రభావాలన్నింటినీ అధిగమించి పట్టుదలతో దేన్నైనా సాధించవచ్చన్న దానికి శ్రీధర్ బెవర జీవితం ఓ నిదర్శనం. శ్రమతో ఉన్నత స్థితికి చేరుకోవాలన్న చిన్న ఆశాకిరణం.. వ్యక్తిని ఎంతటి పోరాటకారునిగా, నిష్ణాతునిగా తీర్చిదిద్దుతుందో ఈ పుస్తకం చెబుతుంది. ప్రపంచాన్నే జయించేటంత నైపుణ్యాలనేవి సాధించలేనివేమీ కావని దీన్ని చదివిన ప్రతి ఒక్కరికీ తెలుస్తుంది.



రచన: శ్రీధర్ బెవర వెల: రూ. 250
ప్రతులకు: ఇండియాలో 'అమెజాన్'తో పాటు, అన్ని ప్రధాన పుస్తక విక్రయ కేంద్రాల్లో దొరుకుతుంది.

ప్రామాణిక సాహిత్య చరిత్ర ఆవశ్యకత

తెలంగాణ సాహిత్య చరిత్ర గురించి 'నమస్తే తెలంగాణ' దిన పత్రిక 'చెలిమె'లో ప్రచురితమైన వ్యాసం (2019, మే 6), దానికి స్పందన (2019, మే 27), ప్రతిస్పందన (2019, జూన్ 3) చదివాక మన చరిత్ర నిర్మాణానికి సంబంధించి కొన్ని సందేహాలను నివృత్తి చేసుకోవలసిన అవసరం ఉందని భావిస్తున్నాను. గూడూరు పద్య శాసనం విరియాల కామసానిని వేయించిందని కామసానిని ఆ శాసనకర్తగా చెబుతున్నారు. అయితే నిజానికి ఆ శాసనం ఆమె వేయించింది కాదు. విరియాల మల్లభూపతి గూడూరు ప్రాంతంలో మల్లేశ్వరస్వామిని ప్రతిష్ఠ చేసి చెరువును తవ్వించిన సందర్భంలో ప్రకటితమైన కన్నడ శాసనం ఇది. దానికి అనుబంధ ప్రాయమైన వృత్త పద్యాలలో విరియాల ఎర్రభూపతి పత్ని అయిన కామసాని తన భర్త పరాక్రమంతో బేతరాజును కాకతీయ సింహాసన ప్రతిష్టితునిగా చేసిన వృత్తాంతం ఇందులో వర్ణింపబడటం చేత దీనికి కామసాని శాసనం అన్న వ్యవహారం ఏర్పడింది. (చూడండి–తెలుగు సాహిత్య చరిత్ర ఆచార్య కొర్లపాటి శ్రీరామ మూర్తి, పుట 29)

భారతి 1982 ఆగస్టు సంచికలో (పు. 51)దీని వివరాలు గోచరిస్తాయి. కాబట్టి కామసాని శాసన రచయిత్రి కాదని స్పష్టమవుతుంది. అయినా శాసనాలు వేయించినవారంతా శాసనకర్తలు కారు. సాధారణంగా వారి ఆశ్రయంలో వున్న కవి పండితులు వాటిని రచించటం పరిపాటి. పై గూడూరు శాసనానికి ముందు మూడు వైపులా ఉన్న కన్నడ శాసన లేఖకుడు కన్నోజు అని పరిశోధకుల అభిప్రాయం. అందలి తెలుగు వృత్త పద్యాలు దానికి అనుబంధంగా ఉన్నాయి.

గోన బుద్ధారెడ్డి కూతురు, మల్యాల గుండయ భార్య అయిన కుప్పాంబిక 13వ శతాబ్దంలో బూదపూరు (భూత్‌పూర్)లో వేయించిన శాసనాల కర్త ఆమె ఆస్థానంలోని ఈశ్వర భట్టోపాధ్యాయుడు. అయ్యలరాజు పేర్కొన్న పద్యం ఆధారంగా కుప్పాంబికను కవయిత్రిగా భావించటం జరుగుతున్నది. కాని ఈ అయ్యలరాజు ఏకాలం వాడో, ఏ గ్రంథంలో కుప్పాంబిక పద్యాన్ని ఉదహరించాడో ఎవరూ చెప్పలేక పోతున్నారు. నాకు తెలిసినంత వరకు అయ్యలరాజు ఇంటిపేరు గల ముగ్గురు కవులు గోచరిస్తున్నారు. అయ్యలరాజు రామభద్రుడు (క్రీ.శ.1550), అళియ రామరాయల అల్లుడు గొబ్బూరి నరసరాజుకు అంకితంగా 'రామాభ్యుదయం' కావ్యం రచించాడు. రామభద్ర ప్రణీతంగా చెప్పబడుతున్న 'సకల కథా సారం' రాతప్రతి (అముద్రితం) మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో ఉంది. పై రెండు గ్రంథాల కర్తల గోత్రాలు వేర్వేరుగా (కౌండిన్యస, కాశ్యపస) కనిపించుట వల్లా, 17వ శతాబ్దానికి చెందిన ఎలకూచి బాల సరస్వతి ప్రస్తావన సకల కథాకార సంగ్రహంలో వుండటం వల్ల ఈ రెండు గ్రంథాలు ఏక కర్తృకం కావని చెప్పవచ్చు. రామాభ్యుదయం ఆశ్వాసాంత గద్యలో పేర్కొనబడిన 'ఒంటిమెట్ట రఘువీర శతకం' రామభద్రుని ప్రపితామహుడైన అయ్యలరాజు తిప్పయ రచన. 18వ శతాబ్ది ఉత్తరార్ధ కాలానికి (1770–80) చెందిన అయ్యలరాజు నారాయణామాత్యుడు 'హంసవింశతి'అనే ప్రసిద్ధ విజ్ఞాన సర్వస్వ కావ్యం రచించాడు. కాబట్టి కుప్పాంబిక (13వ శతాబ్ది)ను తొలి తెలుగు కవయిత్రిగా ప్రతిపాదించిన వారు ఉదహరించిన పద్యం ఏ అయ్యల రాజు గ్రంథంలోనిదో స్పష్టంగా చెప్పినప్పుడే దానికి ప్రామాణికత ఏర్పడుతుంది.

మరొక ముఖ్య విషయం– 10వ శతాబ్దానికి చెందిన మల్లియ రేచన రాసిన 'కవి జనాశ్రయము' ఛందో కావ్యాన్ని వేములవాడ భీమకవికి అంటగట్టటం తెలంగాణ సాహిత్య చరిత్రకు తీరని అపకారం. పూర్వ ముద్రణలలో (1917, 1932) జరిగిన పొరపాట్లను పరిష్కరిస్తూ వావిళ్లవారు 1950లో ప్రచురించిన 'కవి జనాశ్రయము' పునర్ముద్రణకు పీఠిక రాస్తూ.. ''నేడు మనకుపలబ్ధమైన గ్రంథములలో ప్రాచీనమైనది కవి జనాశ్రయము. ఇది మల్లియ రేచన రచితము. జైన సాంప్రదాయకము.'' అని సుప్రసిద్ధ పరిశోధకులు నిడుదోవోలు వెంకటరావు స్పష్టంగా చాటి చెప్పారు. వేములవాడ అనే ప్రాచీన జైన విద్యా కేంద్రంలో (కరీంనగర్ జిల్లా) క్రీ.శ. 940 ప్రాంతంలో (నన్నయ ఆంధ్ర మహాభారత రచనకు నూరు సంవత్సరాల ముందు) పంప సోదరుడుడైన జిన వల్లభుని సహాయంతో మల్లియ రేచన కవి జనాశ్రయం రచించాడని ప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు పుచ్చా వాసుదేవ(పి.వి.)పరబ్రహ్మశాస్త్రి నిర్ధారించారు. ''కవి జనాశ్రయము తొలి గ్రంథం. అందరు నిన్నటిదాకా భీమన ఛందం అని చెప్పుకొంటూ రచయితకు రావలసిన కీర్తిని రానియ్యకుండా గ్రహణం పట్టించారు'' అని ఆరుద్ర 'సమగ్రాంధ్ర సాహిత్యం'లో ఉగ్గడించారు.

> ప్రముఖ పండితులు వైద్యం వేంకటేశ్వరాచార్యులు 'భావ దీపిక' వ్యాఖ్యానంతో 'కవి జనాశ్రయము' పరిష్కృత ముద్రణను (తెలంగాణ సాహిత్య పరిశోధన కేంద్రం ప్రచురణ) వెలువరించిన తర్వాత కూడా మన సాహిత్య చరిత్రకారులు ఈ సత్యాన్ని జీర్ణించుకోలేని పరిస్థితిలో ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై దీనిని వేములవాడ భీమన రచనగా ఉగ్గడించటం ప్రామాణిక సాహిత్య చరిత్రకు భంగకరం.

వాస్తవ చరిత్ర ఇలా ఉండగా కొందరు తెలంగాణ సాహిత్య చరిత్రకారులు పై అభిప్రాయాలను ప్రస్తావించకుండా, వాటికి సమాధానం చెప్పకుండా కవి జనాశ్రయము వేములవాడ భీమ కవి రచన అని వల్లె వేయటం ఎంతవరకు సమంజసమో పరిశోధక పాఠకులే నిర్ణయించాలి. ప్రముఖ పండితులు వైద్యం వేంకటేశ్వరాచార్యులు 'భావ దీపిక' వ్యాఖ్యానంతో 'కవి జనాశ్రయము' పరిష్కృత ముద్రణను (తెలంగాణ సాహిత్య పరిశోధన కేంద్రం ప్రచురణ) వెలువరించిన తర్వాత కూడా మన సాహిత్య చరిత్రకారులు ఈ సత్యాన్ని జీర్ణించుకోలేని పరిస్థితిలో ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై దీనిని వేములవాడ భీమన రచనగా ఉగ్గడించటం ప్రామాణిక సాహిత్య చరిత్రకు భంగకరం. కొత్తగా మన సాహిత్య చరిత్రను నిర్మించుకొంటున్న క్రమంలో చారిత్రక ఆధారాలను, ప్రమాణాలను పక్కన పెట్టకుండా స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

–ఆచార్య ఎస్వీ రామారావు, 9848012053

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

సకాలంలో వర్షాలు కురిసి దేశం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఆదివారం వరంగ్‌లోని ఓ-సిటీ మైదానంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ఎండీ అజారుద్దీన్, ఇజాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలకు ఖాదీ, గ్రామీణ పారిశ్రామికాభివృద్ధి సంస్థ చైర్మన్ మౌలానా యూసఫ్ జహీద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వరంగల్, హన్మకొండ, కాజీపేట ప్రాంతాల నుంచి సుమారు మూడు వేల మంది ప్రార్థనలు నిర్వహించారు. - వరంగల్ చౌరస్తా

గర్శకుర్తిలో బతుకమ్మ చీరెల తయారీ

గంగాధర: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తికి మంజూరైన బతుకమ్మ చీరెల తయారీ యూనిట్‌ను చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగకు పేద, ధనిక తేడా లేకుండా మహిళలంతా కొత్త చీరెలు కట్టుకోవాలన్న ఉద్దేశంతో భుత్వం చీరెలను పంపిణీ చేస్తున్నదని చెప్పారు. సిరిసిల్ల తరహాలోనే తమకు బతుకమ్మ చీరెల తయారీకి అవకాశం ఇవ్వాలని గర్శకుర్తి నేత కార్మికులు కోరగా.. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ సహకారంతో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్టు గుర్తుచేశారు. సీఎం వెంటనే స్పందించి గర్శకుర్తిలో బతుకమ్మ చీరెల తయారీకి అవకాశం కల్పించినట్టు వెల్లడించారు.

వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా కనిపించింది. వేకువజాము నుంచే భక్తులు ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కోడెమొక్కు తీర్చుకుని స్వామివారిని దర్శించుకున్నారు. రద్దీకారణంగా ఆర్జితసేవలను నిలిపివేశారు. రాజన్నను దాదాపు 10 వేల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారని, సుమారు రూ.8 లక్షలకుపైగా ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు. - వేములవాడ కల్చరల్

యాదాద్రి ఆదివారం భక్తులతో పోటెత్తింది. రద్దీ కారణంగా స్వామివారి దర్శనానికి గంటలకొద్దీ సమయం పట్టింది. మొక్కుపూజల నిర్వహణతో మండపాలు కిక్కిరిసిపోయాయి. స్వామివారి ఖజానాకు రూ.25,31,332 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో గీత తెలిపారు.
- యాదాద్రిభువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తేతెలంగాణ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద నిర్మిస్తున్న హోమశాల

21న 'కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద హోమం

చురుకుగా హోమశాల నిర్మాణ పనులు

కాళేశ్వరం(జయశంకర్ భూపాలపల్లి): కాళేశ్వరం ప్రాజెక్టును ఈనెల 21న సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ప్రత్యేకంగా హోమం నిర్వహించనున్నారు. ఆదివారం పంప్‌హౌస్ పక్కనే హోమశాల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. అధికారుల పర్యవేక్షణలో పనులు చురుగ్గా చేపడుతున్నారు. ఇక్కడ వేద పండితులతో ప్రత్యేకంగా హోమం నిర్వహించనున్నారు.

సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న వనపర్తి వాసులకు మంజూరైన చెక్కులను మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదివారం నేరుగా వారి ఇండ్లకు వెళ్లి అందజేశారు. వనపర్తికి చెందిన శ్రీనివాస్‌కు రూ.55 వేలు, బండారునగర్‌కు చెందిన సత్యనారాయణకు రూ.35 వేలు, మారెమ్మకుంటకు చెందిన అబ్దుల్‌కు రూ.18,500, భారతమ్మకు రూ.26,500, రాంనగర్ కాలనీవాసి లతీపున్నిసా బేగంకు రూ.50 వేలు, పాత బజార్‌కు చెందిన వెంకటేశ్వరమ్మకు రూ.60 వేల విలువ గల చెక్కులను మంత్రి అందజేశారు. - వనపర్తి, నమస్తేతెలంగాణ

మంచిర్యాల జిల్లా జన్నారంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీర రేఖానాయక్

నిజామాబాద్ జిల్లా ఇందల్వాయిలో సీఎం కేసీఆర్, మాజీ ఎంపీ కవిత, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం ..

నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం తుమ్మలపల్లిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి నాయకులు, ప్రజాప్రతినిధుల క్షీరాభిషేకం

సర్పంచ్‌ల సంబురాలు

ఉపసర్పంచ్‌తో కలిపి చెక్‌పవర్ కల్పించడంపై హర్షాతిరేకాలు ▪ సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం నూతన పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, ఉప సర్పంచ్‌కు జాయింట్ చెక్ పవర్‌ను కల్పిస్తూ గెజిట్ విడుదల చేయడాన్ని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, నాయకులు స్వాగతించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. మంచిర్యాల జిల్లా జన్నారంలోని టీఆర్ఎస్ కార్యాలయం ఎదుట ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ సర్పంచ్‌లతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయిలో సీఎం కేసీఆర్, మాజీ ఎంపీ కవిత, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ బాదావత్ రమేశ్ నాయక్ ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం తుమ్మలపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఉపసర్పంచ్ రేణమ్మ లక్ష్మణ్‌తోపాటు ఇతర నాయకులు, వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో, ఇదే జిల్లా నడికూడ మండలం చౌటుపర్తి గ్రామంలో ఉప సర్పంచ్ కొత్త విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఇతర నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

వరంగల్ రూరల్ జిల్లా నడికూడ మండలం చౌటుపర్తిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, నాయకుల క్షీరాభిషేకం

భూమికోసం ఆత్మహత్యాయత్నం

తండ్రి తన పేరిట పట్టా చేయడం లేదంటూ
భార్యాపిల్లలతో కలిసి ఆత్మాహుతి యత్నం..
ఇంటికి నిప్పు.. స్థానికుల అప్రమత్తంతో తప్పిన ముప్పు

ఆత్మహత్య కోసం రాములు కుటుంబం ఇంటికి నిప్పు పెట్టుకోవడంతో చెలరేగుతున్న మంటలు

పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం అన్నారం కలాన్ గ్రామంలో ఓ కుటుంబం ఆత్మహత్యకు యత్నించింది. వివరాలిలా.. గ్రామానికి చెందిన సాయిలుకు రాములు, కృష్ణ అనే ఇద్దరు కుమారులు. కాగా రాములు తన తండ్రి పేరు మీద ఉన్న భూమిని తమ పేరుమీద పట్టా చేయాలని కొద్దిరోజులుగా కోరుతున్నాడు. తండ్రి సాయిలు పట్టించుకోకపోవడంతో రాములు తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి ఆదివారం ఉదయం ఇంటికి నిప్పు పెట్టుకొని ఆత్మహత్యకు యత్నించారు. ఇంట్లో నుంచి మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు ఆర్పేందుకు యత్నించారు. అదుపులోకి రాకపోవడంతో బాన్సువాడ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చి రాములుతోపాటు ఆయన కుటుంబ సభ్యులను క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనతో సాయిలు దిగివచ్చి తనకున్న తొమ్మిది ఎకరాల భూమిని ఇద్దరు కుమారుల పేరిట పట్టా చేయడానికి లిఖితపూర్వకంగా అంగీకరించాడు.

ప్రాణాలతో బయటపడ్డ రాములు కుటుంబసభ్యులు

పర్యాటక ఖిల్లాగా జనగామ

- 40 కోట్లతో పర్యాటకాభివృద్ధి
- వెంటనే పనులు మొదలు పెట్టాలి
- మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి ఆదేశం
- పర్యాటక శాఖ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష

పాలకుర్తి రూరల్: ఉద్యమాల గడ్డ జనగామ జిల్లాను పర్యాటక ఖిల్లాగా మారుస్తామని, అందుకోసం అధికారులు కలిసికట్టుగా పని చేయాలని పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం పాలకుర్తి క్యాంప్ కార్యాలయంలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు జిల్లాలో రూ.40 కోట్లతో తలపెట్టిన పర్యాటకశాఖ అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. టూరిజం పనుల పురోగతి, నిధుల మంజూరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. పాలకుర్తి ప్రాంతానికి ఎంతో చరిత్ర ఉన్నదన్నారు. వెంటనే అభివృద్ధి పనులు మొదలు పెట్టి ఏడాదిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా పర్యాటక రంగ పనులు ఉండాలని చెప్పారు. సీఎం కేసీఆర్ పెట్టిన ముహూర్తానికే ఇక్కడ కొబ్బరికాయ కొట్టాలన్నారు. మంజూరైన పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపొద్దన్నారు. వచ్చే ఏడాది ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 నాటికి జిల్లాలోని టూరిజం పనులు పూర్తి కావాలని ఆదేశించారు. సమీక్షలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, జీసీసీ చైర్మన్ ధరావత్ మోహన్ గాంధీ నాయక్, ఇంటాక్ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే దాస్యంను సత్కరిస్తున్న అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు

మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లికి ఘన సన్మానం

సిద్ధార్థనగర్ (వరంగల్): వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ హరిత హోటల్‌లో ఉద్యోగ సంఘాలు, పెన్షనర్లు, వరంగల్ జిల్లా అధికారులు మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మేయర్ ప్రకాశ్‌రావు, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, టీఎన్జీవో వరంగల్ కోఆర్డినేటర్ జగన్మోహన్‌రావు, జిల్లా జేఏసీ చైర్మన్ సుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం మంత్రులు ఓరుగల్లు కోటను.. హన్మకొండలోని వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించారు.

అంతిమయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించి పాడె మోస్తున్న కరీంనగర్ మేయర్ రవీందర్‌సింగ్

'రూ.1కే అంతిమయాత్ర' ప్రారంభం

కరీంనగర్‌లో మొదలైన కార్యక్రమం

కరీంనగర్ కార్పొరేషన్, నమస్తే తెలంగాణ: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న 'ఒక్క రూపాయికి అంతిమయాత్ర' కార్యక్రమాన్ని నగర మేయర్ రవీందర్‌సింగ్ ఆదివారం ప్రారంభించారు. కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన మంచాల లలిత మరణించగా ఒక్క రూపాయికే అంత్యక్రియలు నిర్వహించారు. రూపాయి చెల్లింపు రశీదు అందించి.. పాడె కట్టడం నుంచి డప్పు చప్పుళ్లు, అంతిమయాత్ర, దహన సంస్కారాల వరకు అన్ని సంప్రదాయాలు, ఆచారాల ప్రకారం పూర్తిగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టారు. మృతురాలి పాడెను మేయర్ రవీందర్‌సింగ్ మోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. దహన సంస్కారాలు నిర్వహించడం దైవ కార్యమన్నారు. ఈ కార్యక్రమం కోసం బల్దియా నుంచి రూ.1.50 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. నగరంలోని అన్ని మతాలు, కులాల్లో చనిపోయిన వారికి ఈ కార్యక్రమం కింద అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య విభాగం సూపర్‌వైజర్ వేణుగోపాల్, నగరపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిశువిక్రయానికి బ్రేక్

అడ్డుకున్న స్థానికులు.. ఐసీడీఎస్ అధికారులకు అప్పగింత

మెట్‌పల్లి, నమస్తే తెలంగాణ: కుటుంబాన్ని సాకలేక భర్త దూరంగా వెళ్లిపోవడంతో ఆడపిల్లను పోషించడం కష్టంగా భావించిన ఓ తల్లి నెలరోజుల శిశువును అమ్మకానికి పెట్టిన ఉదంతం ఆదివారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో వెలుగుచూసింది. నిర్మల్ జిల్లా కడెం సమీపంలోని ఒడ్డెర కాలనీకి చెందిన నవీన్, పుట్ట గంగజ్యోతి దంపతులకు స్నేహ(4) కూతురు ఉన్న ది. నవీన్ భార్యా, బిడ్డను పోషించడం కష్టంగా మారడంతో భార్య, బిడ్డను వదిలి కొద్ది రోజుల కిందట మహారాష్ట్రకు వెళ్లిపోయాడు. అప్పటికే గర్భిణిగా ఉన్న గంగజ్యోతి నెలరోజుల కింద రెండో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పోషణ కష్టంగా మారడంతో నెలరోజుల వయస్సు కలిగిన రెండో కూతురిని విక్రయించాలని నిర్ణయించుకున్నది. ఆదివారం మెట్‌పల్లిలో ఓ దుకాణం ముందు కూర్చుని చిన్నారిని అమ్మకానికి పెట్టింది. రూ.30 వేలకు విక్రయిస్తానని చెప్పగా పిల్లలు లేని దంపతులు రూ. 20 వేలు ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నట్టు సమాచారం. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అం దించారు. ఎస్సై కిరణ్ కుమార్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని గంగ జ్యోతితోపాటు ఆమె ఇద్దరు కూతుళ్లను ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు.

జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో శిశువును విక్రయించేందుకు కూర్చున్న తల్లి గంగజ్యోతి

కాగజ్ కాంతులు

- సర్కారు చొరవతో తెరచుకున్న ఎస్సీఎం
- రోజుకు 25 నుంచి 30 టన్నుల కాగితం ఉత్పత్తి

కుమ్రం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ పేపర్‌మిల్లు సరికొత్త శోభను సంతరించుకున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్లక్ష్యానికి గురైన సిర్పూర్ పేపర్‌మిల్లు.. తెలంగాణ సర్కారు చొరవతో పునఃప్రారంభమై వేలమంది కార్మికులకు ఉపాధినిస్తున్నది. గత ఫిబ్రవరిలో ఏడోనంబర్ యంత్రంతో ప్రారంభమైన ఉత్పత్తి.. నాలుగు నెలల్లోనే మరో మూడు యంత్రాల్లో కాగితాన్ని తయారు చేస్తున్నది. ప్రస్తుతం రోజుకు 25 నుంచి 30 టన్నుల కాగితం తయారవుతుండగా.. రోజుకు 300 టన్నుల వరకు ఉత్పత్తి చేసే లక్ష్యంతో యాజమాన్యం ముందుకెళ్తున్నది.

నిజాం కాలంలో ప్రారంభమై..

1938లో నిజాంకాలంలో సిర్పూర్ పేపర్ మిల్లు స్థాపించగా.. 1943లో ఉత్పత్తి ప్రారంభమైంది. 1950లో బిర్లాగ్రూప్ ఆధీనంలోకి వెళ్లింది. అప్పటి నుంచి కొన్నేండ్లపాటు పేపర్ ఉత్పత్తి నిరాటంకంగా సాగింది. కాగా 2007-08లో కంపెనీలో రెండు కొత్త యంత్రాలను ఏర్పాటు చేసి ఉత్పత్తి మరింత పెంచే లక్ష్యంతో ఐడీబీఐ (ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)లో మిల్లు ఆస్తులను తాకట్టు పెట్టి యాజమాన్యం రూ. 350 కోట్ల రుణాన్ని తీసుకున్నది. రుణాలను కంపెనీ అభివృద్ధికి వినియోగించకపోవడంతో నష్టాలు మొదలయ్యాయి. 2014 సెప్టెంబర్ 27న కంపెనీని షెట్‌డౌన్ చేస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించింది. కంపెనీ మూసేయం తో 3200 మంది కార్మికులు, పరోక్షంగా ఉపా ధి పొందే వందల మంది రోడ్డున పడ్డారు.

నాలుగు నెలల్లో మూడు యంత్రాల పునరుద్ధరణ

ప్రభుత్వం కల్పించిన ప్రత్యేక రాయితీలతో ఎస్సీఎంలో యంత్రాల పునరుద్ధరణ వేగంగా సాగుతూ కాగితం ఉత్పత్తిని చేస్తున్నాయి. నాలుగు నెలల్లో మూడు యంత్రాల్లో కాగితం ఉత్పత్తి ప్రారంభమైంది. గత ఫిబ్రవరి 7న ఏడోనంబర్ యంత్రం ద్వారా ఉత్పత్తిని ప్రారంభించగా, మార్చి 30న 8వ యంత్రం, తాజాగా జూన్ 13న మూడో యంత్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం రోజుకు 25 నుంచి 30 టన్నుల కాగితం ఉత్పత్తి అవుతున్నది. మిల్లులోని మొత్తం యంత్రాలను ప్రారంభించి రోజుకు 300 నుంచి 350 టన్నుల పేపర్ ఉత్పత్తి చేసేందుకు యాజమాన్యం చర్యలు చేపడుతున్నది.

7వ నంబరు పేపరు మెషిన్ నుంచి ఉత్పత్తైన పేపరు.. సిర్పూర్ పేపర్‌మిల్లు

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో..

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కంపెనీ పూర్వవైభవాన్ని సంతరించుకున్నది. కంపెనీ తెరిచే కంపెనీలకు రాయితీలు ఇస్తామని 2016 సెప్టెంబర్‌లో రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వివిధ కంపెనీలతో ప్రయత్నాలు ప్రారంభించారు. 2016 అక్టోబర్ 22న ఐడీబీఐ ఎస్సీఎంను స్వాధీనం చేసుకున్నది. 2017 సెప్టెంబరులో 18న మిల్లు ఆస్తులపై నిర్ణయం తీసుకోవాలని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. 2017 డిసెంబర్‌లో జేకే కంపెనీ ఎస్సీఎంను తీసుకునేందుకు ముందుకొచ్చింది. 2018 మార్చి 18న ఎస్సీఎంను తీసుకునే కంపెనీకి పదేండ్ల పాటు రాయితీలు కల్పిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 2018 జూలై 19న పేపర్‌మిల్లును తెరిపించాలని ట్రిబ్యునల్ తీర్పు వెలువరించింది. అదే ఏడాది ఆగస్టు 2న కేటీఆర్ చేతుల మీదుగా ఎస్సీఎం పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. ఫిబ్రవరి 7న ఎస్సీఎంలో తిరిగి పేపర్ ఉత్పత్తి మొదలైంది.

గంటల వ్యవధిలో అన్నదమ్ములు మృతి

రెండు కుటుంబాల్లో విషాదం
ఒకేసారి ఇద్దరి అంత్యక్రియలు

గార్ల: వడదెబ్బతో అస్వస్థతకు గురైన అన్నదమ్ములు గంటల వ్యవధిలో కన్నుమూశారు. దీంతో రెండు కుటుంబాల్లో విషాదం అలుముకున్నది. ఇద్దరి అంత్యక్రియలు ఒకేసారి నిర్వహించారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పాత పోచారంలో చోటుచేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి.. పాత పోచారం గ్రామానికి చెందిన పసుపులేటి రామయ్య (65), పసుపులేటి కృష్ణయ్య (60) అన్నదమ్ములు. వీరిది వ్యవసాయ కుటుంబం. ఎండలో పనులు చేయడం వల్ల ఇద్దరు వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో కృష్ణయ్య శనివారం ఉదయం తన పొలంలో పత్తి పుల్లలను తొలగించేందుకు వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలంవద్దకు వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. ఇతనికి భార్య భద్రమ్మతోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న ఆ కుటుంబంలో ఆదివారం ఉదయాన్నే కృష్ణయ్య అన్న రామయ్య కూడా కన్నుమూశాడు. ఇతనికి భార్య సూరమ్మతోపాటు ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఇద్దరికి ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు.

సుమన్ రావు

మిస్ ఇండియాగా రాజస్థానీ సౌందర్యం

రన్నరప్‌గా నిలిచిన తెలంగాణ యువతి

సంజనా విజ్

ముంబయి, జూన్ 16: ఈ ఏడాది మిస్ ఇండియా కిరీటాన్ని సుమన్ రావు కైవసం చేసుకున్నారు. దీంతో 2019 డిసెంబర్‌లో థాయిలాండ్‌లో జరిగే ప్రపంచ సుందరి పోటీలకు భారతదేశం తరపున మిస్ ఇండియా సుమన్ రావు ప్రాతినిధ్యం వహించనున్నారు. రాజస్థాన్‌కు చెందిన ఈ యువతి ప్రస్తుతం సీఏ విద్యను అభ్యసిస్తున్నారు. 2019 మిస్ ఇండియా రన్నరప్‌గా తెలంగాణకు చెందిన సంజనా విజ్ నిలిచారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన శివానీ జాదవ్ మిస్ గ్రాండ్ ఇండియా 2019 కిరీటాన్ని చేజిక్కించుకోగా, మిస్ ఇండియా యునైటెడ్ కాంటినెంట్స్ 2019 కిరీటాన్ని బీహార్‌కి చెందిన శ్రేయా శంకర్ గెలుచుకున్నారు. ముంబయిలోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఇండోర్ స్టేడియంలో శనివారం ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ రెమో డిసౌజా, నటీనటులు హిమాఖురేషీ, చిత్రాంగధ సింగ్, ఆయుష్ శర్మ, ఫ్యాషన్ నిపుణుడు ఫాల్గుణి పికోకా, భారత ఫుట్‌బాల్ ఆటగాడు సునీల్ ఛెత్రీ తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. దర్శకుడు కరణ్‌జోహర్, నటుడు మనీష్‌పాల్, 2017 ప్రపంచ సుందరి మానుషి చిల్లర్‌లు వ్యాఖ్యాతలుగా.. బాలీవుడ్ నటీనటులు కత్రినాకైఫ్, విక్కీకౌషల్, మౌనీరాయ్ తమ నృత్యాలతో ప్రేక్షకులను అలరించారు.

మోదీకి దమ్ముంది

మందిర నిర్మాణంపై ఉద్ధవ్ వ్యాఖ్య

అయోధ్య: అయోధ్యలో రామమందిరం నిర్మించే దమ్ము ప్రధాని మోదీకి ఉన్నదని, దీనికోసం ఆయన ఆర్డినెన్స్ తేవాలని శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. రామమందిర నిర్మాణం ఆపడం ఎవరితరం కాదన్నారు. ఆదివారం ఉదయం ఆయన 18 మంది శివసేన ఎంపీలతో యూపీలోని అయోధ్యలోని రామ్‌లల్లా మైదానంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట ఉద్ధవ్‌కుమారుడు ఆదిత్య ఠాక్రే కూడా ఉన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈ కేసు చాలా ఏండ్లుగా కోర్టులో ఉన్నది. ప్రధాని మోదీకి ధైర్యముంది. ఇప్పుడు ప్రభుత్వం బలంగా ఉన్నది. ఇక్కడ రామ మందిరం నిర్మించాలని సర్కార్ అనుకొంటే.. ఎవరూ దాన్ని అడ్డుకోలేరు' అని చెప్పారు.

243 మంది ఏమైనట్టు?

పడవలో అక్రమ ప్రయాణం ■ జనవరిలో అదృశ్యం ■ బంధువుల ఆందోళన

న్యూఢిల్లీ: 'వెళ్లొచ్చాక.. మళ్లీ మిమ్మల్ని తిరిగి తీసుకెళ్తాం'అన్న వారి మాటలు ఆత్మీయుల చెవుల్లో ఇంకా మారుమోగుతున్నాయి. కానీ, వారి నుంచి ఐదు నెలలు గడిచినా పిలుపు రాలేదు. అసలు ఉన్నారో, లేరోనన్న మీ మాంస గల్లంతైన వారి బంధువుల ముఖాల్లో కనబడుతున్నది. ఒకరు కాదు, ఇద్దరు కాదు 243 మంది జాడ గురించి అంతుచిక్కని ప్రశ్న వాళ్ళను రోజూ వేధిస్తున్నది. గత జనవరి 12న కేరళలోని ఎర్నాకుళం నుంచి ఓ పెద్ద చేపల బోటులో అక్రమంగా విదేశాలకు బయలుదేరిన వీరు ఏమయ్యారన్నది.. ఇటు ప్రభుత్వం, అటు మానవహక్కుల సంఘాలు స్పష్టంగా చెప్పలేకపోతున్నాయి. వారిలో 184 మంది ఢిల్లీలోని అంబేద్కర్ నగర్ వాళ్లే. విలాస జీవితంపై ఆశతో తమిళనాడు, కేరళ రాష్ట్రాల వాసులతో కలిసి విదేశాలకెళ్లిన వారి నుంచి ఎలాంటి సమాచారం లేదు. దీంతో వారి ఆత్మీయులు కేంద్ర హోం, విదేశాంగ శాఖ, మానవ హక్కుల సంఘాలను ఆశ్రయించినా లాభం లేకపోయింది. కాగా, జనవరి 11న కొచ్చి సమీపంలోని మునంబం తీరం లో కేరళ పోలీసులు 50 బ్యాగులను గుర్తించారు. మనుషుల అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని అనుమానంతో 10 మందిని అరెస్టు చేశారు. వారిని విచారించినా తప్పిపోయిన వారి జాడ తెలియలేదు. ఢిల్లీ నుంచి వెళ్లిన 184 మందిపై ఇంటర్‌పోల్ బ్లూకార్నర్ నోటీసులు జారీ చేసినా ప్రయోజనం లేదు.

గల్లంతైన వారిలో కొందరు

రెండు దేశాల్లో బ్లాక్ అవుట్!

చీకట్లో 4.4 కోట్ల మంది

బ్యూనస్ ఎయిర్స్: దేశాల మధ్య అంతర్గతంగా అనుసంధానమైన పవర్ గ్రిడ్‌లో సాంకేతిక లోపంతో దక్షిణ అమెరికాలోని అర్జెంటీనా, ఉరుగ్వే దేశాలను చీకటి ఆవరించింది. ఆదివారం కరెంటు సరఫరాలో అంతరాయంతో సుమారు 4.4 కోట్ల మంది చీకట్లో మగ్గే పరిస్థితి తలెత్తింది. ఈ సమస్యను అధికారులు పాక్షికంగా పరిష్కరించడం వల్ల అర్జెంటీనాలోని కేవలం 5లక్షల మందికే కరెంట్ సరఫరాను పునరుద్ధరించగలిగారు. బ్లాక్ అవుట్ వల్ల అర్జెంటీనాలో జరుగుతున్న స్థానిక ఎన్నికల్లో సెల్‌ఫోను వెలుతురులోనే ప్రజలు ఓటేశారు.

ఒకట్రెండు రోజుల్లో రుతుపవనాల్లో పురోగతి

వాయు తుఫాన్ బలహీనపడడంతో 'నైరుతి'కి మార్గం సుగమం

భారత వాతావరణ విభాగం వెల్లడి

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: వాయు తుఫాన్ తీవ్రత తగ్గిన నేపథ్యంలో నైరుతి రుతుపవనాలు ఒకట్రెండు రోజుల్లో పుంజుకునే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం తెలిపింది. వాస్తవానికి రుతుపవనాలు ఇప్పటికే తెలంగాణ మీదుగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, తూర్పు ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలకు విస్తరించాల్సి ఉన్నా, అవి ఇంకా మహారాష్ట్రకు కూడా చేరలేదు. దక్షిణ భారతంలోని మంగళూరు, మైసూర్, కడలూర్, ఈశాన్య రాష్ట్రాల్లోని పాసీఘాట్, అగర్తలలోనే ఇంకా కొనసాగుతున్నాయి. మహారాష్ట్ర నుంచి గుజరాత్ వరకు ఉన్న పశ్చిమ తీరంలో వాయు తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తున్నాయి. కేరళ, కర్ణాటకలోని కోస్తా ప్రాంతంలో మాత్రమే నైరుతి రుతుపవనాల కారణంగా వర్షాలు నమోదయ్యాయి. వాయు తుఫాన్ బలహీనపడి సోమవారం అర్ధరాత్రి గుజరాత్ తీరాన్ని తాకే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. దీంతో నైరుతి రుతుపవనాలు అరేబియా సముద్రం దిశగా పయనించేందుకు మార్గం సుగమమైందని తెలిపింది. సాధారణం కంటే వారం ఆలస్యంగా ఈనెల 8న రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. 'వాయు తుఫాన్ ప్రభావం కారణంగా రుతుపవనాల్లో పురోగతి మందగించింది. తుఫాన్ తీవ్రత తగ్గడంతో రెండు మూడురోజుల్లో రుతుపవనాలు పుంజుకుంటాయని భావిస్తున్నాం' అని ఐఎండీ అదనపు డైరెక్టర్ జనరల్ దేవేంద్ర ప్రధాన్ తెలిపారు. మధ్య అరేబియా సముద్రం, కర్ణాటక, తమిళనాడులోని మిగిలిన ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు ఐఎండీ వెల్లడించింది. వచ్చే ఒకటి రెండు రోజుల్లో ఈశాన్య భారతం, ఉత్తరబెంగాల్, సిక్కిం రాష్ట్రానికి రుతుపవనాలు విస్తరిస్తాయని పేర్కొంది.



43 శాతానికి లోటు వర్షపాతం

రుతుపవనాలు మందగించడంతో దేశంలో ఈ సీజన్‌లో వర్షపాత లోటు 43 శాతానికి చేరుకుంది. మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గోవాతో కూడిన మధ్య భారత దేశంలో లోటు వర్షపాతం 59 శాతం నమోదైందని, ఈశాన్యభారతంలో 47 శాతం నమోదైందని ఐఎండీ తెలిపింది. విదర్భలో 87 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. సెంట్రల్ వాటర్ కమిషన్ వివరాల ప్రకారం.. దక్షిణాది రాష్ట్రాలతోపాటు మహారాష్ట్రలోని రిజర్వాయర్లలో నీటి మట్టం గత పదేండ్ల సగటు కంటే తక్కువగా ఉంది. జార్ఖండ్, బీహార్, ఒడిశాలలో వడగాడ్పులు బెంబేలెత్తిస్తున్నాయి.

'వాయు' బలహీనం

వాయు తుఫాన్ వాయుగుండంగా బలహీనపడి సోమవారం అర్ధరాత్రి గుజరాత్ తీరాన్ని దాటే అవకాశం ఉన్నదని ఐఎండీ పేర్కొంది. ఆదివారం ఉదయానికి వాయు తుఫాన్ పోర్‌బందర్‌కు పశ్చిమ నైరుతి దిశగా 470 కి.మీ, ద్వారకకు నైరుతి దిశగా 440 కి.మీ, భుజ్‌కు నైరుతి దిశగా 545 కి.మీ దూరంలో కేంద్రీకృతమైందని తెలిపింది. ఈశాన్య, తూర్పు మధ్య అరేబియా సముద్రంలో విస్తరించిన తుఫాన్ పశ్చిమ దిశగా గంటకు 12 కి.మీ వేగంతో పయనిస్తున్నదని పేర్కొంది. వచ్చే ఆరు గంటలు పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తుందని తెలిపింది. అనంతరం క్రమంగా దిశను మార్చుకుని, ఈశాన్య దిశగా పయనిస్తూ వాయుగుండంగా బలహీనపడి సోమవారం అర్ధరాత్రి ఉత్తర గుజరాత్ తీరం దాటనుందని వివరించింది. ఉత్తర గుజరాత్, సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

పుల్వామా తరహా ఉగ్రదాడికి కుట్ర!

కశ్మీర్‌లోని అవంతిపురా సమీపంలో జరుగొచ్చన్న పాకిస్థాన్

న్యూఢిల్లీ: కశ్మీర్‌లో మరో పుల్వామా ఉగ్రదాడి జరుగనున్నదా? గతంలో జరిగిన దాడి తరహాలోనే ఈ దాడికి కుట్ర జరిగిందా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. ఫిబ్రవరి 14న ఉగ్రవాదులు పేలుడు పదార్థాలను నింపిన వాహనంతో సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌ను ఢీకొట్టగా 40 మంది జవాన్లు అమరులైన విషయం తెలిసిందే. అయితే ఉగ్రవాదులు మరోసారి భారీ ఉగ్రదాడికి కుట్రపన్నుతున్నారని, ఈ దాడి పుల్వామా జిల్లాలోని అవంతిపురా సమీపంలో చోటుచేసుకునే అవకాశముందని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ భారత్‌కు సమాచారం ఇచ్చింది. దీంతో కశ్మీర్‌లో హై అలర్ట్ ప్రకటించారు. పాకిస్థాన్ ఈ సమాచారాన్ని అమెరికాతో కూడా పంచుకుంది. భద్రతా అధికారి ఒకరు మాట్లాడుతూ గత నెలలో కశ్మీర్‌లో ఉగ్రవాది జకీర్ మూసాను భద్రతా బలగాలు హతమార్చాయని, ఇందుకు ప్రతీకారం తీర్చుకోవడానికి భారీ ఉగ్రదాడికి కుట్రపన్నుతున్నట్లు తెలుస్తున్నదని చెప్పారు.

ఉగ్రనిధులతో ఆస్తుల కొనుగోలు!

వేర్పాటువాదులకు పాకిస్థాన్ నుంచి నిధులు

భారత్‌కు వ్యతిరేకంగా పనిచేయడమే వారిపని.. కోర్టుకు ఎన్ఐఏ నివేదిక

న్యూఢిల్లీ, జూన్ 16: కశ్మీర్‌లోయలో వేర్పాటువాదులకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి.. ఆ నిధులను వాళ్లు దేనికి ఖర్చు చేస్తున్నారు.. అన్న దానిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విస్తుగొలిపే విషయాలను వెల్లడించింది. వేర్పాటు వాదులకు పాకిస్థాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఓ వ్యాపారి, ఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్, పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ నుంచి నిధులు అందుతున్నాయని ఎన్ఐఏ తెలిపింది. ఈ నిధులను వాళ్లు కశ్మీర్‌లోయలో అశాంతిని రెచ్చగొట్టడానికి, ఆస్తులను కూడబెట్టుకోవడానికి, వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికి, తమ పిల్లలకు విదేశాల్లో ఉన్నత చదువులు చెప్పించడానికి ఖర్చు చేస్తున్నట్లు పేర్కొంది. వేర్పాటువాదులకు నిధులు అందడంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏ.. దుక్తరన్-ఏ-మిలాత్ నాయకురాలు ఆసియా అంద్రబి, వేర్పాటువాద నాయకుడు షబ్బీర్ షాను అరెస్టు చేసి విచారించింది. ఈ సందర్భంగా తనకు విదేశాల నుంచి నిధులు అందుతున్నాయని ఆసియా అంద్రబి ఒప్పుకున్నారు. అలాగే పాకిస్థాన్ నుంచి తనకు నిధులు అందాయని, ఆ నిధులతో పహెల్‌గావ్‌లో హోటల్ వ్యాపారాలను చేపట్టానని, జమ్ము, శ్రీనగర్, అనంత్‌నాగ్ ప్రాంతాల్లో ఆస్తులు కొన్నానని షబ్బీర్ షా ఒప్పుకున్నారు. ఈ ఇద్దరి నిధుల సేకరణకు సంబంధించిన సాక్ష్యాధారాలను కూడా ఎన్ఐఏ సేకరించింది. ఈ సాక్ష్యాధారాలను ఎన్ఐఏ ప్రత్యేక కోర్టుకు సమర్పించింది.

సాదిక్‌ఖాన్ లండన్‌కు పెద్ద విపత్తు

- కొత్త మేయర్ అవసరం
- ట్విట్టర్‌లో ట్రంప్ విమర్శ

లండన్, జూన్ 16: లండన్ మేయర్ సాదిక్ ఖాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి మండిపడ్డారు. ఆయనను బ్రిటన్‌కు జాతీయ విపత్తుగా అభివర్ణించారు. లండన్‌లో జరుగుతున్న వరుస నేర ఘటనలపై ట్రంప్ తాజాగా స్పందిస్తూ.. మేయర్ సాదిక్‌ఖాన్ లండన్ నగరాన్ని నాశనం చేస్తున్నారని, లండన్‌కు కొత్త మేయర్ అవసరం అని ట్వీట్ చేశారు. నగరంలో హింసకు తావు లేదని, లండన్ వాసుల రక్షణ కంటే తనకు మరేదీ ప్రాధాన్యం కాదంటూ సాదిక్ ఖాన్ కూడా ట్వీట్ చేశారు. ట్రంప్ ట్వీట్‌ను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, మేయర్ సాదిక్‌ఖాన్ బాధితులకు అండగా ఉన్నారని ఆయన అధికార ప్రతినిధి ట్వీట్ చేశారు. వీరి మధ్య ట్విట్టర్ వార్ గత కొన్నేండ్లుగా కొనసాగుతున్నది. వలసదారుల పట్ల ట్రంప్ వైఖరిని వ్యతిరేకిస్తూ '20వ శతాబ్దపు నియంత'గా సాదిక్‌ఖాన్ గతంలో ఆరోపించారు.

ఛత్తీస్‌గఢ్‌లో వ్యక్తి దారుణహత్య

పర్ణశాల: ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లా వంకమడుగు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని శనివారం రాత్రి మావోయిస్టులు హత మార్చారు. తెలిసిన వివరాల ప్రకారం.. వంకమడుగుకు చెందిన మడకం నంద (38) అనే గిరిజనుడు తమ సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నాడనే నెపంతో మావోయిస్టులు బలవంతంగా అడవిలోకి పిలిపించారు. దారుణంగా గొడ్డలితో నరికిచంపారు. అనంతరం మృతదేహాన్ని వంకమడుగు గ్రామానికి తీసుకెళ్లి విడిచినట్లు సమాచారం. ఘటనపై సుకుమా జిల్లా పోలీస్‌లు విచారణ చేస్తున్నట్టు తెలిసింది.

ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

నవరత్నాల ప్రచారంతో జాతిని చైతన్యం చేస్తాం

- జై భీం నినాదంతోనే ముందడుగు వేస్తాం
- తొమ్మిది సూత్రాలను వెల్లడించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

యాదగిరిగుట్ట, నమస్తే తెలంగాణ: తమ జాతి అభివృద్ధికి అవసరమైన తొమ్మిది సూత్రాలను ఎంపికచేసుకొని నవరత్నాల పేరుతో వాటిని ప్రచారంచేసి మాదిగ జాతిని చైతన్యపరుస్తామని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ చెప్పారు. జూలై ఏడు తర్వాత జై భీం నినాదంతోనే ముందుకెళ్తామని అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ నవసూత్రాలను మీడియాకు వివరించారు.'1. మేము మా పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి అన్ని రకాల త్యాగాలకు సిద్ధపడుతాం. 2. మేం ఇతరులను ద్వేషించం, యాచించం, తలవంచం, అన్ని రంగాల్లో ధనికులతో పోటీ పడుతాం. 3. మేం వ్యసనాలకు దూరంగా ఉంటాం. దుర్భాషలాడం. వ్యాయామం చేస్తాం. పనిని ప్రేమిస్తాం. 4. మేము ఏమీ ఆశించకుండా ఉన్నదాంట్లోనే ఇతరులకు సాయంచేస్తాం. 5. మేం మహిళా హక్కులను గౌరవిస్తాం. వారికి తగిన స్వేచ్ఛనిస్తాం. 6. మేం మా పూర్వీకులలాగా ప్రకృతిని కాపాడుతాం. 7. ప్రతి ఇల్లు కావాలి ఒక పాఠశాల- ప్రతి బస్తీ కావాలి ప్రయోగశాల. 9. మేం ఓటును అమ్ముకోం.. నమ్ముకొని ముందుకెళ్తాం' అనే సూత్రాలతో సాగుతామని వంగపల్లి చెప్పారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్ పొట్టపెంజర రమేశ్, ఎమ్మార్పీఎస్ టీఎస్ సీనియర్ నేత కొల్లూరి యాదగిరి, మండల అధ్యక్షుడు బైరపాక నాగరాజు, జిల్లా యూత్ అధ్యక్షుడు క్యాసగల్ల రమేశ్, నాయకులు బొట్ల శంకర్, వంగపల్లి ఉప్పలయ్య, బొట్ల మంగపతి, డీలర్ మైసయ్య, నల్ల జహంగీర్, బొట్ల కృష్ణ, వంగపల్లి మధు, కొల్లూరి నరేశ్, వెల్మజాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

భవనాల అప్పగింత నేడు

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ చేతికి రానున్నాయి. అయితే ఎర్రమంజిల్‌లో ఉన్న సాగునీటి పారుదలశాఖ కార్యాలయాల అప్పగింత ఆలస్యమయ్యే అవకాశం ఉన్నది. ఈ భవనాలను ఖాళీ చేయడానికి ఏపీ అధికారులు సిద్ధంగా ఉన్నా.. ఇక్కడి సామగ్రి, ఫైళ్లను ఎక్కడకు పంపించాలనే దానిపై అమరావతిలో ఉన్న అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో ఆలస్యమవుతున్నది. ఒకట్రెండు రోజుల్లో ఈ విషయంలో స్పష్టత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. అలాగే, ఏపీ ప్రభుత్వానికి రెండు భవనాలు ఇవ్వడానికి ముందుకొచ్చిన తెలంగాణ.. అసెంబ్లీ ఎదురుగా ఉన్న హెర్మిటేజ్ భవనం, ఏసీ గార్డ్స్‌లోని సీఐడీ భవనాన్ని అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నది. ఈ మేరకు ఆయా భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలను ఇతర భవనాల్లోకి తరలిస్తున్నారు. హెర్మిటేజ్ భవనంలో ఉన్న కార్యాలయాల తరలింపు దాదాపు పూర్తికావచ్చింది. త్వరలో ఆ భవనాలను ఏపీకి అప్పగిస్తారు.

రాష్ట్ర విభజన నేపథ్యంలో హైదరాబాద్ నుంచి పాలన కొనసాగించేందుకు ఏపీ ప్రభుత్వానికి సచివాలయంలోని పలు బ్లాకులతో పాటు రాజధానిలో మరికొన్ని భవనాలను ఆ రాష్ట్రానికి కేటాయించారు. కానీ, ఏపీ ప్రభుత్వం 2016 నుంచే తన కార్యకలాపాలను అమరావతి నుంచే ప్రారంభించింది. అధికారులంతా అమరావతికి తరలివెళ్లారు. ఫైళ్లతోపాటు వివిధ రకాల సామగ్రినంతటినీ తీసుకువెళ్లారు. దీంతో అప్పటినుంచి ఏపీకి కేటాయించిన సచివాలయ భవనాలన్నీ తెలంగాణ చేతికి వస్తున్న నేపథ్యంలో నూతన సచివాలయాన్ని ఈ ప్రాంగణంలోనే నిర్మించాలని సీఎం కేసీఆర్ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. దాదాపు 25 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ స్థలంలో అన్ని హంగులతో పర్యావరణ హితంగా ఉండేలా సచివాలయాన్ని నిర్మించనున్నట్టు సమాచారం. ఈ మేరకు నూతన సచివాలయానికి ఈ నెల 27న ముఖ్యమంత్రి అప్పగించడానికి ముందుకువచ్చింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చొరవ తీసుకొని ఏపీలో కొత్తగా ఏర్పడిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి స్నేహహస్తం అందించారు. ఏపీకి కేటాయించిన సచివాలయ భవనాలన్నీ తెలంగాణ చేతికి వస్తున్న నేపథ్యంలో నూతన సచివాలయాన్ని ఈ ప్రాంగణంలోనే నిర్మించాలని సీఎం కేసీఆర్ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. దాదాపు 25 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ స్థలంలో అన్ని హంగులతో పర్యావరణ హితంగా ఉండేలా సచివాలయాన్ని నిర్మించనున్నట్టు సమాచారం. ఈ మేరకు నూతన సచివాలయానికి ఈ నెల 27న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శంకుస్థాపన చేయనున్నట్టు, ఈ మేరకు జీఏడీ ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. నూతన సచివాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే తాత్కాలిక సచివాలయంగా బూర్గుల రామకృష్ణారావు భవన్‌ను వినియోగించనున్నట్టు తెలిసింది. మంత్రిత్వ శాఖ కార్యాలయాలన్నీ బీఆర్కే భవన్‌కు తరలించే అవకాశం ఉన్నది. కీలకమైన అధికారులు ఉండే ప్రధాన కార్యదర్శి కార్యాలయం, సాధారణ పరిపాలనశాఖ కార్యాలయంతో పాటు ఇతర కీలకమైన అధికారులకు ఎల్ బ్లాక్‌ను కేటాయించాలని భావిస్తున్నట్టు సమాచారం.

రైతుబంధుతో సిరుల పంట

మొదటిపేజీ తరువాయి...

సీజన్లలో 1.28 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా నిర్దేశించుకున్నది. వానకాలం 78.7 లక్షల టన్నులు, యాసంగిలో 49.3 లక్షల టన్నులు లక్ష్యంగా ఉన్నది. మంచి వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండి ఆయకట్టుకు సాగునీరందితే ఈ స్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి ఉంటుందని అంచనా వేస్తున్నది. గత ఏడాది లక్ష్యంతో చూస్తే రెండు లక్షల టన్నులు అధికం. ఈ మేరకు వ్యవసాయశాఖ 2019-20 ప్రణాళికలో పొందుపర్చింది.

నైరుతి ఆలస్యమైనా.. సాగు, ఉత్పత్తి ఘనం

నైరుతి వర్షాలు ఆలస్యమైనప్పటికీ 97 శాతం వానలు కురుస్తాయని వాతావరణశాఖ ఇప్పటికే తెలిపింది. ఈ ఏడాదే కాళేశ్వరం ద్వారా కొన్ని లక్షల ఎకరాలకు, మరికొన్ని ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందిస్తామని ప్రభుత్వం ధీమాగా ప్రకటించింది. అందుకు అనుగుణంగా పంటల సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలకు పెరుగుతుందని భావిస్తున్న వ్యవసాయశాఖ.. ఆహారధాన్యాల దిగుబడి పెరిగి, ఉత్పత్తి కూడా అమాంతం అధికమవుతుందని అంచనా వేస్తున్నది. వానకాలం, యాసంగి సీజన్లలో కలిపి ఒక్క వరి ఉత్పత్తి 97.9 లక్షల టన్నులు వస్తుందని అంచనా. 2018-19లో మొత్తం ఆహారధాన్యాల ఉత్పత్తి లక్ష్యం 126.21 లక్షల టన్నులు ఉండగా, అంతకుముందు ఏడాది 90.89 లక్షల టన్నులుగా ఉన్నది. ప్రస్తుత వానకాలం, యాసంగి సీజన్లలో వరిసాగు విస్తీర్ణం ఆరు లక్షల ఎకరాలపైగా పెరుగుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తున్నది. గత ఏడాది అంచనాతో పోలిస్తే దాదాపు 3 లక్షల ఎకరాలు అధికం. ఈసారి కూడా పత్తిసాగు పెరుగొచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

గతంలో అంచనాలు చేరని లక్ష్యం

గత ఏడాది వ్యవసాయశాఖ 126.21 లక్షల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తిని లక్ష్యంగా ప్రణాళికలో పేర్కొన్నది. నెల కిందట అర్థగణాంకశాఖ విడుదలచేసిన మూడో ముందస్తు అంచనాల ప్రకారం.. 91.87 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగింది. ఇప్పటివరకు అంచనాల కంటే 34 లక్షల టన్నులు తగ్గింది. నాలుగో ముందస్తు అంచనాల తర్వాత ఈ మొత్తం పెరుగొచ్చని అధికారులు చెప్తున్నారు.

నాలుగేండ్లలో వ్యవసాయశాఖ ఆహారధాన్యాల ఉత్పత్తి ప్రణాళికలు

సంవత్సరం	లక్ష్యం (లక్షల టన్నుల్లో)	ఉత్పత్తి (లక్షల టన్నుల్లో)
2015-16	110	50.18
2016-17	97.41	96.36
2017-18	90.89	96.20
2018-19	126.21	91.87

'రిషబ్' చీటింగ్‌లో దర్యాప్తు పూర్తి

- డిపాజిట్లు, చిట్టీల పేరుతో రూ.50 కోట్ల మోసం
- నిందితులపై చార్జిషీట్ దాఖలుచేసిన సీసీఎస్ పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: అధిక వడ్డీల ఆశచూపి భారీగా డిపాజిట్లు సేకరించడంతోపాటు చిట్టీల పేరుతో వందల మందిని మోసం చేసిన శ్రీరిషబ్ చిట్‌ఫండ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కేసులో సీసీఎస్ పోలీసులు చార్జిషీట్ దాఖలుచేశారు. రిషబ్ చిట్‌ఫండ్‌పై మూడు కేసులు నమోదవగా, రెండు కేసుల్లో ప్రధాన నిందితులైన శైలేశ్‌కుమార్ గుజ్జర్, ఆయన భార్య నందినిపై పోలీసులు అభియోపత్రాలు దాఖలుచేశారు. శైలేశ్‌గుజ్జర్, నందిని దంపతులు ఈ సంస్థను 15 ఏండ్ల క్రితం ఏర్పాటుచేశారు. తొలుత చిట్టీలకే పరిమితమైన ఈ సంస్థ.. లక్ష నుంచి రూ.50 లక్షల వరకు చిట్టీలు వేసింది. సంస్థపై నమ్మకం పెరుగడంతో నిర్వాహకులకు తెలిసినవారు, ఆయన వర్గంవారు రెండు రూపాయల వడ్డీకి అక్కడే డిపాజిట్లు చేయడం ప్రారంభించారు. ఊహించని విధంగా వ్యాపారం వృద్ధి చెందడంతో శైలేశ్ ఖరీదైన జీవితానికి అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో డిపాజిట్‌దారులకు, చిట్టీలకు ప్రతినెల చెల్లింపులకు ముందుగా అక్కడివిక్కడ.. ఇక్కడివక్కడా రోటేషన్‌చేస్తూ నెట్టుకొచ్చాడు. ఇక్కడ లోటు బడ్జెట్ ఉండటంతో అప్పులు చేయడం ప్రారంభించాడు. క్రమేణా అప్పులతోపాటు వడ్డీల చెల్లింపులు ఎక్కువయ్యాయి. మరో వ్యాపారంలో పెట్టుబడి పెట్టి, అక్కడి లాభాలను ఇక్కడకు మళ్లించాలని భావించాడు. గోవాలో క్యాసినో వ్యాపారంలోకి దిగాడు. బార్ అండ్ రెస్టారెంట్లు పెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇలా డిపాజిట్‌దారులకు డబ్బు చెల్లించక బిచాణా ఎత్తేశాడు. రూ.50 కోట్ల వరకు మోసం చేశాడంటూ బాధితుల మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దానిని సీసీఎస్‌కు బదిలీచేశారు. గత డిసెంబర్‌లో దర్యాప్తు జరిపిన సీసీఎస్ పోలీసులు నిర్వాహకులైన శైలేశ్ దంపతులను అరెస్ట్‌చేసి, వారిపై అభియోగ పత్రాలు సమర్పించారు.

నేడు విజయవాడకు సీఎం కేసీఆర్

మొదటిపేజీ తరువాయి...

ఎల్వీ సుబ్రమణ్యం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి లేఖ రాశారు. ఇరురాష్ట్రాల సీఎంలు షెడ్యూల్ 9, 10లోని సంస్థల విభజన అంశంపై

పాపం ఫైజల్!

స్కూల్ బస్సులోనే నిద్ర.. ఊపిరాడక మృతిచెందిన చిన్నారి

దుబాయ్‌లో భారత సంతతికి చెందిన ఆరేండ్ల బాలుడు మృతి

ఫైజల్ (ఫైల్)

దుబాయ్: స్కూల్ బస్సులో నిద్రపోయిన భారత సంతతికి చెందిన ఆరేండ్ల విద్యార్థి ఊపిరాడక ప్రాణాలు విడిచాడు. ఈ హృదయవిదారక ఘటన దుబాయ్‌లో జరిగింది. ఆల్‌కోజ్‌లోని ఇస్లామిక్ సెంటర్‌లో చదువుతున్న ముహమ్మద్ ఫర్హాన్ ఫైజల్ శనివారం పాఠశాల వెళ్లడానికి స్కూల్ బస్సు ఎక్కాడు. కొద్ది సేపటికే గాఢ నిద్రలోకి జారుకున్నాడు. బస్సు స్కూల్‌కు చేరుకున్నాక, మిగితా విద్యార్థులందరూ దిగిపోగా.. ఫైజల్ మాత్రం బస్సులోనే మిగిలిపోయాడు. విద్యార్థి బస్సులో ఉన్న విషయాన్ని గమనించని డ్రైవర్.. బస్సు డోర్‌ను, కిటికీ అద్దాలను మూసి వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం 3 గంటలకు డ్రైవర్ డోర్ తెరిచిచూడగా.. ఫైజల్ కనిపించాడు. దగ్గరికి వెళ్లి పరీక్షించగా అప్పటికే ఊపిరాడకుండా చనిపోయినట్టు గుర్తించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. సమాచారాన్ని ఫైజల్ కుంటుంబానికి తెలియజేశారు. కేరళకు చెందిన ఫైజల్ కుటుంబం చాలా కాలంగా దుబాయ్‌లో నివసిస్తున్నది. ఫైజల్ తండ్రి వ్యాపారి. ముగ్గురు సంతానంలో చివరివాడైన ఫైజల్.. గత ఏడాదే ఇస్లామిక్ సెంటర్‌లో చేరాడు. ఫైజల్ మృతితో ఆ కుటుంబం కన్నీరు మున్నీరవుతున్నది.

హాంకాంగ్‌లో చల్లారని నిరసనలు!

క్యారీలామ్ తన పదవికి రాజీనామా చేయాలంటూ డిమాండ్

హాంకాంగ్: నేరస్తుల అప్పగింత బిల్లుపై ప్రభుత్వం దిగివచ్చినప్పటికీ హాంకాంగ్‌లో ప్రజాగ్రహం చల్లారడం లేదు. వేలాదిమంది నిరసనకారులు ఆదివారంనాడు హాంకాంగ్ వీధుల్లోకొచ్చి బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. చైనా అనుకూల నాయకురాలు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ క్యారీలామ్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహించారు. చైనాకు నేరస్తుల అప్పగింతకు సంబంధించిన ప్రతిపాదిత బిల్లును శాశ్వతంగా నిలిపివేయాలని, క్యారీలామ్ తన పదవికి రాజీనామా చేయాలంటూ నినదించారు. చైనాకు నేరస్తుల అప్పగింతకు సంబంధించిన ప్రతిపాదిత బిల్లును నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు హాంకాంగ్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా పశ్చిమ దేశాల ప్రేరణతో కొందరు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగడం, ప్రజల్లో దీనిపై అపోహలు సృష్టిస్తుండడంతో ఈ బిల్లును కొంత కాలం పాటు జాప్యం చేయాలని తాము భావించినట్టు క్యారీలామ్ చెప్పారు. నేరస్తుల అప్పగింత బిల్లుపై ఫిబ్రవరిలో చర్చల ప్రక్రియను హాంకాంగ్ ప్రారంభించింది. జూలైలో బిల్లును చట్ట సభ ముందుంచాలని భావించింది. అయితే, ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో వెనక్కు తగ్గింది.

ఆదివారం తెల్లవారుజామున హాంకాంగ్‌లో చట్టసభ ఎదుట ఆందోళన చేస్తున్న వేలాది మంది నిరసనకారులు

నిధుల దుర్వినియోగం కేసులో..

ఇజ్రాయెల్ ప్రధాని భార్యకు శిక్ష

రూ.2 లక్షల జరిమానా విధించిన కోర్టు

జెరూసలెం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భార్య సారా నెత్యనాహు(60) నిధుల దుర్వినియోగం కేసులో దోషిగా తేలారు. దీంతో జెరూసలెం కోర్టు ఆమెకు 10,000 షేకిల్స్ (సుమారు రూ.2 లక్షలు) జరిమానాతో పాటు దుర్వినియోగం చేసిన 45,000 షేకిల్స్(సుమారు రూ.9 లక్షలు)ను 9 విడుతల్లో చెల్లించాలని ఆదేశించింది. బెంజమిన్ నెతన్యాహు 2009 నుంచి పదేండ్లుగా ఇజ్రాయెల్ ప్రధానిగా ఉన్నారు. ఆయన భార్య సారా నెతన్యాహు ఆయనతోనే అధికార నివాసంలో ఉంటున్నారు. అక్కడ వారికి భోజనం వండేందుకు ఓ వంటమనిషి ఉన్నప్పటికీ సారా నెతన్యాహు బయట నుంచి భోజనం తెప్పించుకుంటున్నారు. 2018 జూన్‌లో దీనిపై కోర్టులో పిటిషన్ దాఖలైంది. ప్రజా నిధులను మోసపూరితంగా దుర్వినియోగం చేసినట్లు ఆమె అంగీకరించడంతో జెరూసలెం కోర్టు న్యాయమూర్తి దోషిగా నిర్ధారించి తక్కువ మొత్తంలో జరిమానా విధించారు. సారా నెతన్యాహు వినతి మేరకు భోజనం కోసం దుర్వినియోగం చేసిన నిధులను 9 విడుతల్లో తిరిగి చెల్లించేందుకు అంగీకరించారు.



నేటి నుంచి పార్లమెంట్

జూలై 26 వరకు సమావేశాలు

తొలి రెండు రోజులు కొత్త సభ్యుల ప్రమాణస్వీకారం

19న స్పీకర్ ఎన్నిక.. జూలై 5న కేంద్ర బడ్జెట్

న్యూఢిల్లీ: పదిహేడో లోక్‌సభ తొలి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. లోక్‌సభ 30 రోజులు, రాజ్యసభ 27 రోజులపాటు సమావేశం కానున్నాయి. జూలై 26తో సమావేశాలు ముగుస్తాయి. తొలి రెండు రోజులు లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రొటెం స్పీకర్ వీరేంద్ర కుమార్ ప్రమాణస్వీకారం చేయిస్తారు. 19న కొత్త స్పీకర్ ఎన్నిక జరుగనుంది. ఆ మరుసటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగించనున్నారు. జూలై 4న ఆర్థిక సర్వే, ఆ మరుసటి రోజు కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. మోదీ సర్కారు తొలి పర్యాయంలో మొత్తం 10 ఆర్డినెన్సులు జారీ చేయగా, రాజ్యసభలో విపక్షాలదే పైచేయి కావడంతో వాటిని అడ్డుకున్నాయి. ట్రిపుల్ తలాక్ బిల్లు, జమ్ము కశ్మీర్ రిజర్వేషన్, ఆధార్ చట్టం, కంపెనీల చట్టం, భారత వైద్య మండలి చట్ట సవరణ బిల్లులకు సంబంధించి మరోసారి కేంద్రం ఆర్డినెన్సులు జారీ చేసింది. ఈ సమావేశాల్లో ఈ ఆర్డినెన్సుల స్థానంలో ప్రభుత్వం బిల్లులను ప్రవేశపెట్టనుంది. అయితే ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీ

పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో బీజేపీ ఆదివారం పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని నిర్వహించింది. అలాగే ఎన్డీయే పక్ష నేతలు కూడా ప్రత్యేకంగా సమావేశమై పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. 'సబ్‌కాసాత్, సబ్‌కావికాస్, సబ్‌కావిశ్వాస్ స్ఫూర్తిని చాటే బిల్లుల ఆమోదానికి కృషి చేస్తామని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నాం' అని సమావేశం అనంతరం ప్రధాని నరేంద్రమోదీ ట్వీట్ చేశారు.

ఐదు లక్ష్యాలతో

అఖిలపక్షం

- ప్రధాని మోదీ అధ్యక్షతన ఎల్లుండి సమావేశం
- ప్రధాన ఎజెండాగా ఒకే దేశం- ఒకే ఎన్నికలు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 19న మరోసారి అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఒకే దేశం- ఒకే ఎన్నికలు సహా ఐదు ప్రధాన లక్ష్యాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. దీనికి హాజరుకావాల్సిందిగా పార్లమెంట్‌లో ప్రాతినిధ్యమున్న అన్ని పార్టీల అధినేతలకు కేంద్ర ప్రభుత్వం లేఖలు రాసింది. ఈ మేరకు టీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, వైసీపీ అధినేత, ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆహ్వానాలు అందాయి. 17వ లోక్‌సభలో జరుగనున్న తొలి సమావేశాలు సరికొత్త ఉత్సాహంతో, సరికొత్త ఆలోచనలతో సాగాలని, ఈ మేరకు సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రధాని మోదీ ఆ లేఖల్లో ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఐదు ప్రధాన అంశాలపై చర్చించనున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఆదివారం ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ ఒకే దేశం-ఒకే ఎన్నికలు, పార్లమెంట్ సమావేశాలు ఫలవంతంగా సాగడం, ఈ ఏడాది నిర్వహించనున్న మహాత్మాగాంధీ 150వ జయంత్యుత్సవాలు, 2022లో 75 ఏండ్ల స్వాతంత్ర్య ఉత్సవాల నిర్వహణ, వెనుకబడిన జిల్లాల అభివృద్ధిని ప్రధాన ఎజెండాగా నిర్దేశించామన్నారు. అనంతరం ఈ నెల 20న లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో సమావేశం, విందు ఉంటుందన్నారు.

సహకరించండి

పార్లమెంట్ సమావేశాలను సజావుగా సాగనిద్దాం

విభేదాలను పక్కనపెట్టి ప్రజాసమస్యలపై చర్చిద్దాం ■ అఖిలపక్ష భేటీలో ప్రధాని మోదీ పిలుపు

జమ్ముకశ్మీర్ ఎన్నికలు, రైతు ఆత్మహత్యలు, నిరుద్యోగం తదితర అంశాలపై చర్చించాలన్న ప్రతిపక్షాలు

ఆదివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగేలా ప్రతిపక్ష పార్టీలు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజ్ఞప్తి చేశారు. పార్టీల మధ్య ఉన్న విభేదాలను పక్కనపెట్టి ప్రజాసమస్యలపై చర్చించాలని పిలుపునిచ్చారు. సమావేశాలకు ఒక రోజు ముందు ఆదివారం మోదీ అధ్యక్షతన ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ భేటీకి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రాజ్యసభలో బీజేపీ పక్ష నేత తావర్‌చంద్ గెహ్లోట్, ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్, కాంగ్రెస్ ఎంపీలు అధిర్ రంజన్ చౌదరి, కే సురేశ్, వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్‌గోపాల్ యాదవ్, ఎన్సీ నేత ఫరూఖ్ అబ్దుల్లా, టీఎంసీ నేత డెరెక్ ఒబ్రియిన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ 'మనం ప్రజల కోసం ఉన్నాం. సమావేశాలకు ఆటంకం కలిగిస్తే ప్రజలు హర్షించరు. కాబట్టి అన్ని పార్టీలు విబేధాలను పక్కనపెట్టి దేశాభివృద్ధి దిశగా సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలి' అని కోరారు. 2022 నాటికి నవ భారతాన్ని నిర్మించాలని, సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అన్ని అంశాలను కేంద్రం గౌరవిస్తుందని, ప్రాధాన్య క్రమంలో పార్లమెంట్‌లో చర్చిద్దామని స్పష్టం చేశారు. మనల్ని నమ్మి ఓటేసిన ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్నామో లేదో ఎంపీలందరూ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. 16వ లోక్‌సభ ముగియడంతో దాదాపు 46 ఆర్డినెన్స్‌లు రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రిపుల్ తలాక్ సహా దాదాపు 10 బిల్లులను బడ్జెట్ సమావేశాల్లో ఆమోదింపజేసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. అయితే అఖిలపక్ష భేటీకి హాజరైన ప్రతిపక్ష పార్టీల నేతలు పలు అంశాలపై చర్చ జరుగాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, కరువు, మీడియా స్వేచ్ఛ వంటి అంశాలను లేవనెత్తింది. వీటితోపాటు జమ్ము కశ్మీర్‌లో త్వరగా అసెంబ్లీ ఎన్నికలు జరుపాలని డిమాండ్ చేసింది. దశాబ్దాలుగా నలుగుతున్న మహిళా బిల్లుకు ఈ సమావేశాల్లోనే ఆమోదం పలుకాలని తృణమూల్ కాంగ్రెస్ నేతలు సూచించారు. కేంద్ర ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తిని బలహీనం చేస్తున్నదని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా కొన్ని రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకొని వేధింపులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. ఎన్నికల విధానంలో సంస్కరణలు అవసరమని, మళ్లీ పేపర్ బ్యాలెట్ విధానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగంపై దృష్టిపెట్టాలి

కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ విలేకరులతో మాట్లాడుతూ.. 'మేం కొత్త ప్రభుత్వాన్ని అభినందించాం. అదే సమయంలో బీజేపీ భావజాలంపై పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశాం. రైతులు, కరువు, తాగునీటి ఎద్దడి, నిరుద్యోగం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టిసారించాలని సూచించాం. మేము ప్రభుత్వంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రైతులు, కార్మికులు, మహిళల అభ్యున్నతికి కృషిచేస్తాం' అని పేర్కొన్నారు. పెరుగుతున్న నిరుద్యోగితాశాతంపై ప్రభుత్వం వెంటనే దృష్టిసారించాలని డిమాండ్ చేశామన్నారు. మీడియా స్వేచ్ఛ అంశాన్నీ తాము ప్రస్తావనకు తెచ్చామని, పాత్రికేయులతో అధికార పార్టీ వ్యవహరిస్తున్న తీరుపై నిరసన వ్యక్తం చేశామన్నారు. లౌకికవాదానికి కాంగ్రెస్ పునాదిరాయి వేసిందని, దానిని కాపాడేందుకు కృషిచేస్తామని చెప్పారు. 'జమ్ముకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేయాలి. కేంద్రం ఓవైపు కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించే వాతావరణం లేదని అంటున్నది. మరోవైపు గత ఏడాది పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని చెప్తున్నది. లోక్‌సభ, పంచాయతీ ఎన్నికలు నిర్వహించగలిగినప్పుడు అసెంబ్లీ ఎన్నికలు ఎందుకు నిర్వహించలేరు' అని ఆజాద్ ప్రశ్నించారు. అక్కడ బీజేపీ ప్రభుత్వం ఏర్పడే అవకాశం లేదు కాబట్టే ఎన్నికలు జరుపడం లేదని ఆరోపించారు.

కాంగ్రెస్ లోక్‌సభ నేత ఎవరు?

మనీశ్ తివారీ, శశిథరూర్, అధిర్ రంజన్, సురేశ్ మధ్య పోటీ

మనీష్‌పై అధిష్ఠానం గుర్రు.. థరూర్‌కు భార్య మృతి అడ్డంకి

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుండి ప్రారంభం కానుండగా, లోక్‌సభలో తమ పక్ష నేత పేరును కాంగ్రెస్ పార్టీ ఇంకా ఖరారు చేయలేదు. మరోవైపు కీలక అంశాల్లో ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు పార్లమెంట్ ఉభయ సభల్లో అనుసరించాల్సిన వ్యూహంపై విపక్షాల్లో గందరగోళం నెలకొంది. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత ఇప్పటికీ లోక్‌సభలో తమ పార్టీ నేత పేరు ఎంపిక చేయలేదన్న విమర్శలపై కాంగ్రెస్ పార్టీ నేత ఒకరు స్పందిస్తూ.. పలు పార్టీలు ఇంకా తమ పక్ష నేతల పేర్లను ఖరారు చేయలేదన్నారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ప్రధాని ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష భేటీకి లోక్‌సభ సభ్యులు అధిర్ రంజన్ చౌదరి (బెంగాల్), కే సురేశ్ (కేరళ) హాజరయ్యారు. వీరితోపాటు కేంద్ర మాజీ మంత్రులు మనీశ్ తివారీ, శశి థరూర్ లోక్‌సభ నేత పదవి కోసం పోటీ పడుతున్నారు. ఇంగ్లిష్‌పై తిరుగులేని పట్టు గల శశిథరూర్ హిందీలోనూ మాట్లాడగలరు కానీ.. ఆయన భార్య సునంద పుష్కర్ మృతి కేసు ప్రధాన అడ్డంకయ్యే అవకాశాలున్నాయి. గత లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేతగా ఉన్న మల్లికార్జున ఖర్గే ఇటీవలి ఎన్నికల్లో ఓడిపోయారు. కేరళ నేత సురేశ్, అధిర్ రంజన్‌లకు హిందీ, ఆంగ్ల భాషలపై పట్టు తక్కువ. ఆనంద్ సాహిబ్ ఎంపీ మనీశ్ తివారీకి హిందీ, ఇంగ్లిష్ భాషలపై సమాన పట్టు ఉన్నది. అయితే ఆయన 2014 ఎన్నికల్లో పోటీకి నిరాకరించడంపై కాంగ్రెస్ అధిష్ఠానం గుర్రుగా ఉన్నట్టు తెలుస్తున్నది. లోక్‌సభలో పార్టీ నేత, ఉప నేత, చీఫ్ విప్, ఇద్దరు విప్‌లను నియమించేందుకు కాంగ్రెస్‌కు మరో 24 గంటల గడువు మాత్రమే ఉన్నది. సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ అధిష్ఠానం చెబుతున్నది. మరోవైపు నియామకాల్లో హస్తం పార్టీ.. ఉత్తర, దక్షిణ భారతల మధ్య సమతుల్యత పాటించాల్సి ఉన్నది.

దీదీతో చర్చలకు ఒకే

- మీడియా సమక్షంలో బహిరంగ వేదికపై చర్చలు జరుగాలి
- సమస్యలు పరిష్కారమైతేనే సమ్మె విరమణ
- పశ్చిమబెంగాల్ ప్రభుత్వానికి తేల్చిచెప్పిన రాష్ట్ర జూనియర్ డాక్టర్ల ఫోరం
- నేడు 24 గంటల దేశవ్యాప్త సమ్మెకు ఐఎంఏ పిలుపు

కోల్‌కతాలో ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్లు

కోల్‌కతా/ న్యూఢిల్లీ, జూన్ 16: పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్లు పట్టు సడలించారు. సీఎం మమతాబెనర్జీతో సమావేశం అయ్యేందుకు ఆదివారం సుముఖత వ్యక్తం చేశారు. మరోవైపు బెంగాల్ జూనియర్ డాక్టర్ల సమ్మెకు మద్దతుగా సోమవారం దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని భారతీయ వైద్యుల సంఘం (ఐఎంఏ) ఆదివారం నిర్ణయించింది. అత్యవసర సర్వీసులు మినహా అన్ని వైద్య సేవలను బహిష్కరించాలని పిలుపునిచ్చింది. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి 24 గంటల పాటు విధులకు గైర్హాజరు కావాలని కోరింది. వారం నుంచి సమ్మె కొనసాగుతుండటంతో పశ్చిమబెంగాల్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో వైద్య సేవలు స్తంభించాయి. అత్యవసర సేవలు, శస్త్ర చికిత్స విభాగాల్లో రోగులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాగా, తాజా పరిస్థితిపై కోల్‌కతాలో పశ్చిమబెంగాల్ జూనియర్ డాక్టర్ల సంయుక్త ఫోరం రెండున్నర గంటల సేపు చర్చించింది. ఆ తర్వాత ఫోరం అధికార ప్రతినిధి మీడియాతో మాట్లాడుతూ ప్రతిష్టంభనకు తెరదించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. చర్చలకు సీఎం ఎక్కడికి ఆహ్వానించినా వస్తామని, అయితే మీడియా సమక్షంలో పారదర్శకంగా చర్చించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాలలో, దవాఖానల ప్రతినిధులు కూర్చునేందుకు సరైన వేదిక కావాలన్నారు. ముఖామఖీ చర్చలకు రావాలన్న మమత ఆహ్వానాన్ని శనివారం డాక్టర్లు తోసిపుచ్చిన సంగతి తెలిసిందే. తమ డిమాండ్లు పరిష్కారం కాగానే విధుల్లో పాల్గొనాలన్నదే తమ అభిమతం అని అన్నారు. సీఎం తమ సమస్యలను పరిష్కరిస్తారని ఆశాభావంతో ఉన్నామన్నారు. ఒకవేళ పరిష్కారం లభించకపోతే ఆందోళన కొనసాగుతుందన్నారు. గత వారం ఎన్ఆర్ఎస్ వైద్యకళాశాల దవాఖానలో మృతి చెందిన రోగి కుటుంబ సభ్యుల దాడిలో ఇద్దరు జూనియర్ డాక్టర్లకు గాయాలయ్యాయి. దీంతో తమకు దవాఖానల వద్ద పటిష్ఠ భద్రత కావాలని జూనియర్ వైద్యులు ఆందోళన బాట పట్టారు. ఆదివారం ఎమర్జెన్సీ వార్డులు, ఔట్ పేషంట్ తదితర యూనిట్లు పని చేయలేదు. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి 24 గంటల పాటు సమ్మెకు పిలుపునిచ్చిన ఐఎంఏ.. శుక్రవారం నుంచి 4 రోజుల దేశవ్యాప్త నిరసనకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా వైద్యులు హెల్మెట్లు, బ్యాండేజీలు ధరించి విధులకు హాజరవుతూ నిరసన తెలుపుతున్నారు.

వైరాగ్యానంద 'సమాధి' యత్నం విఫలం

విజ్ఞప్తిని తిరస్కరించిన కలెక్టర్

భోపాల్: లోక్‌సభ ఎన్నికల్లో భోపాల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా దిగ్విజయ్ సింగ్ ఓటమి పాలైతే సమాధి అవుతానన్న బాబా వైరాగ్యానంద గిరి అందుకోసం చేసిన ప్రయత్నం విఫలమైంది. ఆదివారం మధ్యాహ్నం 2:11 గంటలకు తాను సజీవ సమాధి అయ్యేందుకు అనుమతించాలని కోరుతూ వైరాగ్యానందగిరి భోపాల్ కలెక్టర్ తరుణ్ కుమార్ పిథోడ్‌కు లేఖ రాశారు. కానీ బాబా విజ్ఞప్తిని కలెక్టర్ పిథోడ్ నిరాకరించారు. బాబా సమాధి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. దిగ్విజయ్ ఓటమితో తన శపథం అమలుకు ఆదివారం ఉదయం 7:30 గంటలకు భోపాల్‌కు చేరుకున్న బాబా వైరాగ్యానంద గిరి బస చేసిన హోటల్ నుంచి బయటకు వెళ్లేందుకు పోలీసులు అనుమతించలేదని ఆయన తరపు న్యాయవాది మజీద్ అలీ తెలిపారు. దీంతో బాబా వైరాగ్యానందగిరి విలేకరులతో మాట్లాడుతూ.. తాను సమాధి అవుతానని అన్నారు.

కేరళ కాంగ్రెస్ (ఎం)లో చీలిక

పార్టీ చైర్మన్‌గా మణి ఎన్నిక

అంగీకరించబోమన్న వర్కింగ్ చైర్మన్ పీజే జోసెఫ్

కొట్టాయం: కేరళ కాంగ్రెస్ (ఎం) చీలిపోయింది. పార్టీ వ్యవస్థాపకుడు కేఎం మణి ఇటీవల మరణించారు. దీంతో పార్టీలో రెండు వర్గాల మధ్య మొదలైన ఆధిపత్య పోరు ఆదివారం చీలికకు దారి తీసింది. మణి కుమారుడు, రాజ్యసభ సభ్యుడు జోస్ కే మణి కేరళ కాంగ్రెస్ (ఎం)కు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రిసైడింగ్ అధికారి కేజడ్ కుంజేరియా ప్రకటించారు. పార్టీ రాష్ట్ర కమిటీలోని 437 మంది సభ్యులకు 325 మంది ఆదివారం నాటి సమావేశానికి హాజరయ్యారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ ఎన్నికను తాము ఆమోదించమని మరోవర్గమైన పార్టీ వర్కింగ్ చైర్మన్ పీజే జోసెఫ్ వెల్లడించారు. ఆదివారం సమావేశానికి పార్టీ సీనియర్ నేత జోయ్ అబ్రహాం, ఎమ్మెల్యేలు సీఎఫ్ థామస్, మూన్స్ జోసెఫ్ హాజరుకాలేదన్నారు. ఐదుగురు ఎమ్మెల్యేల్లో ఇద్దరే హాజరయ్యారన్నారు.

బీహార్‌లో మరణమృదంగం

వడదెబ్బతో 24 గంటల్లో 61 మంది మృత్యువాత

93కి చేరిన ముజఫర్‌పూర్ చిన్నారుల మరణాలు

రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం నితీశ్‌కుమార్

గయాలోని దవాఖానలో చికిత్స పొందుతున్న వడదెబ్బ బాధితులు

పాట్నా/ ముజఫర్‌పూర్, జూన్ 16: బీహార్‌లో మృత్యుఘోష కొనసాగుతున్నది. మెదడువాపు లక్షణాలతో ఓ వైపు చిన్నారులు మృత్యువాతపడుతుంటే.. మరోవైపు భానుడి భగభగలకు జనం పిట్టల్లా రాలుతున్నారు. ముజఫర్‌పూర్‌లో మెదడువాపుతో మృతిచెందిన చిన్నారుల సంఖ్య ఆదివారం నాటికి 93కి పెరిగింది. మరోవైపు వడదెబ్బ కారణంగా రాష్ట్రంలో 24 గంటల వ్యవధిలో 61 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మరణాల పట్ల ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. విపత్తు నిర్వహణ కంట్రోల్ రూం వివరాల ప్రకారం.. ఒక్క ఔరంగాబాద్‌లోనే 30 మంది వడదెబ్బతో ప్రాణాలు కోల్పోయారు. గయాలో 20 మంది, నవాడా జిల్లాలో 11 మంది మృతి చెందారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. శనివారం పాట్నాలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత పదేండ్లలో జూన్ నెలలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇదే కావడం గమనార్హం. గయాలో 45.2 డిగ్రీలు, భాగల్‌పూర్‌లో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాట్నాలో పాఠశాలలను 19 వరకు మూసే ఉంచాలని ప్రభుత్వం ఆదేశించింది.

కొనసాగుతున్న చిన్నారుల మరణాలు

ముజఫర్‌పూర్‌లో మెదడువాపు లక్షణాలతో మృతిచెందిన బాలల సంఖ్య ఆదివారం 93కి చేరుకుంది. శ్రీకృష్ణ మెడికల్ కాలేజ్, దవాఖాన 79 మంది, కేజ్రీవాల్ దవాఖానలో 14 మంది మృతిచెందినట్టు అధికారులు వెల్లడించారు. పరిస్థితిని సమీక్షించేందుకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్, సహాయ మంత్రి అశ్విని చౌబే ఆదివారం ముజఫర్‌పూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బాధితుల బంధువుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. మెదడువాపు లక్షణాలతో జూన్ 1 నుంచి ఇప్పటివరకు ఎస్‌కేఎంసీహెచ్‌లో 197 మంది, కేజ్రీవాల్ దవాఖానలో 91 మంది చేరారు.

ఇదేనా రామరాజ్యం?

నానాపటేకర్‌కు క్లీన్‌చిట్‌పై నటి తనుశ్రీదత్తా ఫైర్

ముంబై: ప్రముఖ నటుడు నానా పటేకర్‌పై తాను చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు అవాస్తమని, ద్వేషపూరితమైనవని ముంబై పోలీసులు సమర్పించిన నివేదికపై నటి తనుశ్రీదత్తా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నానాపటేకర్ పోలీసులకు లంచం ఇచ్చారని ఆరోపించారు. ప్రధాని మోదీకి ఈ విషయమై ఆమె మొరపెట్టుకున్నారు. 'మోదీజీ ఓ భారత పుత్రిక వేధింపులకు గురైంది. న్యాయం దక్కకపోగా, ఆమెను అప్రతిష్టపాలు చేశారు. కెరీర్ నాశనమైంది. దేశం విడిచి అజ్ఞాత జీవితం గడిపేలా చేశారు. ఆమె ఫిర్యాదు అవాస్తమని మీ పోలీసులు చెప్తున్నారు! ఇదేనా మీ రామరాజ్యం?' అని ప్రశ్నించారు. 2008 లో ఓ సినిమా షూటింగ్ సందర్భంగా నానా పటేకర్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని తనుశ్రీ దత్తా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

చదువుకుంటానంటే చంపబోయాడు

యూపీలో కూతురిపై తండ్రి హత్యాయత్నం.. సహకరించిన సోదరుడు

దవాఖానలో చికిత్స పొ

పాయింట్ల పట్టిక

స్థానం	జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే.	ర.రే	పా
1.	ఆస్ట్రేలియా	5	4	1	0	+0.81	8
2.	న్యూజిలాండ్	4	3	0	1	+2.16	7
3.	భారత్	4	3	0	1	+1.02	7
4.	ఇంగ్లండ్	4	3	1	0	+1.55	6
5.	శ్రీలంక	5	1	2	2	-1.77	4
6.	వెస్టిండీస్	4	1	2	1	+0.66	3
7.	దక్షిణాఫ్రికా	5	1	3	1	-0.20	3
8.	బంగ్లాదేశ్	4	1	2	1	-0.71	3
9.	పాకిస్థాన్	5	1	3	1	-1.93	3
10.	ఆఫ్ఘనిస్థాన్	4	0	4	0	-1.63	0

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు,

వరల్డ్‌కప్‌లో నేడు వెస్టిండీస్ X బంగ్లాదేశ్ - 3 గం. స్టార్ స్పోర్ట్స్‌లో

అత్యధిక పరుగులు **343** ఫించ్ (ఆస్ట్రేలియా)

అత్యధిక వికెట్లు **13** ఆమిర్ (పాకిస్థాన్)

భారత్ సప్తపది

పాక్‌కు ఏడుపే గతి

విశ్వవేదికపై అజేయ రికార్డును నిలబెట్టుకున్న టీమ్‌ఇండియా

ఏడోసారి పాకిస్థాన్‌పై జయభేరి ■ రోహిత్ భారీ సెంచరీ ■ రాణించిన విరాట్, రాహుల్

విశ్వవేదికపై భారత్ అజేయ జైత్రయాత్ర ఈసారి కూడా నిర్విఘ్నంగా సాగింది. దాయాదే కాదు వరుణుడు కూడా టీమ్‌ఇండియా జోరును అడ్డుకోలేకపోయాడు. పుల్వామా ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలని కొందరు.. కాదు కాదు, మ్యాచ్ ఆడి మన సత్తా ఏంటో వారికి చాటి చెప్పాలని మరికొందరు. ఇలా భిన్న వాదనల మధ్య దాయాదితో పోరుకు దిగిన భారత్.. చిరకాల ప్రత్యర్థిని చిత్తు చిత్తుగా ఓడించి చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. విశ్వవేదికపై ఇప్పటికే ఆరుసార్లు పాక్‌ను పాతరేసిన టీమ్‌ఇండియా.. ఏడోసారి కూడా వారికి ఏడుపే మిగిల్చింది.

తొలుత సంయమనం.. తర్వాత పరాక్రమం.. ఆపై సాధికారికత.. చివర్లో మెరుపులు ఇది భారత్ బ్యాటింగ్ సాగిన తీరు. రోహిత్ సూపర్ సెంచరీకి.. రికార్డుల రారాజు విరాట్ కోహ్లీ, కొత్త ఓపెనర్ రాహుల్ మెరుపులు తోడవడంతో టీమ్‌ఇండియా భారీ స్కోరు చేసింది. 'టాస్ గెలిస్తే బ్యాటింగ్ ఎంచుకోండి'అన్న ప్రధాని మాటలను పెడచెవిన పెట్టిన పాకిస్థాన్ కెప్టెన్ సర్ఫరాజ్.. విరాట్ సేనకు బ్యాటింగ్ అప్పగించి అందుకు తగ్గ మూల్యం చెల్లించుకున్నాడు. లక్ష్యఛేదనలో మన బౌలర్ల ధాటికి బెంబేలెత్తిన పాక్‌ను.. ఆఖర్లో వరుణుడు మరింత ఆటాడుకున్నాడు.

సరిలేరు నీకెవ్వరు!

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

రోహిత్‌శర్మ.. భారత క్రికెట్‌కు దక్కిన మేలిమి ముత్యం. సొగసైన షాట్లకు చిరునామాగా నిలుస్తూ ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోయడంలో ఈ ముంబైకర్ సిద్ధహస్తుడు. క్రీజులోకి అడుగు పెట్టాడంటే పరుగుల హోరుకు తెరలేపుతూ రోహిత్ సాగించే విధ్వంసం మాటలకందనిది. 'ఎవడన్నా కోపంగా కొడుతాడు..లేకపోతే బలంగా కొడుతాడు. కానీ వీడేంట్రా బుజ్జా చాలా పద్ధతిగా కొట్టాడు. ఏదో గోడ కడుతున్నట్లు..మొక్కకు అంటుకడుతున్నట్లు' అచ్చం ఈ తెలుగు సినిమా పాపులర్ డైలాగ్‌లా ఉంటుంది రోహిత్ బ్యాటింగ్. సెలయేరులా మొదలై సునామీని తలపించేలా బౌలర్లను బాదే తీరు ప్రేక్షకులకు అద్వితీయమైన అనుభూతిని మిగిలుస్తుంది. సచిన్, సెహ్వాగ్ తర్వాత భారత జట్టు ఓపెనింగ్ బాధ్యతలు ఎవరూ మోస్తారన్న అంచనాలను అందిపుచ్చుకుంటూ జాతీయ జట్టులోకి వచ్చిన అనతి కాలంలోనే రోహిత్ హార్డ్‌హిట్టర్‌గా పేరు తెచ్చుకున్నాడు. దిగ్గజాలన్నదగ్గ వారికి కూడా సాధ్యం కాని.. వన్డేల్లో డబుల్ సెంచరీ ఫీట్‌ను శర్మ మూడు సార్లు(208*, 264, 209) ముద్దాడాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో హిట్‌మ్యాన్‌గా పేరుగాంచిన రోహిత్ జట్టు మెరుగైన శుభారంభాలు అందించడంలో దిట్ట. బౌలర్లు సంధించే బుల్లెట్లలాంటి బంతులను అంతే వేగంతో బౌండరీలు దాటించడంలో ఈ టీమ్‌ఇండియా క్రికెటర్‌ను మించిన వాడు ప్రస్తుత ప్రపంచ క్రికెట్‌లో భూతద్దం పెట్టి వెతికినా కనిపించడమో. సహచర ఓపెనర్ శిఖర్ ధవన్‌తో కలిసి జట్టు ఎన్నో చిరస్మరణీయ విజయాలందించిన రోహిత్.. క్రీజులో కుదురుకున్నాడంటే ప్రత్యర్థి బౌలర్లకు బడిత పూజే. అవును ఒక బంతిని వైవిధ్యమైన రీతిలో ఆడటంలో శర్మది అందెవేసిన చేయి. మంచినీళ్లు తాగినంత సులభంగా సిక్స్‌లు కొట్టగలడు. కోహ్లీ లాగా బలవంతునిలా కనిపించకపోయినా..బంతి పేస్‌ను తనకు అనుకూలంగా మలుచుకుంటూ షాట్లు కొట్టడంలో ఈ ముంబైకర్ ఆరితేరాడు. ఈ మధ్యే ముగిసిన ఐపీఎల్‌లో బ్యాటింగ్‌లో అంతగా ఆకట్టుకోలేకపోయినా ముంబైని రికార్డు స్థాయిలో నాలుగో సారి చాంపియన్‌గా నిలిపాడు. మెగాటోర్నీలో దక్షిణాఫ్రికాతో తొలి మ్యాచ్‌లోనే శర్మ సూపర్ శతకంతో కదంతొక్కి జట్టుకు అదిరిపోయే బోణీ అందించాడు. సహచరులు విఫలమైన చోట సాధికారిక ఇన్నింగ్స్‌తో క్రీజులో నిలదొక్కుకుని తన సహజ సిద్ధమైన ఆటతీరుకు భిన్నంగా సెంచరీతో జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో మలి మ్యాచ్‌లో సెంచరీ హీరో ధవన్‌కు చక్కని సహకారమందిస్తూ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. వీరిద్దరు అందించిన శుభారంభంతో భారీ స్కోరు అందుకున్న భారత్..కంగారూలను మట్టికరిపించింది. కివీస్‌పై అదే జోరు కొనసాగిద్దామనుకున్నా..వరుణుడి అంతరాయంతో సాధ్యపడలేదు. విజయమో, వీర స్వర్గమో అన్న రీతిలో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో రోహిత్ చెలరేగిన తీరు అద్భుతం. పాక్ స్టార్ పేసర్ మహ్మద్ ఆమిర్‌పై తన రికార్డు అంత బాగాలేకున్నా...వెరువని ఆత్మవిశ్వాసంతో..రాహుల్‌తో కలిసి రోహిత్ నిర్మించిన ఇన్నింగ్స్ మ్యాచ్‌కే హైలెట్. క్రీజులో కుదురుకోవడానికి కొంత సమయం తీసుకున్నా..ఆ తర్వాత ఏ ఒక్క బౌలర్‌ను వదలకుండా పరుగులు కొల్లగొట్టాడు. రోహిత్‌ను ఔట్ చేసేందుకు పాక్ కెప్టెన్ సర్ఫరాజ్ ఎన్ని ప్రయత్నాలు చేసినా నెరవేరలేదంటే అతను ఎంత సాధికారికంగా ఆడాడో అర్థమవుతుంది. మైదానం నలువైపులా రోహిత్ కొట్టిన షాట్లకు మాంచెస్టర్ హోరెత్తింది.

1 విశ్వ సమరంలో పాక్‌పై అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన భారత బ్యాట్స్‌మన్‌గా రోహిత్ నిలిచాడు.

ఓవరాల్‌గా ప్రపంచకప్‌లో భారత్, పాక్ మధ్య జరిగిన మ్యాచ్‌ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు(140) సాధించిన క్రికెటర్‌గా రోహిత్ రికార్డుల్లోకెక్కాడు. విరాట్(107), సయీద్ అన్వర్(101) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు.

3 పాక్‌పై వేగంగా సెంచరీ చేసిన మూడో భారత బ్యాట్స్‌మన్‌గా రోహిత్(85 బంతులు) నిలిచాడు. తొలి రెండు స్థానాల్లో సెహ్వాగ్(80, 84 బంతులు) ఉన్నాడు.

4 ప్రపంచకప్‌లో మొదటి మూడు మ్యాచ్‌ల్లో 50 కంటే ఎక్కువ పరుగులు చేసిన నాలుగో భారత బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ. 1987లో సిద్ధు, 1996లో సచిన్, 2011లో యువరాజ్ ఈ ఘనత సాధించారు.

2 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై సెంచరీ చేసిన రెండో బ్యాట్స్‌మెన్‌గా రోహిత్ శర్మ చరిత్రకెక్కాడు. 2015లో విరాట్ కోహ్లీ (107) దాయాదిపై తొలిసెంచరీ నమోదు చేశాడు.

336/5

ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు. 2015లో చేసిన 300/7 ఇప్పటి వరకు అత్యధికం.

136 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై భారత్‌కు ఇదే అత్యుత్తమ ఓపెనింగ్ భాగస్వామ్యం. సచిన్ - సిద్ధు 90 పరుగుల (1996లో) రికార్డు తెరమరుగైంది. ఓవరాల్‌గా పాక్‌పై విశ్వకప్‌లో ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక పార్ట్‌నర్‌షిప్.

2 భారత్ తరఫున అత్యధిక వన్డేలు ఆడిన జాబితాలో ద్రవిడ్ (340)ను వెనక్కి నెట్టి ధోనీ (341) రెండో స్థానానికి చేరాడు. సచిన్ (463) టాప్‌లో ఉన్నాడు.

1 భారత్ తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో 358 సిక్సర్లు కొట్టిన రోహిత్.. ధోనీ (355)ని వెనక్కి నెట్టి అగ్రస్థానానికి చేరాడు.

3 ప్రపంచకప్‌లో తొలి బంతికే వికెట్ తీసిన మూడో బౌలర్‌గా విజయ్ శంకర్ నిలిచాడు.

> ఓడిపోతామనే భావనను పక్కన పెట్టి పట్టుదలగా రాణించడంపైనే దృష్టి సారించండి. ఓటమి భయమే మిమ్మల్ని మరింత ఒత్తిడికి గురిచేస్తుంది. దాని వల్ల ప్రత్యర్థులు చేసే పొరపాట్లను సొమ్ము చేసుకునే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉంది. పాకిస్థాన్ గెలువాలంటే సర్ఫరాజ్ సేన అత్యుత్తమ బ్యాటింగ్, బౌలింగ్ దశంతో బరిలోకి దిగాలి. టాస్ గెలిస్తే బ్యాటింగ్ ఎంచుకుంటేనే మంచిది.
>
> -ఇమ్రాన్ ఖాన్, పాకిస్థాన్ ప్రధాని

కాస్త చూసుంటే..

టీమ్‌ఇండియా ఇన్నింగ్స్ పదో ఓవర్‌లో పాక్ ఫీల్డర్లు కాస్త తెలివిగా వ్యవహరించి ఉంటే రోహిత్ శర్మ రనౌటయ్యేవాడే. వహాబ్ రియాజ్ వేసిన తొలి బంతిని కేఎల్ రాహుల్ మిడ్‌వికెట్ దిశగా తరలించి ఒక పరుగు తీశాడు. స్ట్రయికింగ్ ఎండ్‌కు చేరుకున్న రోహిత్.. రాహుల్‌ను గమనించకుండా రెండో పరుగు కోసం సిద్ధమయ్యాడు. సగం పిచ్ దాటాక అది గుర్తించిన రాహుల్ పరుగు వద్దని వారించాడు. అప్పటికే బంతి అందుకున్న ఫఖర్ జమాన్ బ్యాటింగ్ క్రీజు వైపు గమనించకుండా.. బౌలింగ్ ఎండ్‌కు బంతిని విసిరాడు. అప్పటికే వెనక్కి మళ్లిన రోహిత్.. క్షేమంగా క్రీజులోకి చేరుకున్నాడు. అప్పటికి రోహిత్ స్కోరు 32 పరుగులే. మరికాసేపటికే 11వ ఓవర్‌లో మరో రనౌట్ చాన్స్ మిస్సైంది. రాహుల్ కొట్టిన బంతిని ఆఫ్‌సైడ్‌లో అందుకున్న షాదాబ్ ఖాన్ గాల్లో ఎగురుతూ చక్కటి త్రో అయితే వేశాడు కానీ అది కీపర్‌కు కిలోమీటర్ దూరం నుంచి వెళ్లింది.

చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 338/4 పరుగులు చేస్తే.. ఈసారి మనవాళ్లు కూడా దాదాపుగా దానికి సమానమైన స్కోరే చేశారు. ఆ మ్యాచ్‌లో భారత్ 158 పరుగులకే ఆలౌటైతే.. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ 212/6కు పరిమితమైంది. ఆ రోజు పాక్ టాప్ త్రీ బ్యాట్స్‌మెన్ 219 పరుగులు చేస్తే.. ఆదివారం పోరులో మన ముగ్గురు మొనగాళ్లు 274 పరుగులు చేశారు.

మాంచెస్టర్:

శతకోటి భారతీయుల ప్రార్థనలు ఫలించాయి. విశ్వవేదికపై వరుసగా ఏడోసారి పాకిస్థాన్‌పై టీమ్‌ఇండియాదే పైచేయి అయింది. ఆదివారం డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ముగిసిన మ్యాచ్‌లో భారత్ 89 పరుగుల తేడాతో పాక్‌పై జయభేరి మోగించింది. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ (113 బంతుల్లో 140; 14 ఫోర్లు, 3 సిక్సర్లు) భారీ సెంచరీకి.. కెప్టెన్ విరాట్ కోహ్లీ (65 బంతుల్లో 77; 7 ఫోర్లు), రాహుల్ (78 బంతుల్లో 57; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధశతకాలు తోడవడంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 336 పరుగులు చేసింది. పాక్ బౌలర్లలో మొహమ్మద్ ఆమిర్‌కు 3 వికెట్లు దక్కాయి. లక్ష్య ఛేదనలో కుల్దీప్ (2/32), పాండ్యా (2/44), శంకర్ (2/22) ధాటికి పాకిస్థాన్ 34.4 ఓవర్లలో 6 వికెట్లకు 166 పరుగులు చేసింది. ఈ దశలో మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించడంతో డక్‌వర్త్ లూయిస్ ప్రకారం లక్ష్యాన్ని 40 ఓవర్లలో 302గా సవరించారు. అప్పటికే ప్రధాన బ్యాట్స్‌మెన్ అంతా ఔటవడంతో పాక్‌కు ఓటమి అనివార్యమైంది. ఫఖర్ జమాన్ (75 బంతుల్లో 62; 7 ఫోర్లు, 1 సిక్స్), బాబర్ ఆజమ్ (48; 3 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగిలిన వారంతా ఘోరంగా విఫలమయ్యారు. రోహిత్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

ఆరంభంలో భయపెట్టినా..

చక్కటి బంతులతో దడ పుట్టించిన భువనేశ్వర్ ఐదో ఓవర్‌లో కండరాలు పట్టేయడంతో ఓవర్ పూర్తి చేయకుండానే మైదానం నుంచి బయటకు వెళ్లాడు. దీంతో మిగిలిన రెండు బంతులు వేసేందుకు వచ్చిన విజయ్ శంకర్ తొలి బాలికే ఇమాముల్ హక్ (7)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకొని భారత శిబిరంలో ఆనందం నింపాడు. ఈ దశలో మరో ఓపెనర్ ఫఖర్‌తో కలిసి బాబర్ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. సాధికారికంగా ఆడిన ఈ జోడీ రెండో వికెట్‌కు 104 పరుగులు జోడించి దడ పుట్టించింది.

ఇదే కదా కోరుకున్నది!

టీమ్‌ఇండియా సారథి విరాట్ కోహ్లీ టాస్ ఓడిపోయినా.. అభిమానులంతా ఆశించినట్లే మొదట బ్యాటింగ్ చేసే అవకాశం మనకే దక్కింది. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారీ లక్ష్యాన్ని ఛేదించలేక చతికిలపడ్డ భారత్ ఈ సారి పాకిస్థాన్‌ను ఆ పరిస్థితుల్లోకి నెట్టాలనే దృఢ సంకల్పంతో బ్యాటింగ్‌కు దిగింది. ధవన్ స్థానంలో ఓపెనర్‌గా వచ్చిన రాహుల్‌తో కలిసి రోహిత్ శర్మ ఇన్నింగ్స్‌కు మంచి పునాది వేశాడు. ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై ఏ వికెట్‌కైనా అత్యధిక భాగస్వామ్యాన్ని నమోదు చేసిన ఈ జంట జట్టుకు శుభారంభాన్ని అందించింది. ఆమిర్‌ను జాగ్రత్తగా ఎదుర్కొన్న రోహిత్.. హసన్ అలీపై విరుచుకుపడ్డాడు. అతడు వేసిన ఆరో ఓవర్‌లో 4,6 కొట్టి జోరు కనబర్చాడు. ఆ తర్వాత కొన్ని ఉద్విగ్నభరిత క్షణాలను ఎదుర్కొన్నా.. పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ వికెట్ నష్టపోకుండా 53 పరుగులు చేసింది. వెంటవెంటనే వచ్చిన రెండు రనౌట్ అవకాశాలను పాక్ ఫీల్డర్లు చేజార్చుకోవడం భారత్‌కు కలిసొచ్చింది. పాక్ పేసర్‌లు ఆమిర్, వహాబ్ పదేపదే డేంజర్ జోన్‌లో పరిగెడుతూ అంపైర్ నుంచి హెచ్చరికలు ఎదుర్కోవడం గమనార్హం.

తొలి ముగ్గురే.. 274

స్పిన్నర్ల రంగప్రవేశంతో భారత ఇన్నింగ్స్ వేగం పుంజుకుంది. షాదాబ్ వేసిన తొలి ఓవర్‌లో రాహుల్ ఓ ఫోర్, రోహిత్ 6,4 దంచడంతో 17 పరుగులు వచ్చాయి. ఇదే జోరులో రోహిత్ 34 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. పాక్ స్పిన్నర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో వీరిద్దరూ ఆడుతూ పాడుతూ పరుగులు సాధించారు. ఈ క్రమంలో 2003 ప్రపంచకప్‌లో సచిన్, కైఫ్ మూడో వికెట్‌కు నమోదు చేసిన 102 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌ను అధిగమించి.. పాక్‌పై ఏ వికెట్‌కైనా అత్యధిక భాగస్వామ్యాన్ని నమోదు చేసిన జోడీగా రికార్డుల్లోకెక్కారు. మాలిక్ బౌలింగ్‌లో సిక్సర్‌తో రాహుల్ కూడా ఫిఫ్టీ మార్క్ చేరుకున్నాడు. తొలి వికెట్‌కు 136 పరుగులు జతచేశాక రాహుల్ ఔటైనా.. రోహిత్ మాత్రం దూకుడు తగ్గించలేదు. 85 బంతుల్లో టోర్నీలో రెండో శతకం పూర్తి చేసుకున్న హిట్‌మ్యాన్.. కోహ్లీతో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. సెంచరీ తర్వాత మరింత జోరు పెంచిన రోహిత్.. రెండో వికెట్‌కు 98 పరుగులు జోడించాక ఔటయ్యాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చిన పాండ్యా (19 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని భారీ షాట్లు ఆడి వెనుదిరగగా.. ధోనీ (1) నిరాశ పరిచాడు. స్కోరు 300 దాటాక వర్షం కారణంగా మ్యాచ్ కాసేపు ఆగింది. ఆట తిరిగి ప్రారంభమయ్యాక కోహ్లీ అనూహ్యంగా ఔటయ్యాడు. ఆమిర్ విసిరిన బౌన్సర్‌ను హుక్ చేయడానికి యత్నించిన కెప్టెన్ విఫలమయ్యాడు. కానీ బంతి ఎడ్జ్ తీసుకొని కీపర్ చేతిలో పడిందని భావించి.. అంపైర్ నిర్ణయం ప్రకటించక ముందే పెవిలియన్ బాటపట్టాడు. అయితే, రిప్లేలో బంతి బ్యాట్‌కు తాకలేదని తేలడంతో నిరాశపడటం అభిమానుల వంతైంది. చివర్లో శంకర్ (15 నాటౌట్), జాదవ్ (9 నాటౌట్) ఆశించినంత వేగంగా ఆడలేకపోయారు.

కుల్దీప్ ట్రబుల్.. పాండ్యా డబుల్

చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 9 బంతుల వ్యవధిలో 2 వికెట్లు పడగొట్టి పాక్ ముందరి కాళ్లకు బంధం వేస్తే.. వరుస బంతుల్లో 2 వికెట్లు పడగొట్టిన హార్దిక్ దాయాదిని వెనక్కి తిరిగి చూడకుండా చేశాడు. కుల్దీప్ వేసిన అంతుచిక్కని బంతికి బాబర్ ఆజమ్ క్లీన్ బౌల్డయ్యాడు. మిడిల్ స్టంప్‌పై పిచ్ అయిన బంతి గింగిరాలు తిరుగుతూ బ్యాట్‌కు, ప్యాడ్‌కు మధ్య నుంచి దూసుకెళ్లి వికెట్లను గిరాటేసింది. క్రీజులో కుదురుకున్న ఫఖర్ జమాన్‌ను కూడా బోల్తా కొట్టించిన కుల్దీప్ పాక్‌ను కష్టాల్లోకి నెట్టాడు. మరుసటి ఓవర్‌లో కుంగ్‌ఫూ పాండ్యా.. సీనియర్లు మొహమ్మద్ హఫీజ్ (9), షోయబ్ మాలిక్ (0)ను వరుస బంతుల్లో పెవిలియన్ బాట పట్టించాడు. హఫీజ్.. శంకర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగ్గా.. మాలిక్ బంతిని వికెట్ల మీదకు ఆడుకొని గోల్డెన్ డక్‌గా పెవిలియన్ చేరాడు.

30 బంతుల్లో 136..

విరాట్‌సేన మ్యాచ్‌పై పూర్తి పట్టు బిగించిన సమయంలో మరోమారు ఆటకు వర్షం ఆటంకం కలిగించింది. 35 ఓవర్లలో 166/6 ఉన్న దశలో వర్షం ముంచెత్తింది. కాసేపటికి వర్షం తగ్గినా.. స్కోరు బోర్డుపై కనిపించిన లక్ష్యం చూసి నివ్వెరపోవడం పాక్ వంతైంది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం లక్ష్యాన్ని 40 ఓవర్లలో 302గా నిర్దేశించారు. అంటే విజయానికి 5 ఓవర్లలో 136 పరుగులు చేయాలన్నమాట. ఇంకా చెప్పేదేముంది. పాక్ ముందే మానసికంగా మ్యాచ్ ఓడింది.

స్కోరు బోర్డు

భారత్: రాహుల్ (సి) బాబర్ (బి) వహాబ్ 57, రోహిత్ (సి) వహాబ్ (బి) హసన్ అలీ 140, కోహ్లీ (సి) సర్ఫరాజ్ (బి) ఆమిర్ 77, పాండ్యా (సి) బాబర్ (బి) ఆమిర్ 26, ధోనీ (సి) సర్ఫరాజ్ (బి) ఆమిర్ 1, శంకర్ (నాటౌట్) 15, జాదవ్ (నాటౌట్) 9, **ఎక్స్‌ట్రాలు:** 11, **మొత్తం:** 50 ఓవర్లలో 336/5. **వికెట్ల పతనం:** 1-136, 2-234, 3-285, 4-298, 5-314, **బౌలింగ్:** ఆమిర్ 10-1-47-3, హసన్ అలీ 9-0-84-1, వహాబ్ 10-0-71-1, ఇమాద్ 10-0-49-0, షాదాబ్ 9-0-61-0, మాలిక్ 1-0-11-0, హఫీజ్ 1-0-11-0.

పాకిస్థాన్: ఇమామ్ (ఎల్బీ) శంకర్ 7, ఫఖర్ (సి) చహల్ (బి) కుల్దీప్ 62, బాబర్ (బి) కుల్దీప్ 48, హఫీజ్ (సి) శంకర్ (బి) పాండ్యా 9, సర్ఫరాజ్ (బి) శంకర్ 12, మాలిక్ (బి) పాండ్యా 0, ఇమాద్ (నాటౌట్) 46, షాదాబ్ (నాటౌట్) 20, **ఎక్స్‌ట్రాలు:** 8, **మొత్తం:** 40 ఓవర్లలో 212/6. **వికెట్ల పతనం:** 1-13, 2-117, 3-126, 4-129, 5-129, 6-165, **బౌలింగ్:** భువనేశ్వర్ 2.4-0-8-0, బుమ్రా 8-0-52-0, శంకర్ 5.2-0-22-0, పాండ్యా 8-0-44-2, కుల్దీప్ 9-1-32-2, చహల్ 7-0-53-0.

హోండా కార్లు మరింత ప్రియం

1.2 శాతం వరకు ధరల్ని పెంచుతున్న సంస్థ

న్యూఢిల్లీ, జూన్ 16: హోండా కార్లు మరింత ప్రియంకాబోతున్నాయి. ముడి సరుకుల ధరలు పెరుగడం, మరోవైపు నూతన భద్రత ఫీచర్స్‌ను ప్రవేశపెట్టడంతో వచ్చే నెల నుంచి అన్ని రకాల కార్ల ధరలను 1.2 శాతం వరకు పెంచబోతున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం సంస్థ రూ.4.73 లక్షల మొదలుకొని రూ.43.21 లక్షల లోపు ధర కలిగిన మోడళ్లను న్యూఢిల్లీ షోరూంలో విక్రయిస్తున్నది. వచ్చే నెల నుంచి అన్ని కార్ల ధరల పెంచేదానిపై చర్చిస్తున్నట్లు హెచ్‌సీఐఎల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ గోయల్ తెలిపారు. గడిచిన కొన్ని నెలలుగా ముడి సరుకుల ధరలు భగ్గుమనడంతో సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని వినియోగదారులకు మళ్లించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ ఏడాది ధరలు పెంచడం ఇది రెండోసారి కానున్నది. ఫిబ్రవరి తొలివారంలో అన్ని రకాల కార్ల ధరలను రూ.10 వేలు పెంచుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. జనవరి నెలలోనే మారుతి సుజుకీ, టయోటా కిర్లోస్కర్, ఇసుజులు కూడా తమ వాహన ధరలను పెంచాయి.

బిగుస్తున్న ఉచ్చు

స్విస్ బ్యాంకుల్లో బయటకొస్తున్న భారతీయుల పేర్లు ■ ఖాతాల వివరాలు వెల్లడిస్తున్న అక్కడి సర్కారు

మరో 50 మంది చిట్టాను తయారు చేస్తున్న అధికారులు

బెర్న్/న్యూఢిల్లీ, జూన్ 16: స్విస్ బ్యాంకుల్లో అవినీతి సంపదను దాచుకున్న భారతీయుల చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నది. భారత్, స్విట్జర్లాండ్ ప్రభుత్వాల మధ్య కుదిరిన సమాచార మార్పిడి ఒప్పందం.. అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నదిప్పుడు. ఈ ఒప్పందం ప్రకారం స్విస్ బ్యాంకుల్లో ఖాతాలున్న 50 మంది భారతీయుల వివరాలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసే పనిలో అక్కడి అధికారులున్నారు మరి. ఈ 50 మంది ఖాతాల్లో ఉన్నది అక్రమ సొత్తుగా అనుమానాలుండటంతో ఈ వివరాలను భారత్‌కు ఇవ్వాలని స్విస్ సర్కారు నిర్ణయించింది. నిజానికి స్విస్ చట్టాలను అనుసరించి విదేశీ ఖాతాదారుల వివరాలను ఎవరికీ వెల్లడించకూడదు. అయితే సమాచార మార్పిడి ఒప్పందం ఉండటంతో ముందుగా ఖాతాల్లోని సొమ్ము ఎక్కడిదో చెప్పాలని, ఆ వివరాలను ఎందుకు బయట పెట్టకూడదో కూడా తెలుపాలని ఖాతాదారులకు స్విట్జర్లాండ్ ప్రభుత్వం నోటీసులను పంపింది. గడిచిన కొద్ది వారాలుగా ఇలా ఓ 50 మందికి తాఖీదులు వచ్చాయి. 30 రోజుల్లోగా (కొన్ని కేసుల్లో 10 రోజులే) సమాధానం ఇవ్వాలని కోరింది. వీరిలో కొందరి వివరణల్ని స్విస్ అధికారులు అప్పటికే కొట్టివేయడం గమనార్హం. ఇందుకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం, నమ్మదగిన కారణాలు చూపకపోవడమే. తప్పుడు రికార్డులను దాఖలు చేయడమే. దీంతో ఈ 50 మంది వివరాలు త్వరలోనే భారత్‌కు అందుతాయన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే గడిచిన ఏడాది కాలంలో 100 మందికిపైగా భారతీయ ఖాతాదారుల వివరాలను స్విస్ ప్రభుత్వం.. మోదీ సర్కారుతో పంచుకున్నది. ఈ నేపథ్యంలో మరో 50 మంది చిట్టా సిద్ధం అవుతున్నది.

వ్యాపారులే ఎక్కువ

స్విస్ బ్యాంకుల్లోని భారతీయ ఖాతాదారుల్లో వ్యాపారులే ఎక్కువని తెలుస్తున్నది. నిర్మాణ, ఆర్థిక సేవలు, సాంకేతిక, టెలికం, రంగులు, గృహాలంకరణ, బట్టలు, ఇంజినీరింగ్ గూడ్స్, రత్నాలు, ఆభరణాల రంగాలకు చెందినవారు అధికంగా ఉన్నట్లు సమాచారం. కోల్‌కతా, గుజరాత్, బెంగళూరు, ఢిల్లీ, ముంబై వర్తకులే చాలామంది ఉన్నట్లు చెబుతున్నారు. స్విస్ ప్రభుత్వం కొందరికి సంక్షిప్త రూపంలో, మరి కొందరికి పూర్తి పేర్లతో నోటీసులివ్వగా, ఇందులో పొట్లూరి రాజామోహన్ రావు అనే తెలుగు వ్యక్తి కూడా ఉన్నట్లు సమాచారం. హెచ్‌ఎస్‌బీసీ, పనామా జాబితాల్లోనివారు, ఆదాయం పన్ను (ఐటీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇతర ఏజెన్సీల దర్యాప్తులను ఎదుర్కొంటున్నవారు ఉన్నారు.

జోరుగా టీవీ అమ్మకాలు

మార్కెట్‌లో వరల్డ్ కప్ ఫీవర్ ■ భారీ తెరలకు భలే గిరాకీ

న్యూఢిల్లీ, జూన్ 16: టెలివిజన్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఐసీసీ క్రికెట్ ప్రపంచ కప్ ఫీవర్.. టీవీ సేల్స్‌ను అమాంతం పెంచేశాయి. సోనీ, సామ్‌సంగ్, ఎల్‌జీ, పానసోనిక్ టీవీల విక్రయాలు నిరుడుతో పోల్చితే 100 శాతం పెరిగాయని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. 55 అంగుళాలు, అంతకుమించి పరిమాణంలో ఉన్న పెద్ద టీవీలకు కొనుగోలుదారుల నుంచి మంచి స్పందన ఉందని చెబుతున్నాయి. క్రికెట్ మ్యాచ్‌లను హై-ఎండ్ టీవీల్లో చూడాలన్న అభిమానులు ఎక్కువగా ఉండటంతో భారీ తెరలకు భలే డిమాండ్ కనిపిస్తున్నదని అంటున్నాయి. ఇక ఈ అమ్మకాలు కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాలేదు. హూబ్లీ, జబల్‌పూర్, రాయ్‌పూర్, రాంచీ, కొచ్చి, నాగ్‌పూర్ వంటి చిన్న నగరాల్లోనూ కనిపిస్తున్నాయి. లీగ్ మ్యాచ్‌లు ముగిసి, నాకౌట్ దశకు టోర్నీ చేరితే అమ్మకాలు మరింత పెరుగుతాయని, భారత్ విజయ పరంపర కొనసాగితే రికార్డు స్థాయి సేల్స్ ఖాయమని సామ్‌సంగ్ ఇండియా కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ వ్యాపారం సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ భూటానీ అంచనా వేస్తున్నారు. దేశీయ టీవీ మార్కెట్‌లో ఏటా సుమారు 12.5 మిలియన్ల సెట్లు అమ్ముడవుతాయని అంచనా. ఇందులో దాదాపు 15 శాతం వాటా పెద్ద టీవీలదే కావడం విశేషం.

ఆఫర్లే.. ఆఫర్లు

అమ్మకాలను మరింత పెంచుకోవడానికి, కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి వ్యాపారులు పెద్ద ఎత్తున ఆఫర్లను ప్రకటిస్తున్నారు. సులభ వాయిదాలు, క్యాష్‌బ్యాక్‌లు, ఉచిత బహుమతులు, ధరల తగ్గింపు, వారెంటీ కాలం పొడిగింపు, డీటీహెచ్ రీచార్జ్‌లు తదితర ఆఫర్లను అందిస్తున్నారు. 'ప్రపంచ కప్ మొదలై 18 రోజులు కావస్తున్నది. 55 అంగుళాలు, అంతకంటే ఎక్కువైన 4కే టీవీల అమ్మకాలు సుమారు 100 శాతం పెరిగాయి' అని సోనీ ఇండియా బ్రావియా వ్యాపార అధిపతి సచిన్ రాయ్ పీటీఐతో అన్నారు. గత వేసవి కాలంతో పోల్చితే క్యూఎల్‌ఈడీ టీవీల అమ్మకాలు రెట్టింపయ్యాయని, 55 అంగుళాలు, 75 అంగుళాలు ఆపై శ్రేణి టెలివిజన్లకు డిమాండ్ పెరిగిందని భూటానీ చెప్పారు. క్రికెట్ అభిమానులు ఈ వరల్డ్ కప్‌ను భారీ స్క్రీన్లపై ఎంజాయ్ చేయాలనుకుంటున్నారని చెప్పారు. పెద్ద టీవీల ధరలు రూ.55,000ల నుంచి రూ.1.75 లక్షల వరకు ఉన్నది. ఇక సామ్‌సంగ్ ఇటీవల మార్కెట్‌కు పరిచయం చేసిన 8కే యూహెచ్‌డీ టీవీ ధరల శ్రేణి రూ.10.99 లక్షల నుంచి రూ.59.99 లక్షల మధ్య ఉండటం గమనార్హం. ఎల్‌జీ సైతం తమ ఓఎల్‌ఈడీ, నానో సెల్ టీవీల అమ్మకాల్లో 200 శాతం వృద్ధిని చూస్తామన్న ఆశాభావాన్ని కనబరుస్తున్నది. గత నెల 30న మొదలైన ఈ క్రికెట్ పండుగ.. మరో నెల రోజులపాటు కొనసాగనుండగా, వచ్చే నెల 14తో ముగియనున్నది.

భెల్‌కు 200 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు ఆర్డర్లు

ఎన్టీపీసీ రామగుండం ప్లాంట్ నుంచి కూడా..

న్యూఢిల్లీ, జూన్ 16: విద్యుత్ పరికరాల ఉత్పత్తిలో అగ్రగామి సంస్థయైన భెల్..రూ.800 కోట్ల విలువైన 200 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుల రెండు ఆర్డర్లు లభించాయి. ఈ రెండు ఆర్డర్లతో సంస్థకు వచ్చిన మొత్తం ఆర్డర్లు 1,000 మెగావాట్లకు చేరుకున్నాయి. ఈ రెండు ఆర్డర్లు ప్రభుత్వరంగ సంస్థయైన ఎన్టీపీసీ లిమిటెడ్, గుజరాత్ స్టేట్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌ల నుంచి లభించినట్లు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రంలోని రామగుండం వద్ద ఎన్టీపీసీ ఏర్పాటు చేయతలపెట్టిన 100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ ప్లాంట్‌కు భెల్ పరికరాలు సరఫరా చేయాల్సి ఉంటుంది. వీటితోపాటు గుజరాత్‌లోని రాఘనెస్డా అల్ట్రా మెగా సోలార్ పార్క్‌లో జీఎస్‌ఈసీఎల్ ఏర్పాటు చేయనున్న 100 మెగావాట్ల ప్లాంట్ కూడా ఉన్నదని పేర్కొంది. ఈ రెండు ఆర్డర్లను ఈపీసీ(ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్స్‌ట్రక్షన్) పద్ధతిన నిర్మించాల్సి ఉంటుందని తెలిపింది. దీంతో సంస్థ పూర్తిస్థాయి ఆర్డర్ల విలువ 1 గిగావాట్లకు చేరుకున్నట్లు అయింది. వీటిలో 500 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయని, మిగతావి నిర్మాణ దశలో ఉన్నట్లు తెలిపింది.

అరబిందో ఫార్మా రూ.1,400 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జూన్ 16: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధాల తయారీ సంస్థ అరబిందో ఫార్మా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీ పెట్టుబడులకు సిద్ధమైంది. ఈ ఏడాది వ్యాపార విస్తరణకు, పరిశోధన అండ్ అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ) రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి 200 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. మన కరెన్సీలో ఇది రూ.1,400 కోట్లకు పైమాటే. బయోసిమిలర్ మందులను, ఏపీఐ కెపాసిటీని పెంచడానికి ఈ నిధులను వినియోగించనున్నట్లు అరబిందో ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ గోవిందరాజన్ ఇటీవల జరిగిన వాటాదారుల సమావేశంలో చెప్పారు. భవిష్యత్తులో యాక్టివ్ ఫార్మాస్యూటికల్స్ ఇంగ్రియెంట్స్(ఏపీఐ)కి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ యూనిట్ కెపాసిటీని మరింత పెంచనున్నట్లు ఆయన ప్రకటించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 225 మిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టిన సంస్థ..వీటిలో రూ.872 కోట్లు లేదా కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో 4.5 శాతం ఆర్‌అండ్‌డీ కోసం ఖర్చుచేసింది. వచ్చే ఏడాది సంస్థకు చాలా కీలకమని, తొలి విడుతలో రెండు లేదా మూడు బయోసిమిలర్ ఔషధాలను విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. అమెరికా ఔషధాలను విక్రయించడానికి మూడు ఉత్పత్తి కేంద్రాలను కొనుగోలు చేసింది. వీటిలో స్యాండోజ్ ఇండస్ట్రీస్, స్వామి ఐయర్, సీఎఫ్‌వో అరబిందో ఫార్మా, యూఎస్‌ఏలకు అక్కడి ఫెడరల్ ట్రేడ్ కమిషన్ అనుమతినివ్వడంతో వచ్చే 12 వారాల్లో వీటి ఒప్పందం పూర్తికానున్నట్లు తెలిపింది. వీటిలో స్యాండోజ్ కొనుగోలుకు సంబంధించి ఎఫ్‌టీసీ అనుమతిని వ్వాల్సి ఉన్నదని, వచ్చే 8 నుంచి 12 వారాల్లో ఇది కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో అమెరికా సంస్థల కొనుగోలుకు సంబంధించి ఒప్పందం జరిగింది.

ఆఫీస్ రొమాన్స్‌తో అనర్థాలే

పనిపై తగ్గుతున్న శ్రద్ధ

వ్యక్తిగత జీవితాలపైనా దుష్ప్రభావం



న్యూఢిల్లీ, జూన్ 16: కార్పొరేట్ లీడర్లది క్షణం తీరిక లేని జీవనం. వ్యక్తిగత జీవితం కంటే కార్యాలయ జీవితం, విధులే ఎక్కువ. దీంతో కుటుంబ సభ్యులతో గడిపేది వారు తక్కువే. ఇదే సమయంలో సహచర ఉద్యోగులతోనే ఎక్కువగా ఉంటూంటారు. అయితే ఈ కారణం.. ఆఫీసుల్లో ప్రేమలు, ఇతరత్రా సంబంధాలకు దారి తీస్తున్నదని, ఇవి అనవసరపు వివాదాలకు తెర తీస్తున్నాయని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అటు వ్యక్తిగత జీవితాలను, ఇటు సంస్థల్లో పనిని ఆఫీస్ రొమాన్స్ ప్రభావితం చేస్తున్నదని చెబుతున్నారు. స్టెల్లర్ సెర్చ్ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ శైలజ దత్ స్పందిస్తూ 'ప్రస్తుత కార్పొరేట్ జీవనంలో ఉద్యోగులు ఎక్కువ సమయం కార్యాలయాల్లోనే గడుపాల్సి వస్తున్నది. పెరిగే పరిచయాలు ఆడ, మగ మధ్య ప్రేమకు దారి తీస్తున్నాయి. వీటిలో పెండ్లిదాకా కొన్ని వెళ్తుండగా, మరికొన్ని మధ్యలోనే ముగిసిపోతున్నాయి. నిజానికి ఒకే ఆఫీసులో, ఒకే విభాగంలో పనిచేసే వారి మధ్య ఇలాంటివి బహుళ ప్రయోజనాల సంఘర్షణకు కారణం అవుతున్నాయి. వారి మధ్య ప్రేమ కావచ్చు. విభేదాలు కావచ్చు పనిపై శ్రద్ధను తగ్గిస్తున్నాయి. అందుకే చాలా సంస్థలు తమ హెచ్‌ఆర్ పాలసీలో ఆఫీసు ప్రేమ వ్యవహారాలకు తావు లేకుండా చేస్తున్నాయి' అన్నారు. ఇటీవలి కాలంలో ఉద్యోగుల మధ్య ప్రేమ వ్యవహారాలు సర్వసాధారణమైపోయాయని అంటున్న నిపుణులు.. ప్రేమ తప్పుకాదని, అది వ్యామోహమైతేనే చెడు ఫలితాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని నేటి యువతకు హెచ్చరిస్తున్నారు.

కెరియర్‌కు ఇబ్బందే

ఆకస్మిక, అవాంఛిత ప్రేమ కార్యకలాపాలతో కెరియర్‌కు ముప్పేనని డెల్, జెన్‌పాక్ట్, జీఈ వంటి సంస్థల్లో సీనియర్లతో పనిచేసిన రచయిత అర్వింద్ పరశర్ అన్నారు. కార్పొరేట్ ఉద్యోగులు తమ జీవిత భాగస్వాములతో, కుటుంబ సభ్యులతో వీలైనంత ఎక్కువగా గడుపడం అన్నివిధాలా ఉత్తమమన్న అభిప్రాయాలనూ మెజారిటీ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. తమ వారికి దూరంగా ఉంటున్న పెండ్లైనవారు ఇతరులపట్ల ఆకర్షితులై అక్రమ సంబంధాలు పెట్టుకుంటున్నారని, దీనివల్ల ఆ ఇరువురి వ్యక్తిగత జీవితాలతోపాటు, సంస్థ ప్రయోజనాలూ దెబ్బ తింటున్నాయని చెబుతున్నారు.

హద్దుల్లో ఉండాలి

ఆడైనా, మగైనా హద్దుల్లో ఉండాలని, జీవిత భాగస్వాములతోనే కలిసి ఉంటామన్న ఆకాంక్షను బలంగా వ్యక్తం చేస్తూ ముందుకెళ్తే ఇంటా, బయటా మనదే విజయమని నిపుణులు సూచిస్తున్నారు. పనిలో పడి కుటుంబాన్ని విస్మరిస్తే వైవాహిక జీవితంలో ఇబ్బందులు తలెత్తుతాయంటున్న విశ్లేషకులు.. దానివల్ల ఆఫీస్ పని కూడా చెడిపోయే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. అందుకే సమయం దొరికినప్పుడు.. లేదంటే వీలు చేసుకునైనా కుటుంబంతో కొద్దిరోజులు గడుపడం మంచిదని హితవు చెబుతున్నారు. మొత్తంగా హద్దుల్లో ఉంటేనే అందరికీ మంచిదని సలహా ఇస్తున్నారు.

విమాన టిక్కెట్టు రూ.955కే

ఎయిర్‌ఏషియా ఐదో వార్షికోత్సవ ఆఫర్

హైదరాబాద్, జూన్ 16: చౌక విమానయాన సంస్థ ఎయిర్‌ఏషియా..ఐదో వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్ కింద దేశీయ ప్రారంభ విమాన టిక్కెట్టు ధరను రూ.955గా నిర్ణయించింది. సోమవారం నుంచి బుధవారం వరకు అమలులో ఉండనున్న ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు నవంబర్ 1 నుంచి సెప్టెంబర్ 8, 2020 వరకు ఎప్పుడైనా ప్రయాణం చేయవచ్చని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఆఫర్ బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కొచి, గోవా, పుణె, విశాఖపట్నంల నుంచి ప్రయాణించే విమాన సర్వీసులకు వర్తించనున్నది. వీటితోపాటు అంతర్జాతీయ రూట్లలో ప్రారంభ విమాన టిక్కెట్టు ధరను రూ.999గా నిర్ణయించింది. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా 21 రూట్లకు విమాన సర్వీసులు అందిస్తున్నది.

ఎగుమతులకు జోష్

అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం భారత్‌కు కలిసొచ్చే అవకాశాలు

న్యూఢిల్లీ, జూన్ 16: ప్రస్తుత అమెరికా-చైనా వాణిజ్య యుద్ధాన్ని.. భారత్‌కు ఎగుమతులను పెంచుకోవడానికి సువర్ణావకాశంగా అభివర్ణించింది ఓ కేంద్ర ప్రభుత్వ అధ్యయనం. కెమికల్స్, గ్రానైట్ తదితర 350 ఉత్పత్తులను అమెరికా, చైనాలకు ఎగుమతి చేసే వీలును అవసరమైతే భారత్ అందిపుచ్చుకోవచ్చని వాణిజ్య మంత్రిత్వ శాఖ నివేదిక ఒకటి అంచనా వేసింది. భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్‌ఐఈవో) అధ్యక్షుడు గణేశ్ కుమార్ గుప్తా సైతం దీన్ని ధ్రువీకరిస్తున్నారు. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం భారత్‌కు లాభదాయకమేనంటున్నారు. అమెరికా, చైనాలు పరస్పర సుంకాలతో కొట్టుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా నుంచి చైనాకు ఎగుమతి అవుతున్న డీజిల్, ఎక్స్-రే ట్యూబులు, కొన్ని రకాల రసాయనాలు తదితర 151 ఉత్పత్తులను చైనాకు భారత్ ఎగుమతి చేయవచ్చని, అలాగే చైనా నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న రబ్బర్, గ్రాఫైట్ ఎలక్ట్రోడ్స్ వంటి 203 ఉత్పత్తులను భారత్.. అమెరికాకు పంపుకోవచ్చని ఈ అధ్యయనం తెలిపింది. దీనివల్ల చైనాతో వాణిజ్య లోటును పూడ్చుకోవచ్చని చెబుతున్నది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) ఏప్రిల్-ఫిబ్రవరి వ్యవధిలో చైనాతో వాణిజ్య లోటు 50.12 బిలియన్ డాలర్లుగా నమోదైంది. గతేడాది అమెరికాకు భారత్ ఎగుమతులు 11.2 శాతం, చైనాకు 31.4 శాతం పెరిగాయని గుప్తా చెప్పారు. అయితే 28 రకాల అమెరికా ఉత్పత్తులపై భారత్ పెంచిన సుంకాలు ఈ ఎగుమతుల అవకాశాల్ని దెబ్బతీసే వీలు లేకపోలేదన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి. చైనాతో సంగతి ఎలా ఉన్నా.. ట్రంప్ మెప్పు పొందేలా నడుచుకుంటేనే ఆ దేశానికి భారతీయ ఎగుమతులు పెరుగుతాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ క్రమంలో తాజా సుంకాలు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి.

ప్రభుత్వ బ్యాంకులకు రూ.30,000 కోట్లు

ఈసారి బడ్జెట్‌లో దక్కవచ్చన్న అంచనాలు

న్యూఢిల్లీ, జూన్ 16: ప్రభుత్వ రంగ (పీఎస్‌యూ) బ్యాంకుల మూలధన అవసరాలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మూల్యాంకనం చేస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను వచ్చే నెల 5న లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్న క్రమంలోనే ఈ మదింపు జరుగుతున్నది. బ్యాంకులకు ఈసారి రూ.30,000 కోట్ల మేర సాయం అందవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ (పీసీఏ)లో ఉన్న ఐదు బ్యాంకులకూ మూలధన అవసరాలుండటంతో మరిన్ని ఎక్కువ నిధులను ప్రభుత్వ బ్యాంకింగ్ రంగం ఆశిస్తున్నది. బాసెల్-3 నిబంధనల ప్రకారం దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకులు ఆర్థికంగా మరింత బలపడాల్సి ఉన్నది. కానీ మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) కారణంగా వాటిల్లుతున్న వరుస నష్టాలు ఇంకా బలహీనం చేస్తున్నాయి. దీంతో ప్రభుత్వ సాయం అనివార్యమవుతున్నది. ఇదిలావుంటే బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) తరహాలో మరో మూడు బ్యాంకులను గనుక విలీనం చేస్తే.. అదనపు సాయం అవసరమవుతుందని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. బీవోబీలో దేనా, విజయా బ్యాంకులు విలీనమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రూ.5,042 కోట్ల మూలధన సాయాన్ని బీవోబీకి కేంద్రం చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) మొత్తంగా ప్రభుత్వ బ్యాంకుల్లోకి రూ.1,06,000 కోట్ల నిధులను మోదీ సర్కారు చొప్పించింది.

ఒడిదుడుకుల్లో స్టాక్ మార్కెట్లు!

ఫెడరల్ రిజర్వు, ఇంధనం, రూపాయి కదలికలు కీలకం

న్యూఢిల్లీ, జూన్ 16: ఈవారంలో స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పలు దేశాల్లో భౌగోలిక రాజకీయ పరిణామాలు, అమెరికా-చైనాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు, వడ్డీరేట్లపై అమెరికా బ్యాంకింగ్ నియంత్రణ మండలి ఫెడరల్ రిజర్వు తీసుకోనున్న నిర్ణయం మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమెరికాకు చెందిన 28 ఉత్పత్తులపై భారత ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని భారీగా పెంచుతూ తీసుకున్న నిర్ణయం కూడా మార్కెట్లను ప్రభావితం చేసే అంశాల్లో ఇది కూడా ఒకటని పేర్కొన్నారు. ఈ పన్ను పెంపు ఆదివారం నుంచి అమలులోకి వచ్చింది. మార్కెట్లను ప్రభావితం చేసే అంశాలు దేశవ్యాప్తంగా ఒక్కటి లేకపోవడంతో అంతర్జాతీయంగా తీసుకోనున్న నిర్ణయాలు ఆధారంగా ట్రేడింగ్ ఆధారపడివున్నదని జియోజిట్ ఫైనాన్షియల్ అధినేత అజయ్ సింగ్ పేర్కొన్నారు. ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులకు తోడు మందకొడి ఆర్థిక పరిస్థితులు కూడా తోడవడంతో మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయన్నారు. చమురు ట్యాంక్‌పై దాడి నేపథ్యంలో ఇరాన్-అమెరికా దేశాల మధ్య మాటలయుద్ధం మరింత ముదురుతుండటం, ఈ నెల 19న ఫెడరల్ రిజర్వు తన తదుపరి సమీక్షను ప్రకటించనుండటం, వాతావరణ పరిస్థితులపై పెట్టుబడిదారులు ప్రత్యేక దృష్టి సారించనుండటంతో ఈ వారంలో సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశాలున్నాయని మార్కెట్ పండితులు పేర్కొంటున్నారు. క్రూడాయిల్ ధరలు మరింత ప్రియమవడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలు, దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ పెట్టుబడుల ట్రెండ్ కూడా మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. రుణాల తిరిగి చెల్లింపుల్లో ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన నూతన మార్గదర్శకాలు పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను ప్రభావితం చేయనున్నదని, బడ్జెట్ కంటే ముందు మార్కెట్లు కరెక్షన్ తప్పదని క్యాపిటల్ ఎయిమ్ హెడ్ రోమేష్ తెలిపారు. గడిచిన వారంలో సెన్సెక్స్ 164 నష్టపోయి 39,452 పాయింట్ల వద్ద ముగిసింది.

పదింటిలో ఆరు లాభాల్లోకి..

గడిచిన వారంలో పది బ్లూచిప్ కంపెనీల్లో ఆరు మార్కెట్ విలువ మరింత పెరిగింది. టెక్నాలజీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) అత్యధికంగా లాభంతో మొత్తం మార్కెట్ విలువ రూ.34,250.18 కోట్లు ఎగబాకింది. వీటితోపాటు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్‌లు కూడా తమ మార్కెట్ వాటాను పెంచుకున్నాయి. కానీ, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌యూఎల్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లు నష్టాలతో ముగిశాయి. టీసీఎస్ మార్కెట్ క్యాపిటల్ రూ.27,523.74 కోట్లు పెరుగగా, ఐటీసీ రూ.2,513.02 కోట్లు, ఎస్‌బీఐ రూ.1,963.42 కోట్లు, ఆర్‌ఐఎల్ రూ.1,045.95 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.745.32 కోట్లు, ఇన్ఫోసిస్ రూ.458.73 కోట్లు చొప్పున పెరిగాయి.

గృహ రుణాల్లో వృద్ధి అంతంతే!

ముంబై, జూన్ 16: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గృహ రుణాల్లో వృద్ధి 13 శాతం నుంచి 15 శాతం వరకు మించదని ఒక నివేదిక వెల్లడించింది. గడిచిన మూడేండ్లుగా నమోదైన సరాసరిగా వృద్ధితో పోలిస్తే ఇదే తక్కువదని పేర్కొంది. తాత్కాలికంగా నగదు లభించకపోవడంతో నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల విభాగ సంస్థలు ఎదుర్కొంటున్న సమస్య ఇందుకు అవరోధం కానున్నదని తెలిపింది. మార్చి 2019 నాటికి దేశవ్యాప్తంగా రూ.19.1 లక్షల కోట్ల స్థాయిలో గృహ రుణాలు తీసుకున్నారని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా వెల్లడించింది. గృహ రంగంలో నెలకొన్న మందకొడి పరిస్థితుల్లో దేశ ఆర్థిక వృద్ధి ఐదేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన విషయాన్ని ఈ సందర్భంగా నివేదిక గుర్తుచేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఈ రంగ వృద్ధి 15 శాతానికి పరిమితమైంది. గతేడాది సెప్టెంబర్ నుంచి నాన్-బ్యాంకింగ్ రంగ సంస్థలు నిధులు లభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, డీహెచ్‌ఎఫ్‌ఎల్, రిలయన్స్ క్యాపిటల్ సంస్థలు పలు సమస్యలతో సతమతమవుతుండటం కూడా వీటికి ఆజ్యం పోయనున్నట్లు పేర్కొంది.

ఎఫ్‌పీఐల పెట్టుబడుల వరద

జూన్‌లో ఇప్పటి వరకు రూ

వరల్డ్‌కప్ క్రికెట్‌లో ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ గెలిచినందుకు సంతోషంగా ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీకి స్వీట్ తినిపిస్తున్న కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

క్రికెట్ మేనియా

వరల్డ్‌కప్‌లో భాగంగా ఆదివారం భారత్-పాక్ మధ్య క్రికెట్ మ్యాచ్‌ను దుకాణంలో కూర్చుని తన సెల్‌ఫోన్‌లో వీక్షిస్తున్న పండ్ల వ్యాపారి

ఏపీకి ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీకి ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలుగు రాష్ట్రాల విషయంలో విభజన హామీల అమలుకు తనవంతు కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం జగన్ కలిసి విభజన సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్ లేదని ఆ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు నిజమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల్లో ఉన్న భావననే రాజగోపాల్‌రెడ్డి చెప్పారని అన్నారు. బీజేపీలోకి వలసలు కొనసాగుతాయని చెప్పారు.

పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలోని లక్ష్మీ నర్సింహ గార్డెన్‌లో 'జయహో.. నాన్న' పేరిట నాన్నకు పాదాభివందనాలు, సన్మాన మహోత్సవాన్ని నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో వందమందికి వారి పిల్లలు ఒకేసారి పాదాభివందనం చేసి, సన్మానించినందుకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటులభించింది. ఈ మేరకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ స్ఫరియా కో ఆర్డినేటర్ రంగ జ్యోతి ఎమ్మెల్యే చందర్‌కు ధ్రువపత్రంతోపాటు మెడల్‌ను అందజేశారు. - జ్యోతినగర్

ఆదివారం వడ్డెర సంఘం జాతీయ మహాసభలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, బీసీ కమిషన్ సీనియర్ సభ్యుడు వకుళాభరణం తదితరులు

వడ్డెర్లు.. గొప్ప ఇంజినీర్లు

ప్రజాప్రతినిధులు మరింత పురోగతిదిశగా పయనించాలి

వడ్డెర సంఘం జాతీయ మహాసభలో ఎమ్మెల్యే రాజయ్య

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వడ్డెర్లు.. నైపుణ్యమున్న గొప్ప ఇంజినీర్లు అని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. వడ్డెర కులంలోని ప్రజాప్రతినిధులు మరింత పురోగతిదిశగా పయనించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ రవీంద్రభారతి ప్రధాన వేదికపై ఆదివారం మధ్యాహ్నం వడ్డెర సంఘం జాతీయ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా వడ్డెర కులంలోని సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, మున్సిపల్ చైర్మన్, కార్పొరేటర్ల వరకు ప్రజాప్రతినిధులను సన్మానించారు. వడ్డెర సంఘం మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ.. చదువుతో అజ్ఞానాన్ని పారదోలిన వాళ్లమవుతామని చెప్పారు. ఒకప్పుడు తాను పశువుల కాపరిగా ఉన్నానని, తదుపరి డాక్టర్‌ను అయ్యానని, అనంతరం తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రిగా కూడా పనిచేశానని.. ఇదంతా చదువుకోవడంవల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. పనిచేసే ప్రభుత్వానికి అందరం చేయూతనివ్వాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీలమంతా నిరాదరణకు గురయ్యామని బీసీ కమిషన్ సీనియర్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు చెప్పారు. చట్టసభల్లో అవకాశం వస్తే సత్తా చాటుతామని, ఉద్యమ నాయకుడు, సీఎం కేసీఆర్‌కు తమ హక్కుల గురించి విన్నవించుకుంటున్నామని తెలిపారు. తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. ఓయూలోని ఆర్ట్స్ కాలేజీని తీర్చిదిద్దిన ఘనత 'వడ్డెర జాతి'దని, బండలను చీల్చి, కంకరగా మల్చి రోడ్లు, భవనాలను నిర్మించిన గొప్ప చరిత్ర వడ్డెర సోదరులదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. వడ్డెర ఫెడరేషన్‌ను కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, వడ్డెరలను ఎస్టీలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. వడ్డెర్లకు రాజకీయ అవకాశాలు, నామినేటెడ్ పదవులతోపాటు విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేశ్ కోరారు. వడ్డెర్లకు ప్రమాద బీమా రూ.10 లక్షలు కల్పించాలని, వడ్డెర పిల్లలకు ఉచిత విద్యను అందించాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ అనితా నాగరాజు, తార్నాక కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి, నాగరాజు, వల్లెపు మొగిలి, తెలుగు రాష్ట్రాల వడ్డెరలు, ఇతర రాష్ట్రాల ప్రతినిధులు కుంచాల ఏడుకొండలు, గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, బత్తుల లక్ష్మీకాంతయ్య, చెంబేటి విజయలక్ష్మి, వేముల భవాని, బండారు శ్రీరాములు, ఈశ్వర్, పీట్ల శ్రీధర్, కతాల్, ఎత్తరి మారయ్య, శివకుమార్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల దారుణ హత్య

డబ్బుకోసం స్నేహితుడితో కలిసి కారు డ్రైవర్ ఘాతుకం

బంగారు నగలు, 30 వేల నగదుతో పరార్

కర్ణాటక సరిహద్దులో ఘటన.. డ్రైవర్ అరెస్టు

నాలుగురోజుల్లో కేసును ఛేదించిన వికారాబాద్, కర్ణాటక పోలీసులు

స్నేహలతరెడ్డి

నవరత్నారెడ్డి

నిందితుడు సతీశ్

వికారాబాద్ రూరల్: డబ్బుల కోసం కారు డ్రైవర్ దారుణానికి ఒడిగట్టాడు. ఉద్యోగమిచ్చిన వృద్ధ దంపతులనే దారుణంగా హతమార్చాడు. స్నేహితుడితో కలిసి రన్నింగ్‌లో కారులోనే మెడకు తువ్వాల బిగించి చంపేశాడు. వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి అడవుల్లో నాలుగు రోజుల క్రితం జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసును వికారాబాద్, కర్ణాటక పోలీసులు సమన్వయంతో ఛేదించారు. ఆదివారం నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం నందిగామకు చెందిన స్నేహలతారెడ్డి (75), నవరత్నారెడ్డి (77) హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌లో నివాసం ఉంటున్నారు. నవరత్నారెడ్డి హైదరాబాద్-కర్ణాటకలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. వీరివద్ద నెల రోజుల క్రితం తాత్కాలికంగా కారు డ్రైవర్‌గా హుస్నాబాద్ మండలానికి చెందిన సతీశ్ చేరాడు. ఈ నెల 12న దంపతులిద్దరూ హైదరాబాద్ నుంచి కర్ణాటక సరిహద్దులో ఆ రాష్ట్రానికి చెందిన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వెంచర్ చూసేందుకు తమ సొంతకారులో డ్రైవర్ సతీశ్‌తో బయలుదేరారు. నాటినుంచి దంపతులిద్దరూ కనిపించకుండా పోయారు. దీనిపై వారి బంధువులు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేరోజు నుంచి కారు డ్రైవర్ సతీశ్ కూడా కనిపించకపోవడంతో బంధువులకు అనుమానం వచ్చింది. స్థానిక పోలీసుల సహకారంతో కర్ణాటక పోలీసులు సతీశ్‌ను అదుపులోకి తీసుకొని విచారణ జరుపగా అతడు ఘటన వివరాలు వెల్లడించాడు. తనకున్న రూ.30 వేల అప్పును తీర్చేందుకు స్నేహితుడు రాహుల్‌తో కలిసి వృద్ధ దంపతుల హత్యకు పథకం వేశాడు. 12న వెంచర్‌చూసిన అనంతరం హైదరాబాద్‌కు తిరిగి వచ్చే క్రమంలో సతీశ్ హుస్నాబాద్ వద్ద రాహుల్‌ను కారులోకి ఎక్కించుకున్నాడు. స్నేహలతారెడ్డి గాఢనిద్రలో ఉండగా తొలుత నవరత్నారెడ్డి మెడకు తువ్వాల బిగించి హత్యచేశాడు. అనంతరం స్నేహలతారెడ్డిని కూడా అలాగే చంపేశాడు. కారు రన్నింగ్‌లో ఉండగానే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. మృతదేహాలు గుర్తుపట్టకుండా ఉండేందుకు అనంతగిరి అడవిలో కిరోసిన్, పెట్రోల్‌పోసి నిప్పంటించాడు. ఐదు తులాల బంగారు నగలతో పాటు, రూ.30 వేల నగదుతో పరారయ్యాడు. ఆదివారం మృతదేహాలను పరిశీలించగా నాలుగురోజుల క్రితమే హత్యకు గురైనట్టు పోలీసుల విచారణలో తేలింది. దంపతుల మృతదేహాలను, నిందితుడిని కర్ణాటక పోలీసులకు అప్పగించినట్టు వికారాబాద్ రూరల్ సీఐ వీ దాసు తెలిపారు.

మానవత్వాన్ని చాటిన జర్నలిస్ట్ జంట

చెత్తకుప్ప వద్ద పడేసిన ఆడశిశువును దత్తత తీసుకోవాలని నిర్ణయం

జైపూర్, జూన్ 16: ఓ జర్నలిస్ట్ జంట మానవత్వాన్ని చాటుకున్నది. చెత్తకుప్ప వద్ద పడేసిన ఆడ శిశువును దత్తత తీసుకోవాలని నిర్ణయించింది. దీనికోసం చాలా దూరం ప్రయాణించి సంబంధిత అధికారులను సంప్రదించింది. అంతేగాక ఆ శిశువుకు పేరుపెట్టడమేగాక ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నది. రాజస్థాన్‌లోని నాగౌర్‌లో అప్పుడే పుట్టిన ఆడ శిశువును చెత్తకుప్ప వద్ద వదిలేశారు. ఈ విషయం తెలిసిన స్థానిక అధికారులు, ఆ బిడ్డను జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. చెత్తకుప్ప వద్ద అనాథగా పడి ఉన్న ఆడ శిశువును సామాజిక మాధ్యమాల్లో చూసిన నోయిడాకు చెందిన పాత్రికేయుడు, సినీ నిర్మాత వినోద్ కాప్రి, ఆయన భార్య, టీవీ యాంకర్ సాక్షి జోషి చలించిపోయారు. ఆ శిశువును దత్తత తీసుకోవాలని నిర్ణయించుకున్నవారు విషయాన్ని సోషల్ మీడియాలో వెల్లడించడంతోపాటు ఆ శిశువుకు పీహూ అని పేరు పెట్టారు. వారిద్దరు నోయిడా నుంచి రాజస్థాన్‌లోని నాగౌర్‌కు వచ్చి ఆదివారం ఉదయం ఆ చిన్నారి చికిత్స పొందుతున్న ప్రభుత్వ దవాఖానను సందర్శించారు. పాప ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను ఆరా తీశారు. అనంతరం నాగౌర్ జిల్లా కలెక్టర్‌ను కలిసి దత్తత వివరాలు తెలుసుకున్నారు. కాగా వినోద్ కాప్రి ఆ చిన్నారి ఆసుపత్రిలోని ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. పాప కోలుకుంటున్నదని సంతోషం వ్యక్తం చేశారు. అంతేగాక చికిత్స అందిస్తున్న వైద్యులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆ చిన్నారిని దత్తత తీసుకునేందుకు చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్టు వెల్లడించారు

ఆదివారం హజ్ హౌస్‌లో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న హజ్ కమిటీ చైర్మన్ మసిఉల్లాఖాన్

హజ్ యాత్రికులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

హజ్ కమిటీ చైర్మన్ మసిఉల్లాఖాన్ సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హజ్ యాత్రకు ఎంపికైనవారు యాత్ర సమయంలో తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని హజ్ కమిటీ చైర్మన్ మసిఉల్లాఖాన్ సూచించారు. చాదర్‌ఘాట్‌లో ఆదివారం హజ్ యాత్రికులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి చెందాలని మక్కాలో ప్రార్థించాలని విజ్ఞప్తి చేశారు. హజ్ యాత్రలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యులు, ముస్లిం మతగురువులు పాల్గొన్నారు.

పదోన్నతుల ఘనత సీఎం కేసీఆర్‌దే

టీఎస్ ఎంపీడీవోల సంఘం అడ్‌హాక్ అధ్యక్షుడిగా సత్తయ్య

ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం

ఎం సత్తయ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఎంపీడీవోల పరిస్థితులను గుర్తించి, పదోన్నతులు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, 22 ఏండ్లుగా ఎదురుచూసిన పదోన్నతులు ఆయన హయాంలోనే వచ్చాయని తెలంగాణ రాష్ట్ర మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం (టీఎస్ఎంపీడీవోఏ) రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేంద్రరావు చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అడ్‌హాక్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం సత్తయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బీవీ ప్రశాంతి, కోశాధికారిగా తారిక్ అన్వర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ధన్‌సింగ్, శశిరేఖ, రవీంద్ర రాథోడ్, అంజయ్య, ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా డీ రాము, సభ్యులుగా మదన్‌మోహన్, చంద్రశేఖర్, సమ్మిరెడ్డి, సంతోష్, రామ్మోహన్‌రావు, బాలకృష్ణను ఎన్నుకున్నారు.

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ జాగృతి న్యూజిలాండ్ శాఖతోపాటు ఆక్లాండ్ ఇండియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యాన్ని, దానివల్ల ఒనగూడే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. భావ్ ధిల్లాన్, పరంజిత్ పామర్, కన్వల్జిట్ బక్షి, తెలంగాణ జాగృతి న్యూజిలాండ్ అధ్యక్షురాలు అరుణా జ్యోతి, పీఆర్వో సుకృతి, కార్యదర్శి ప్రసన్, ప్రతినిధులు పవన్, హరి, భార్గవ, 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' సభ్యులు మనోజ్, బిందితదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దక్కన్ క్రానికల్ చైర్మన్ కుటుంబానికి బెదిరింపులు

- ఇద్దరు వ్యక్తుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- అరెస్టయినవారిలో ఒకరు ఆస్ట్రేలియా పౌరుడు



పోన్ విశాకన్, రాకేశ్‌రాజ్

బంజారాహిల్స్: రూ.18 కోట్లు ఇవ్వకపోతే అంతు చూస్తామంటూ దక్కన్ క్రానికల్ చైర్మన్ టీ వెంకట్రాంరెడ్డి కుటుంబసభ్యులను బెదిరించిన ఇద్దరు వ్యక్తులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్‌చేశారు. వీరిలో ఒకరు ఆస్ట్రేలియా పౌరుడు. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని టీ వెంకట్రాంరెడ్డి ఇంటికి శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇద్దరువ్యక్తులు వచ్చి వెంకట్రాంరెడ్డి గురించి సెక్యూరిటీ గార్డు కృష్ణను వాకబు చేశారు. విషయాన్ని వెంకట్రాంరెడ్డి భార్య మంజులారెడ్డికి సెక్యూరిటీ గార్డు తెలిపాడు. తన భర్త హైదరాబాద్‌లో లేరని చెప్పగా.. సదరు ఇద్దరు వ్యక్తులు దుర్భాషలాడుతూ తమకివ్వాల్సిన రూ.18 కోట్లు ఇవ్వకపోతే అంతు చూస్తామంటూ బెదిరించారు. ఇంటి ఫొటోలు తీస్తూ హల్‌చల్ చేశారు. కొంత సేపటి తర్వాత అక్కడనుంచి వెళ్లిపోయిన వారు.. రాత్రి వరకు మంజులారెడ్డికి ఫోన్లు చేస్తూ పలుమార్లు బెదిరించారు. ఈ మేరకు వెంకట్రాంరెడ్డి కుమారుడు విజయ్‌రెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకొన్న పోలీసులు సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా ఇద్దరు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. బెదిరింపులకు దిగినవారిలో ఒకరు చెన్నై నుంచి ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కు వెళ్లి స్థిరపడిన పోన్ విశాకన్ అలియాస్ నిక్, మరొకరు చెన్నైకి చెందిన రాకేశ్‌రాజ్‌గా గుర్తించారు. వెంకట్రాంరెడ్డితో వీరికి ఎలాంటి సంబంధాలు ఉన్నాయనే విషయంపై స్పష్టత కోసం పోలీసులు విచారిస్తున్నారు. ఆర్థిక లావాదేవీల్లో భాగంగానే బెదిరింపులకు దిగివుంటారని పోలీసులు భావిస్తున్నారు. ఆ ఇద్దరు ఎవరో తమకు తెలియదని వెంకట్రాంరెడ్డి కుటుంబసభ్యులు చెప్తున్నట్టుగా తెలిసింది.

నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 17 జూన్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

ఎనర్జీ డ్రింకులతో గుండెకు చిల్లు!

ఎనర్జీ డ్రింక్స్ వల్ల లాభాల మాట అటుంచితే నష్టాలే ఎక్కువగా ఉన్నాయట. తక్షణ ఎనర్జీ కోసం తాగండి అంటూ రూ.50 నుంచి, వెయ్యి వరకు డ్రింక్స్ మనకు అందుబాటులో ఉన్నాయి. ఇవి తాగడం వల్ల ఆరోగ్యానికి హాని ఎలా జరుగుతుందో చూద్దాం.

- ఎనర్జీ డ్రింక్స్ తాగితే శరీరంలో రక్తపోటు స్థాయి విపరీతంగా పెరిగిపోతుంది. హృదయ స్పందనల్లో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటాయి. ఎనర్జీ డ్రింక్స్‌లో కలిపే రసాయనాల వల్ల గుండెకు హాని జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.
- ఎనర్జీ డ్రింకుల్లో కలిపే 304 నుంచి 320 గ్రాముల కెఫైన్ మెదడును ఉత్తేజితం చేస్తుంది. ఈ కారణంగా ఎనర్జీ డ్రింక్ తాగిన వెంటనే బలం పెరిగిన భావన వస్తుంది. కానీ ఆ బలం కొద్దిసేపు మాత్రమే ఉంటుందన్న విషయం గ్రహించాలి.
- ఎనర్జీ డ్రింకుల్లో కలిపే రసాయనాల వల్ల భవిష్యత్‌లో గుండెజబ్బులు, నరాల బలహీనత సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పసిఫిక్ సైంటిస్టులు ఒక పరిశోధనలో తెలిపారు.
- టీనేజర్స్ ఈ డ్రింకులను తాగడం వల్ల వారి శారీరక ఎదుగుదల ఆగిపోతుంది. ప్రతి రోజు ఈ డ్రింక్స్ తాగే పిల్లలు స్థూలకాయం, మధుమేహం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడతారు. ముఖ్యంగా పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది.
- వృద్ధులు ఎనర్జీ డ్రింక్స్ తాగడం వల్ల వారి జీర్ణక్రియ మందగిస్తుంది. వాంతులు వికారం కలిగే అవకాశం ఉంది. రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. ప్రతిరోజు ఈ డ్రింక్ సేవించే వృద్ధులు తరచూ అనారోగ్యం పాలవుతుంటారు. వీలైనంత వరకు పిల్లలు, వృద్ధులు ఈ డ్రింక్స్‌కు దూరం ఉండడమే. మంచిది.

చాయ్ బిజినెస్‌లో సూపర్‌స్టార్

ఉపమా విర్ధి

చాయ్ చటుక్కున తాగరా బాయ్, చాయ్ చమక్కులే చూడరా భాయ్, చాయ్ ఖరీదులో చీపురా భాయ్, చాయ్ హుషారునే పెంచురా భాయ్ అంటూ చాయ్ గొప్పతనాన్ని మన కవులు ఎందరో పాటల రూపంలో వివరించారు. మన దేశంలో కొందరి పరిస్థితి నిద్రలేచింది మొదలు.. పడుకునే వరకు టీతో ముడిపడి ఉంటుంది. ఎవరైనా ఇంటికి వెళితే చాలు టీ తాగుతారా అంటారు. చికాకుగా ఉన్నా టీ తాగుతారు. నలుగురు ఫ్రెండ్స్ కలిస్తే చాలు టీ తాగుదాం అంటూ స్టాల్‌కు వెళ్తారు. జీరాచాయ్, అల్లంచాయ్, చాకొలేట్ చాయ్, లెమన్‌చాయ్ ఇలా చెప్పుకుంటే ఎన్నో రకాల చాయ్‌లు. భారతీయ బ్రాండ్ చాయ్‌ని ఆస్ట్రేలియాలో పరిచయం చేయడమే కాకుండా బిజినెస్‌గా ఎంచుకుని విజయం సాధించిన ఉపమావిర్ధి సక్సెస్‌మంత్ర.

సక్సెస్ మంత్ర

చాయ్.. మన దేశంలో ఉదయం లేవగానే పలకరించే వేడివేడి పానీయం. తేనీరుగా పిలిచే చాయ్‌తో తేనీటి విందులే చేస్తారంటే అతిశయోక్తికాదు. ఒకప్పుడు కేవలం తేయాకుతో చేయగలిగే చాయ్ ఇప్పుడు అనేక ప్లేవర్లకు విస్తరించింది. అనేక రకాల సుగంధాలతో మిలిళితమై ఎన్నో రకాల రుచులను అందిస్తున్నది. అలాంటి భారతీయ తేనీరు విదేశాల్లోనూ యమా క్రేజ్ సంపాదించుకుంది. ముఖ్యంగా ఆస్ట్రేలియాలో అయితే భారతీయ సాంప్రదాయ చాయ్‌కి పెద్ద క్యూ లైనే ఉంది. అది కూడా మన భారతీయురాలు నడుపుతున్న టీస్టాల్. దాన్నే బిజినెస్‌గా మలుచుకుని దూసుకుపోతున్నది ఉపమావిర్ధి. చాయ్‌వాలీగా ఉపమావిర్ధి మన భారతీయ చాయ్‌కి అంతర్జాతీయ గుర్తింపును తీసుకువస్తున్నది.

అన్న పెళ్లిలో..

ఉపమావిర్ధి స్వస్థలం చండీగఢ్. ఇంటికి ఎవరు వచ్చినా టీ ఇచ్చే బాధ్యత తీసుకునేదట. అన్న పెళ్లప్పుడు ఇంటికి వచ్చిన అతిథులందరికీ వేల కప్పుల టీ కాచి అందించిందట. 'మా పేరెంట్స్ అలసిపోయి ఇంటికి రాగానే ఫస్ట్ అడిగే క్వశ్చన్.. 'ఉపమా.. నీ చేతులతో టీ పెట్టివ్వవా?' అనే. స్కాలర్‌షిప్ మీద ఆస్ట్రేలియా వెళ్లాను. అక్కడ మా హాస్టల్లో ఉన్న వాళ్లందరికీ టీ పెట్టిచ్చేదాన్ని. నా టీ కోసమే వాళ్లంతా ఒక చోట గ్యాదర్ అవడం మొదలుపెట్టారు. అంతకుముందు ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లు ఉంటేది అంటుంది విర్ధి. వాళ్ల తాత ఆయుర్వేద వైద్యుడు. చాయ్ కాచడంలో దిట్ట. విర్ధి చిన్నపిల్లగా ఉన్నప్పుడు హెర్బల్ టీ కాచడం ఎలాగో నేర్పాడట. ఇష్టంగా నేర్చుకుంది. కానీ, దాని మీద శ్రద్ధ పెట్టే అవకాశం తాను ఇండియాలో ఉన్నప్పుడు ఎప్పుడూ రాలేదట. ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియా వెళ్లి, 'లా'లో అడ్మిషన్ దొరికాక అప్పుడొచ్చింది ఆమెకు ఆలోచన.

పార్ట్‌టైంగా...

తన చాయ్‌కి క్రేజ్ పెరగడంతో లా చదువుతూనే పార్ట్‌టైమ్‌గా టీ కాచడం మొదలుపెట్టింది విర్ధి. కేవలం ఇండియన్స్‌కే కాక ఆస్ట్రేలియన్స్‌కి కూడా ఈ ఇండియన్ గర్ల్ చేస్తున్న దేశీ చాయ్ పిచ్చిపిచ్చిగా నచ్చేసింది. రెండంటే రెండేళ్లలోనే విర్ధి బ్రాండ్ టీకి అక్కడ విపరీతమైన క్రేజ్ వచ్చింది. సోషల్ సర్కిల్ ద్వారా ఆమె చేసిన చాయ్‌కి అందరూ ఫిదా అయిపోయారు. విర్ధి ఎక్కడికి వెళ్లినా టీ చేసివ్వవా అని అడుగుతారట. ఆమె లా పూర్తయ్యేలోపు చాయ్‌వాలీగా ఫేమస్ అయిపోయింది. చిత్రంగా లాయర్‌గా ప్రాక్టీసే పార్ట్‌టైమ్ అయిపోయి చాయ్‌వాలీగా ఫుల్‌టైం బిజీ అయింది. ఇంకేముందీ ఆన్‌లైన్‌లో చాయ్ బిజినెస్ ప్రారంభించింది. వెరైటీ టీలను కాచడమెలాగో నేర్పిస్తున్నది. టీ, దానికి సంబంధించిన అనుబంధ ఉత్పత్తులను అమ్ముతున్నది. వీటికి ఎంత డిమాండ్ అంటే యూరప్ నుంచి కూడా ఆమెకు ఆర్డర్స్ వస్తుంటాయి. వర్క్‌షాప్స్ నిర్వహించమని రిక్వెస్టులూ అందుతుంటాయి. ఆ మేరకు నిర్వహిస్తుంటుంది కూడా.

తాత నేర్పిన చాయ్

విర్ధి తాత ప్రీతమ్ సింగ్ విర్ధి ఆయుర్వేద వైద్యుడు. విర్ధి బాల్యంలో ఆయన సుగంధ ద్రవ్యాలతో రకరకాల టీలు తయారు చేసేవాడట. టీ తయారీలో వాడే పదార్థాలు, వాటి మోతాదులు మారుస్తూ ఆయన తయారుచేసే టీలు ఔషధగుణాలు కూడా కలిగిఉండేవట. వాటి ప్రభావాన్ని దగ్గరనుంచి చూసిన విర్ధికి చాయ్ అంటే చెప్పలేనంత ఇష్టం, గౌరవం ఏర్పడిపోయాయట. అప్పటినుంచీ చాయ్ పెట్టటంలో రకరకాల ప్రయోగాలు చేస్తూ ఇంట్లోవాళ్లకి అందిస్తూ ఉండేది. 'భారతీయులకు టీతో ఉన్న అనుబంధం వెలకట్టలేనిది. అసలు.. ఇండియాలో చాయ్ వాసన రాని ఇల్లుంటుందా? ప్రతి ఇల్లాలూ చాయ్ వాలీనే! కానీ, అదేంటో ఎక్కడ చూసినా.. చాయ్ వాలాలే కనిపిస్తూ ఉంటారు. చాయ్‌వాలీ ఒక్కరూ కనిపించరు. అందుకే.. ఆ చాయ్‌వాలీ నేనే ఎందుకు కాకూడదు అనిపించింది. లా చేశాక చాయ్‌వాలీగా మారిపోతానని ఇంట్లో చెప్పేశా! ముందు అభ్యంతరం చెప్పినా తర్వాత ఒప్పేసుకున్నారు' అంటూ హుషారుగా చెప్తున్న విర్ధి ప్రస్తుతం రకరకాల దినుసులు, సుగంధాలతో 3 రకాల టీ బ్రాండ్సును మార్కెట్లో రిలీజ్ చేసింది. ఆర్ట్ ఆఫ్ చాయ్ పేరుతో టీ వర్క్‌షాప్స్ కూడా నిర్వహిస్తున్నది.

టీ తయారీలో శిక్షణ

ప్రస్తుతం విర్ధి చాయ్ బిజినెస్ ఒక రేంజిలో ఉంది. ఇటీవలే సిడ్నీ టీ ఫెస్టివల్‌లో విర్ధి తన బ్రాండ్ టీని పరిచయం చేశారు. అంతేకాదు.. అద్భుతమైన టీ ఎలా తయారు చేయాలో అక్కడికి వచ్చిన వారందరికీ నేర్పించారు. కేవలం టీ తయారు చేయడమే కాదు.. ఆన్‌లైన్ టీ స్టోర్ కూడా నడుపుతున్నారు. వెరైటీ టీ ప్రాడక్ట్స్, క్యాండిల్స్, పాట్స్, కెట్టిల్స్, స్టెయినర్స్ అమ్ముతున్నారు. అందులో చాకొలేట్ టీ వెరీ వెరీ స్పెషల్. ఇవి కాకుండా అప్పుడప్పుడూ టీ చేయడంపై వర్క్‌షాప్ కూడా కండక్ట్ చేస్తారు. ఔత్సాహికులకు ఏలకుల వంటి సుగంధ ద్రవ్యాలను వేసి పరిమళభరితమైన తేనీరు తయారు చేయడమెలాగో నేర్పిస్తున్నారు.

11 సుగంధ ద్రవ్యాలతో..

అస్సామ్ టీ పొడికి దాల్చిన చెక్క, జాపత్రి, పసుపు మొదలైన 11 సుగంధ ద్రవ్యాలను చేర్చి కాచే టీ విర్ధి సిగ్నేచర్ టీ. ఆర్గానిక్ బ్లాక్ టీ, చాక్లెట్ ఫ్లేవర్డ్ టీ.. ఇలా విర్ధి రకరకాల టీలు తయారుచేస్తూ ఉంటుంది. కానీ, ఇన్ని టీలు కాస్తుంది కాబట్టి విర్ధి టీ ఫ్యాన్ అనుకుంటే పప్పులో కాలేసినట్టే! విర్ధి కాఫీ అభిమాని. అదేంటి? అని ఎవరైనా అడిగితే 'టీ నా హస్బెండ్ అయితే కాఫీ నా ఆన్ అండ్ ఆఫ్ బాయ్‌ఫ్రెండ్' అంటూ నవ్వేస్తుంది. అన్నట్టు ఉపమా అనే పేరు గురించి కూడా చెప్పుకోవాలిగా! ఆ పేరుకు పంజాబీలో 'సర్వ శక్తిమంతుడిని కీర్తించడం' అని అర్థం.

అవార్డులు

అద్భుతమైన రుచులతో రకరకాల టీపొడుల్ని తయారుచేసి మార్కెట్ చేస్తున్న విర్ధిని ఆస్ట్రేలియా ప్రభుత్వం 2016 బిజినెస్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో కూడా సత్కరించింది. ఇండియన్ ఆస్ట్రేలియన్ బిజినెస్ అండ్ కమ్యూనిటీ అవార్డ్స్ (ఐఏబిసిఏ)కు కూడా ఎంపికైంది ఉపమా విర్ధి. మెల్‌బోర్న్ టీ ఫెస్టివల్‌కు ప్రత్యేక అతిథిగా ఆమెకు ఆహ్వానం అందింది. 'మన దేశ చాయ్ రుచిని ప్రపంచమంతటికీ తెలియజేయాలన్నదే నా లక్ష్యం' అంటున్నది ఉపమా విర్ధి. 'నేను గొప్ప లాయర్నే కాదు, అంతకంటే గ్రేట్ 'చాయ్ వాలీ'ని కూడా అంటున్నది ఉపమా.

చిన్న వయసులోనే పెద్ద పని!

12 యేండ్ల వయసు.. చదివేది ఎనిమిదో తరగతి. అనర్గళంగా మాట్లాడగలుగుతుంది. అంతకు మించి చెప్పాలంటే శిలాజాల మ్యూజియానికి యజమాని. ఆమె ఓ చిన్నారి పరిశోధకురాలు. ఆమె ఎవరంటే..

చెన్నైకి చెందిన అశ్వతా బిజుకు 12 యేండ్లు. స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నది. 74 శిలాజాలతో కూడిన ఓ చిన్న మ్యూజియాన్ని ఏర్పాటు చేసింది. అశ్వతా బిజుకు ఐదేండ్ల వయసున్నప్పుడు తల్లిదండ్రులతో కలిసి ఓ మ్యూజియాన్ని సందర్శించింది. అందరు పిల్లల్లా మ్యూజియంలోని ప్రాచీన విశేషాలను చూసి వెంటనే మరిచిపోలేదు అశ్వత. ఇంటికొచ్చి పదే పదే తల్లిదండ్రులను వాటి గురించి అడిగింది. దాంతో గూగుల్‌లో సముద్ర జీవులు, శిలాజాల వీడియోలు, చిత్రాలు చూపించారు. అలా కలిగిన ఆసక్తి ఆమెను పరిశోధనలు చేసే దాకా తీసుకెళ్లింది. ఆ తర్వాత అశ్వత తమిళనాడులోని పెరంబలూర్, అరియార్ జిల్లాలకు అధ్యయనం కోసం వెళ్లింది. అక్కడ అమోనైట్స్, ఎచినోయిడ్స్, బివాల్వ్స్, లోఫా, బెలెంనైట్, గ్యాస్ట్రోపాడ్స్, నాటీలస్ వంటి అరుదైన శిలాజాలను సేకరించింది. వాటిని మ్యూజియం మాదిరిగా ఏర్పాటు చేసి స్థానిక పాఠశాలల విద్యార్థులకు వివరిస్తున్నది. అన్నా విశ్వ విద్యాలయానికి చెందిన డాక్టర్ ఆర్. నాగేంద్ర, పెరియార్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ రామ్‌కుమార్, యూఏఈకి చెందిన మరో భౌగోళిక నిపుణుడు అశ్వతకు మార్గనిర్దేశనం చేస్తున్నారు. వాళ్ల వద్ద నేర్చుకున్న విద్యతో అనేక వేదికలపైన శిలాజాలు, సముద్ర జంతువులపై అనర్గలంగా ఉపన్యాసాలిస్తున్నది. స్థానికంగా ఉన్న ఇతర ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సైతం ప్రత్యేక తరగతులు చెప్పించుకునేందుకు అశ్వతను ఆహ్వానిస్తున్నాయి. భవిష్యత్‌లో గొప్ప పాలియంథాలజిస్టును కావాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు అశ్వతా బిజు చెబుతున్నది.

అవాంఛిత రోమాలా?

చాలా మంది మహిళలకు, విద్యార్థినులకు పై పెదవిపైన అవాంఛిత రోమాలు ఉంటాయి. ఎంత అందంగా ఉన్నప్పటికీ వీటి వల్ల అందవిహీనంగా కనిపిస్తారు. అలాంటి వారు ఈ చిన్న చిట్కాలు పాటిస్తే చాలు అవాంఛిత రోమాల సమస్య నుంచి బయటపడవచ్చు.

- ఒక గిన్నెలో 3 టేబుల్ స్పూన్ల పంచదారను తీసుకోవాలి. దానికి 1 టేబుల్ స్పూన్ తేనె, 1 టేబుల్ స్పూన్ నిమ్మరసం వేసి బాగా కలపాలి. పై పెదవి ప్రాంతంలో ఈ మిశ్రమాన్ని ఒక పొరగా వేయాలి. 15-20 నిమిషాలు ఆరనివ్వాలి. మొఖం మీది పొరను తీసేసి గోరువెచ్చని నీటితో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- అర టీ స్పూను పసుపు పొడి, 2 టీ స్పూన్ల పచ్చి పాలు ఒక గిన్నెలో తీసుకుని బాగా కలపాలి. పై పెదవి ప్రాంతంలో ఈ మిశ్రమం పొరను అప్లై చేయాలి. ఆరిపోయాక పొరను తొలగించి గోరు వెచ్చని నీటిని ఉపయోగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయాలి. వారానికి ఒకసారి చేస్తే ఫలితం ఉంటుంది.
- అరటీ స్పూన్ శనగపిండి, 2 టీస్పూన్ల తేనెను ఒక గిన్నెలోకి తీసుకుని బాగా కలపాలి. 15- 20 నిమిషాలు ఆరనివ్వాలి. జుట్టు పెరుగుదలకు వ్యతిరేక దిశలో వేసిన పొరను, నెమ్మదిగా తొలగించి, గోరువెచ్చని నీటితో శుభ్రపర్చాలి. పొడి తువాలుతో ఆ ప్రాంతం నుంచి తడిని తొలగించాలి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.
- గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ జెలటిన్ తీసుకోవాలి. పాలు చేర్చి బాగా కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని మైక్రోవేవ్‌లో అర నిమిషం ఉంచాలి. బౌల్‌ను బయటకు తీసి మిశ్రమాన్ని కలిపి, నాలుగు చుక్కల నిమ్మరసం కలుపాలి. అవాంఛిత రోమాల వద్ద పుల్లతో అప్లైచేయాలి. 10 నిమిషాల తర్వాత పొరను తొలగించి చల్లటి నీటితో కడగాలి. నెలకోసారి ఇలా చేస్తే ఫలితం ఉంటుంది.

డిస్క్ రిప్లేస్‌మెంట్ ఆపరేషన్ చేసుకోవచ్చా?

నా వయసు 38 సంవత్సరాలు. నాలుగు నెలల నుంచి మెడనొప్పి వస్తున్నది. కుడిచెయ్యి బాగా లాగుతున్నది. చేతుల్లో తిమ్మిర్లు కూడా వస్తున్నాయి. బరువులు ఎత్తలేకుండా ఉన్నాను. కొద్దిరోజులుగా మందులు వాడుతున్నాను. అవి వాడినంతసేపు బాగానే ఉంటుంది కానీ తర్వాత మళ్లీ నొప్పులు వస్తున్నాయి. దీనివల్ల ఏ పనీ చేసుకోలేకపోతున్నాను. ఆర్థోపెడిక్ డాక్టర్‌ను సంప్రదిస్తే మెడకు ఎక్స్‌రే, ఎంఆర్ఐ స్కానింగ్ చేశారు. సీ5సీ6 మధ్యలో ఉండే డిస్క్ విరిగిపోయి కుడిచేతిలోకి వచ్చే నరాలను ఒత్తిడి చేస్తుందని ఎంఆర్ఐ స్కానింగ్‌లో తేలింది. ఎముక రెండు కొనలను కలిపే ఫుజన్ ఆపరేషన్ చేయాలన్నారు. గూగుల్‌లో సెర్చ్ చేయగా దానికంటే డిస్క్ రిప్లేస్‌మెంట్ ఆపరేషన్ ఉత్తమం అని తెలిసింది. ఇది చేసుకోమంటారా వద్దా?

- పునార్జనరావు, హైదరాబాద్

మెడలో డిస్క్ సమస్యలకు ఎముక కొనలను అతికించే ఆపరేషన్, డిస్క్ రిప్లేస్‌మెంట్ ఏదైనా చేయొచ్చు. రెంటి శస్త్రచికిత్సల ప్రభావం ఒకేలా ఉంటుంది. కానీ డిస్క్ రిప్లేస్‌మెంట్ ఆపరేషన్‌కు కొన్ని అడ్వాంటేజెస్ ఉన్నాయి. చెయ్యి, మెడనొప్పి వంటివి దీనితో ఎక్కువగా తగ్గుతాయి. ఆపరేషన్ తర్వాత సర్వైకల్ కాలర్ వాడాల్సిన అవసరం ఉండదు. ఫుజన్ ఆపరేషన్‌లో తుంటి దగ్గర ఎముకను తీసి మెడలో అమరుస్తారు. అంటే తుంటి దగ్గర కూడా చిన్న ఆపరేషన్ చేస్తారన్నమాట. ఇలాంటి రెండో ఆపరేషన్ డిస్క్ రిప్లేస్‌మెంట్ పద్ధతిలో అవసరం ఉండదు. రీఆపరేషన్ రేట్స్ ఫుజన్ ఆపరేషన్‌తో పోలిస్తే తక్కువగా ఉంటుంది. ఓవరాల్‌గా చూస్తే మీ సమస్యకు డిస్క్ రిప్లేస్‌మెంట్ ఆపరేషనే బెటర్ అనిపిస్తున్నది. మంచి నిపుణులైన డాక్టర్‌ను సంప్రదించి ఆలస్యం చేయకుండా ఈ ఆపరేషన్ చేయించుకోండి. మంచి పోషకాలున్న ఆహారం తీసుకోండి. తప్పనిసరిగా వ్యాయామం చేయండి. అప్పుడు మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుంది.

డాక్టర్ జీపీవీ సుబ్బయ్య
కన్సల్టెంట్ స్పైన్ సర్జన్
కేర్ హాస్పిటల్స్, హైటెక్‌సిటీ

వినూత్న విద్యాబోధన

దేశాభివృద్ధి ఆ దేశ జనాభా అక్షరాస్యతపై ఆధారాపడి ఉంటుంది. నాణ్యమైన విద్యను అందించేందుకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎమ్) కోల్‌కతాకు చెందిన పరిశోధకులు శ్రీకారం చుట్టారు. ప్రత్యేకంగా ఎడ్యూటెక్ స్టార్టప్‌ను రూపొందించి వినూత్నంగా విద్యాబోధన చేస్తున్నారు.



ప్రాథమిక పాఠశాలల్లో చదివే కొంతమంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. దానివల్ల వారు చదువులో రాణించలేకపోతున్నారని 2018 వార్షిక విద్యా నివేదికలో వెల్లడైంది. భారతదేశంలో గ్రామీణ, పట్టణాల్లోని పలు పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ముగ్గురు టెకీలు ముందుకొచ్చారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కోల్‌కతాకు చెందిన ప్రియదర్శిణి, జయంతబాసక్, అరీనా బర్ధన్ అనే ముగ్గురు పరిశోధకులు నేటి విద్యా వ్యవస్థలోని లోపాలపై అధ్యయనం మొదలుపెట్టారు. అందుకు పశ్చిమబెంగాల్‌లోని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను ఎంచుకున్నారు. పలు స్కూళ్లలో ఉపాధ్యాయులు లేకపోవడం, ఒకవేళ ఉపాధ్యాయులున్నా సమయానికి హాజరుకాకపోవడం, టీచర్లకు సరైన అవగాహన లేకపోవడం వంటి అంశాలుగా తేల్చారు. నాణ్యమైన విద్యనందించేందుకు ఈ-లెర్నింగ్ విధానమే సరైన పరిష్కారమని తేల్చారు. 30మంది విద్యార్థులకు ఆరు నెలలు ప్రయోగాత్మకంగా ఆన్‌లైన్‌లో పాఠాలు చెప్పారు. ఇదే ప్రాజెక్టును పశ్చిమబెంగాల్‌లోని నాలుగైదు చోట్ల ప్రవేశపెట్టారు. మంచి ఫలితాలొచ్చాయి. ఈ ప్రాజెక్టు ద్వారా టెకీలు అనుకున్నట్లుగా విజయాన్ని సాధించారు. 2017లో ఆ ప్రాజెక్టుకు కనెక్ట్' అని పేరు పెట్టారు. ఆన్‌లైన్ ద్వారా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తున్నారు. సామాన్య, గణితశాస్త్రం, ఆంగ్లం సబ్జెక్టుల్లో నిష్ణాతులైన 30మం ది ఉపాధ్యాయులతో విద్యను అందించే ప్రయత్నం చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ
నిపుణ
కరీంనగర్
సోమవారం 17 జూన్ 2019

'జోసా'తో జర జాగ్రత్త

జేఈఈ ఫలితాలు వచ్చేశాయ్.. విద్యార్థుల ర్యాంకులు ప్రకటించారు.. నిట్, ఐఐటీ వంటి అత్యున్నత విద్యాసంస్థల్లో చేరాలనుకునే విద్యార్థుల కలలు నెరవేరే సమయం ఆసన్నమైంది. దేశంలోని 31 నిట్‌లు, 23 ఐఐటీలు, 23 ట్రిపుల్ ఐటీలు ఇతర ప్రభుత్వ టెక్నికల్ కళాశాలల్లో అనేక కోర్సులు ఉన్నాయి. వాటిలో ఏ కోర్సు ప్రత్యేకమైంది. డిమాండ్ ఉన్నదేది, ఏ నిట్‌లో ఏ కోర్సు బాగుందో అని విద్యార్థుల తల్లిదండ్రులు ఇప్పటికే అంతర్జాలంలో అన్వేషించారు. కానీ అసలైన పరీక్ష ఇప్పుడే మొదలైంది. విద్యార్థులకు వచ్చిన ర్యాంకుతో కళాశాలల ఎంపికకు ఆన్‌లైన్ దరఖాస్తులు (చాయిస్ ఫిల్లింగ్) చేయడం అత్యంత ప్రధానమైనది. జోసా (జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ) వెబ్‌సైట్ ద్వారా ఈ చాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ జూన్ 16 నుంచి ప్రారంభమైంది. ఈ ప్రక్రియలో విద్యార్థులు కొందరు చేసే చిన్న చిన్న పొరపాట్లతో అత్యంత విలువైన సీటును కోల్పోవాల్సి వస్తుంది. కాబట్టి విద్యార్థులు పాటించాల్సిన కొన్ని పద్ధతులను నిపుణ పాఠకుల కోసం అందిస్తున్నాం.

సీట్ల ఎంపిక ఇలా....

- విద్యార్థులకు వచ్చిన ర్యాంకు ఆధారంగా కళాశాలలు, కోర్సులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ప్రాధాన్యతా క్రమంలో ఎన్ని కోర్సులైనా ఎంపిక చేసుకోవచ్చు. ముందుగా తమకు ఇష్టమైన వాటిని ఎంచుకుని ఒకటి నుంచి చివరి వరకు ఎంపిక చేసుకుంటూ పోవాలి. తప్పనిసరిగా దేశంలోని ఏ నిట్‌లలోనైనా చదవాలనుకున్నప్పుడు తక్కువ ప్రాధాన్యం ఉన్న వాటిని కూడా పరిగణలోకి తీసుకోవాలి. నాకు రాదేమో అనే సందేహాలను పక్కనపెట్టి వెబ్‌సైట్‌లో ఇచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకో వాలి. ప్రతి నిట్‌లో స్థానిక విద్యార్థులకు 50 శాతం, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు 50 శాతం కోటాను కేటాయిస్తారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ఓసీ కేటగిరీలో వీకర్ సెక్షన్‌కు 10 శాతం రిజర్వేషన్ కల్పించింది. వీరిని పరిగణలోకి తీసుకునే జోసాలో ర్యాంకులు కేటాయించారు.
- ఒక విద్యార్థి 50 చాయిస్‌ల వరకు ఎంపిక చేసుకున్నప్పుడు సీట్ల అలాట్‌మెంట్‌లో ఆ విద్యార్థికి వచ్చిన ర్యాంకుతో ఎక్కడ ఖాళీ ఉందో చూస్తారు. ఎంపిక చేసుకున్న వాటిలో 10వ చాయిస్‌కు సీటు వస్తే వెంటనే దగ్గరలో ఉన్న నిట్‌లో సర్టిఫికెట్‌లు వెరిఫికేషన్ చేయించుకుని సీటు రిజర్వ్ చేయించుకోవాలి. ఈ చాయిస్‌తో సంతృప్తిచెందితే 'ఫ్రీజ్' చేసుకోవాలి. అలా కాకుండా అదే కాలేజీలో ఇంకా మంచి బ్రాంచీలో చాన్స్ వస్తుందనుకుంటే 'స్లైడ్' ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. అదేవిధంగా ఏ కాలేజీలోకానీ, ఏ చాయిస్ అయినా వెళతాననుకుంటే 'ఫ్లోట్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. తరువాత క్రమంలో ఎంపిక చేసుకున్నవి (11 నుంచి 50వ చాయిస్) డిఫాల్ట్‌గా ఎడిట్ చేయబడతాయి.
- ఆప్షన్ల ఎంపికలో పొరపాటు చేయకుండా ఒకటికి పదిసార్లు చెక్ చేసుకోవాలి. సీటు రాగానే ముందు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని సీటు రిజర్వ్ చేసుకోవడం తప్పనిసరి. ఇష్టమైన బ్రాంచీ రాలేదని మరో రౌండ్ వరకు వేచిచూడటం పెద్ద పొరపాటు. ఒకసారి సీటు అలాట్ అయితే రిజర్వ్ చేసుకోనప్పుడు మరో అవకాశం ఉండదు. ఏ నిట్‌లలో సీటు వచ్చినా వరంగల్ నిట్‌లో రిపోర్ట్ చేయవచ్చు. ఇక్కడే ఫీజు కట్టవచ్చు.

చాయిస్ ఫిల్లింగ్, సీట్ అలాట్‌మెంట్ వివరాలు

- జూన్ 16 నుంచి రిజిస్ట్రేషన్, చాయిస్ ఫిల్లింగ్ ప్రారంభం
- జూన్ 22న అప్పటి వరకు చాయిస్ ఫిల్లింగ్ చేసుకున్నవారికి మొదటి దవ మాక్ సీట్ అలొకేషన్ ఉంటుంది.
- జూన్ 24న రెండో దశ సీట్ అలాట్‌మెంట్
- జూన్ 25 వరకు రిజిస్ట్రేషన్, చాయిస్ ఫిల్లింగ్ ముగింపు
- జూన్ 27న మొదటి రౌండ్ సీట్ల కేటాయింపు
- జూన్ 28 నుంచి జులై 2 వరకు సీటు పొందిన విద్యార్థుల డాక్యుమెంట్ వెరిఫికేషన్, సీట్ అలాట్‌మెంట్ ఉంటుంది.
- జులై 3న నిండిన సీట్ల వివరాలతో పాటుగా సాయంత్రం రెండో రౌండ్ సీట్ అలొకేషన్
- జులై 4, 5న డాక్యుమెంట్‌ల ధృవీకరణ, రెండో రౌండ్ సీట్ల ఉపసంహరణలు
- జులై 6న నిండిన సీట్ల వివరాలతో పాటుగా సాయంత్రం మూడో రౌండ్ సీట్ అలొకేషన్
- జులై 7, 8న డాక్యుమెంట్ల ధృవీకరణ,మూడో రౌండ్ సీట్ల ఉపసంహరణలు
- జులై 9న నిండిన సీట్ల వివరాలతో పాటుగా సాయంత్రం నాలుగో రౌండ్ సీట్ అలొకేషన్
- జులై 10, 11న డాక్యుమెంట్ల ధృవీకరణ, నాలుగో రౌండ్ సీట్ల ఉపసంహరణలు
- జులై 12న నిండిన సీట్ల వివరాలతో పాటుగా సాయంత్రం ఐదో రౌండ్ సీట్ అలొకేషన్
- జులై 13, 14న డాక్యుమెంట్ల ధృవీకరణ, ఐదో రౌండ్ సీట్ల ఉపసంహరణలు
- జులై 15న నిండిన సీట్ల వివరాలతో పాటుగా సాయంత్రం ఆరో రౌండ్ సీట్ అలొకేషన్
- జులై 16, 17న డాక్యుమెంట్ల ధృవీకరణ, ఆరో రౌండ్ సీట్ల ఉపసంహరణలు
- జులై 18న నిండిన సీట్ల వివరాలతో పాటుగా సాయంత్రం చివరి రౌండ్ సీట్ల అలొకేషన్
- జులై 19న డాక్యుమెంట్ల ధృవీకరణ, చివరి రౌండ్ సీట్ల ఉపసంహరణలతో పాటు జాయినింగ్ రిపోర్ట్ చేయాలి.

(జులై 19న ఐఐటీ విద్యార్థులు, జులై 19 నుంచి 23 వరకు నిట్ విద్యార్థులు జాయిన్ కావాలి)

నోట్: పూర్తి వివరాల కోసం జోసా వెబ్‌సైట్‌ను చూడండి.

...✍ డాక్టర్ పల్లె రవి వంశీమోహన్
నిట్ క్యాంపస్, వరంగల్ అర్బన్

గేట్ అంత కష్టమా?

దేశంలో బహుళ ప్రయోజనకరమైన పరీక్షలో గేట్ అత్యంత ముఖ్యమైంది. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలతోపాటు ఉన్నత చదువులకు కూడా ఈ పరీక్ష ఎంతో కీలకం. అయితే గేట్ చాలా కఠినమైన పరీక్ష అని చాలామంది విద్యార్థులు భయపడతారు. నిజమేనా?

ర్యాంక్ రాకపోవడానికి కారణాలు

- GATEలో విజయం సాధించాలంటే ముందుగా అందులో ఫెయిల్ కావడానికి కారణాలను తెలుసుకోక పోవడం
- గేట్ ప్రిపరేషన్‌ను బీటెక్ చివరి ఏడాదిలోనే ప్రారంభించడం
- స్టాండర్డ్ టెక్స్ట్ బుక్స్ మొదటగా ప్రిపేర్ కాకపోవడం
- డౌట్స్ క్లారిఫై చేయడానికి వనరులు (రిసోర్సెస్) లేకపోవడం
- సీక్వెన్షియల్ ప్రిపరేషన్ తెలియకపోవడం
- సెల్ఫ్ కాన్ఫిడెన్స్ లేక, గేట్ కష్టమని భావించడం
- కాలేజీ లెవల్ బేసిక్స్ (ఇంటర్ లేదా డిప్లొమా) లేకపోవడం
- రీడింగ్, రైటింగ్ స్కిల్స్ లేకపోవడం
- రెగ్యులర్ టెస్ట్ సిరీస్ (ఆన్‌లైన్) ఫాలో కాకపోవడం
- గ్రూప్ స్టడీ లేకపోవడం
- గేట్ ప్రిపరేషన్, కాలేజీలో అకడమిక్ ప్రిపరేషన్ రెండింటికి బ్యాలెన్స్ చేయలేకపోవడం
- గేట్ స్కోర్ మంచిగా రావడంవల్ల వచ్చే లాభాలను తెలుసుకోకపోవడం
- సరైన గైడెన్స్‌లో గేట్ ప్రిపేర్ కాకపోవడం
- ఫోర్త్ ఇయర్ బీటెక్‌లో అకడమిక్, గేట్ ప్రిపరేషన్‌కు సరిపడా టైమ్ కేటాయించకపోవడం
- గేట్ సిలబస్ ప్రకారం ప్రశ్నల విధానంపై అవగాహన లేకుండా చదవడం
- ఇంటర్ లెవల్ మ్యాథ్స్‌పై పట్టులేకపోవడం
- ఆప్టిట్యూడ్ స్కిల్స్‌పై పట్టులేకపోవడం

గేట్‌లో మంచి స్కోర్ రావాలంటే?

- గేట్ సిలబస్ ప్రకారం ప్రతి సబ్జెక్టుకు స్టాండర్డ్ టెక్స్ట్ బుక్స్ సేకరించాలి.
- గేట్ ప్రిపరేషన్ బీటెక్ ఫస్టియర్ నుంచి ప్రారంభించాలి.
- బీటెక్ ఫస్టియర్ డురేషన్‌లో ఇంజినీరింగ్ మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్, ఆప్టిట్యూడ్‌పై పట్టు తెచ్చుకోవాలి.
- బీటెక్ సెకండియర్ డురేషన్‌లో బేసిక్ ఇంజినీరింగ్ సబ్జెక్టుల మీద గట్టిగా ప్రిపేర్ కావాలి. ఉదా: ఈసీఈ, ఈఈఈ వారికి, నెట్‌వర్క్ థియరీ, కంట్రోల్ సిస్టమ్స్, సిగ్నల్ సిస్టమ్స్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్ అండ్ సర్క్యూట్స్, ఆపరేషనల్ ఆంప్లిఫయర్స్ అండ్ ఎలక్ట్రానిక్ ఫీల్డ్స్ స్టాండర్డ్ టెక్స్ట్ బుక్స్ నుంచి ప్రిపేర్ కావాలి.
- బీటెక్ థర్డ్ ఇయర్ డురేషన్‌లో కోర్ సబ్జెక్ట్స్‌మీద ప్రిపేర్ కావాలి. అంటే ఈఈఈ వారు ఎలక్ట్రానికల్ మెషీన్స్, పవర్ సిస్టమ్స్, పరవ్ ఎలక్ట్రానిక్స్, ఈసీఈ వారు కమ్యూనికేషన్ సిస్టమ్స్
- బీటెక్ ఫోర్త్ ఇయర్ డురేషన్‌లో మొత్తం రివిజన్ చేయాలి. అప్లికేషన్ ఓరియంటెడ్ క్వశ్చన్స్ ప్రాక్టీస్ చేయాలి.
- బీటెక్ ఫోర్త్ ఇయర్ ప్రిపరేషన్‌లో ప్రతి వారం ప్రిపేర్ అయిన సబ్జెక్టులపైన ఆన్‌లైన్ ఎగ్జామ్ రాయాలి.
- గేట్ ప్రిపేర్ అయ్యేటప్పుడే ఎప్పటికప్పుడు సినాప్టిక్ నోట్స్ ప్రిపేర్ చేసుకుంటూ ఫార్ములా కిట్‌ను తయారు చేసుకోవాలి. దాన్ని పీరియాడికల్‌గా రివిజన్ చేసుకోవాలి.
- మొదటి నుంచి స్టాండర్డ్ టెక్స్ట్ బుక్స్‌లోని ఎగ్జాంపుల్ ప్రాబ్లమ్స్, ఎక్సర్‌సైజ్ ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయాలి.
- గేట్ ప్రీవియస్ క్వశ్చన్స్ ప్రాక్టీస్ చేస్తూ స్టాండర్డ్ టెక్స్ట్ బుక్స్ నుంచి కొత్తగా గేట్ స్టాండర్డ్‌లో క్వశ్చన్స్‌ను ఊహించి విభిన్న కోణాల్లో ఆలోచించి తయారుచేసుకోవాలి.
- గేట్ సిలబస్ ప్రకారం ప్రతి టాపిక్ మీ కంట్రోల్‌లోకి రావాలి.
- మంచి స్కిల్స్ ఉన్న లెక్చరర్లు, గేట్ ఆస్పిరెంట్స్, గేట్ అచీవర్స్‌ను పరిచయం చేసుకుని గ్రూప్ చేసుకుని వారితో కలిసి ఎప్పటికప్పుడు మీ డౌట్స్‌ను క్లారిఫై చేసుకోవాలి.
- గేట్ ప్రిపరేషన్ ఆర్డర్ ప్రకారం జరగాలి. ఉదా: మ్యాథ్స్ ప్రిపేర్ కాకుండా ఇంజినీరింగ్ కోర్ సబ్జెక్ట్స్ ప్రిపేర్ కాలేము. అలా ఆర్డర్‌ను సెట్ చేసుకుని ప్రిపరేషన్ కొనసాగించాలి.
- గేట్ ప్రిపరేషన్‌కు కావాల్సిన స్టడీ మెటీరియల్ కలెక్ట్ చేసి మీకు అందుబాటులో ఉంచుకోవాలి.
- గేట్ ప్రాబ్లమ్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడే కాన్సెప్ట్ రిఫరెన్స్ కోసం ప్రతి సబ్జెక్టు స్టాండర్డ్ టెక్స్ట్ బుక్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలి.
- గేట్ క్వశ్చన్ ప్రాక్టీస్ చేసేటప్పుడే ఫాస్ట్‌గా రీడ్ చేయడం, అర్థం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి. సిస్టమ్ మానిటర్‌పై చదవడం అలవాటు కావాలి.
- మంచి వ్యక్తిత్వం అలవాటు చేసుకోవడానికి వ్యక్తిత్వ వికాస పుస్తకాలను చదవాలి.
- కాలేజీలో అకడమిక్ షెడ్యూల్‌లో గేట్ ప్రిపరేషన్ కలిసేలా అయ్యేటట్లు చూసుకోవాలి.
- గేట్ ప్రిపరేషన్ కోసం మంచి కోచింగ్ సెంటర్‌ను ఎంచుకోవాలి. పర్సనల్ కేర్ ఎక్కువ ఉన్నచోట, నీ ప్రిపరేషన్ పర్యవేక్షించి, డౌట్లను క్లారిఫై చేసేచోటును ముఖ్యంగా చూడాలి.
- గేట్ ప్రిపేరింగ్ గ్రూప్‌లో ఎప్పటికప్పుడు కొత్తగా ఉన్న ప్రశ్నలను అప్‌డేట్ చేసుకుంటూ ప్రిపేర్ కావాలి. ఉదా: ఆ ఇయర్‌లో జరుగుతున్న కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌లో ఉన్న గేట్ రిలేటెడ్ ప్రశ్నలు క్యాట్, ఈఎస్ఈ, సివిల్ సర్వీసెస్ మొదలైనవి.
- రెగ్యులర్‌గా గేట్ రిలేటెడ్ న్యూస్ ఫాలో చేస్తూ ఉండాలి. గేట్‌కు సంబంధించిన ఆర్టికల్స్, జాబ్ నోటిఫికేషన్స్ ఆన్ ది బేసిస్ ఆఫ్ గేట్ స్కోర్ ఎంటెక్ అడ్మిషన్స్ ఆన్ ది బేసిస్ ఆఫ్ గేట్ స్కోర్ వీటికి సంబంధించిన న్యూస్ తెలుసుకోవాలి.
- గేట్ ప్రిపేరయ్యే వాళ్లు ఆప్టిట్యూడ్ స్కిల్స్ పెంచుకోవడం వల్ల వారికి ప్రాబ్లమ్ సాల్వ్ చేసే సరళిలో టైమ్ సేవ్ చేస్తారు.
- గేట్ ప్రిపేరయ్యేటప్పుడు ప్రాపర్ ఆటిట్యూడ్ కలిగి ఉండాలి. అంటే అర్థంకాని టాపిక్, ఒకటికి రెండుసార్లు ఓపికగా చదివి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడానికి ఆటిట్యూడ్ బాగుండాలి.
- గేట్ ప్రిపరయ్యేటప్పుడు ఫండమెంటల్స్ మ్యాథ్స్, ఫిజిక్స్‌లపై పట్టు సాధించాలి.
- గేట్ ప్రిపరేషనల్‌లో కాన్సన్‌ట్రేషన్ లెవల్ అంచనావేసి తక్కువుంటే పెంచగలగాలి. దానికి ప్రతిరోజూ కొంత సేపు మెడిటేషన్ చేయడం మంచిది.
- వీలైన చోట షార్ట్ కట్స్‌తో ప్రాక్టీస్ చేయాలి.

గేట్‌లో మంచి స్కోర్‌తో వచ్చే లాభాలు

బీటెక్ → గేట్ →
- ఐఐటీ, ఎన్ఐటీలలో ఎంటెక్
- పీఎస్‌యూలలో ఉద్యోగాలు
- పీహెచ్‌డీ అడ్మిషన్లు

- గేట్ స్కోర్ ఆధారంగా ఇంజినీరింగ్ పట్టభద్రులను నియమించుకుంటున్న ప్రభుత్వరంగ సంస్థలు
  1) భెల్ (Bhel)
  2) గెయిల్ (Gail)
  3) హాల్ (Hal)
  4) ఐఓసీఎల్ (IOCL)
  5) ఎన్టీపీసీ (NTPC)
  6) ఎన్టీపీసీఐఎల్ (NTPCL)
  7) ఓన్జీసీ (ONGC)
  8) పీజీసీఐ (PGCI)
  9) ఎంఆర్‌పీఎల్ (MRPL)
  10) బీఎస్ఎన్ఎల్ (BSNL)
  11) డీఆర్‌డీఓ (DRDO)

గేట్ స్ట్రక్చర్

- ఎగ్జామ్ డురేషన్ 3 గంటలు
- టోటల్ ప్రశ్నలు 65
- టోటల్ మార్కులు 100
- జనరల్ ఆప్టిట్యూడ్– 10 ప్రశ్నలు, 15 మార్కులు.
- ఇంజినీరింగ్ మ్యాథ్స్ అండ్ రెస్పెక్టివ్ ఇంజినీర్– 55 ప్రశ్నలు, 85 మార్కులు

నెగెటివ్ మార్కింగ్

- ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు 1/3 మార్కులు తగ్గిస్తారు.
- 2 మార్కుల మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు 2/3 మార్కులు తగ్గిస్తారు.
- న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలకు నెగెటివ్ మార్కింగ్ లేదు.

ఆర్ జయచంద్ర
డైరెక్టర్, స్పేస్ ఇంజినీర్స్ అకాడమీ
హైదరాబాద్
9848485698

సివిల్స్ జనరల్ ఎస్సే

ప్రిపరేషన్ ఎలా?

- దేశంలో అత్యున్నత ఉద్యోగాలైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి సివిల్ సర్వీసెస్‌లో చేరడానికి ప్రతి ఏటా యూపీఎస్సీ నిర్వహించే మూడంచెల పరీక్ష విధానంలో మొదటి దశ అయిన ప్రిలిమ్స్ పూర్తయ్యింది. ఇది మెయిన్స్ రాయడానికి అర్హత పరీక్ష మాత్రమే. సెప్టెంబర్‌లో జరిగే మెయిన్స్‌లో వచ్చే మార్కులే అభ్యర్థి విజయాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి అభ్యర్థులు సమయాన్ని శాస్త్రీయ పద్ధతిలో సమర్థవంతంగా వినియోగించుకుని అత్యధిక మార్కులు సాధించేవిధంగా సొంతంగా ప్రణాళికలు రూపొందించుకుని ప్రిపరేషన్ కొనసాగించాలి.
- 2013 నుంచి సివిల్స్ మెయిన్స్‌లో ఆప్షనల్స్ పాత్ర తగ్గింది. జనరల్ స్టడీస్ పాత్ర గణనీయంగా పెంచారు. మెయిన్ మొత్తం 1750 మార్కుల్లో 1250 మార్కులు జనరల్ స్టడీస్ 5 పేపర్లకు కేటాయించారు. ఇందులో జనరల్ ఎస్సే ఒక పేపర్.

జనరల్ ఎస్సే సిలబస్

- నిజానికి జనరల్ స్టడీస్‌లోని మిగతా నాలుగు పేపర్లకు నిర్దిష్ట సిలబస్ పేర్కొన్నారు. కానీ జనరల్ ఎస్సేకు మాత్రం ప్రత్యేకంగా ఎలాంటి సిలబస్‌ను ఇవ్వలేదు.

స్వరూపం

- అభ్యర్థి నిర్దిష్టమైన అంశంపై ఎస్సే రాయాలి. ఇందులో చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థి ఆలోచనలు క్రమబద్ధంగా, సంక్షిప్తంగా ఎలా రాయగలడో పరీక్షిస్తారు. సమర్థవంతమైన, కచ్చితమైన వ్యక్తీకరణకు అవకాశం ఉంటుంది.
- జనరల్ ఎస్సే పేపర్‌లో రెండు సెక్షన్లు ఉంటాయి. ప్రతి సెక్షన్ నుంచి నాలుగు ప్రశ్నలు, వీటిలో ఒక్కో సెక్షన్ నుంచి ఒక ప్రశ్న చొప్పున మొత్తం రెండు ప్రశ్నలకు (2X125=250) మూడు గంటల సమయంలో సమాధానాలు రాయాలి.

మౌలిక సూత్రాలు

- ఎంచుకున్న ప్రశ్నకు గంటన్నర సమయం ఒకే సమాధానాన్ని రాయడం ఒక రకంగా ఇబ్బందికరమైన అంశంగా ఉన్నప్పటికీ అభ్యర్థి విషయ పరిజ్ఞానాన్ని (సబ్జెక్టు), మనస్తత్వాన్ని (పర్సనాలిటీ) ఏకకాలంలో అంచనావేయడానికి ఈ పేపర్ ప్రధానంగా దోహదపడుతుంది. అయితే ఈ పేపర్‌కు నిర్దిష్ట సిలబస్ లేకపోవడంవల్ల ప్రశ్నల స్వభావం, స్థాయిని కచ్చితంగా అంచనావేయడం సాధ్యంకాదు. అంతేకాకుండా కొన్ని ప్రశ్నలు ఊహాత్మకంగా, ఆధ్యాత్మికంగా, మైథలాజికల్‌గా ఉండటంవల్ల ప్రశ్న ఎంపిక అత్యంత కీలకం. అదేవిధంగా సమాధానాన్ని ఒక క్రమపద్ధతిలో రాయడానికి కొన్ని మౌలిక సూత్రాలను తప్పనిసరిగా పాటించాలి.

1 ఉపోద్ఘాతం (ఇంట్రడక్షన్)

- జనరల్ ఎస్సేలో ఉపోద్ఘాతానికి అధిక ప్రాధాన్యం ఉంటుంది. మొదట కలిగిన అభిప్రాయం కీలకం (ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ది బెస్ట్ ఇంప్రెషన్). అభ్యర్థి సామర్థ్యానికి ఇది కొలమానంగా ఉంటుంది. కాబట్టి ఉపోద్ఘాతం ఆకర్షణీయంగా (అట్రాక్టివ్), అర్థవంతంగా (మీనింగ్ ఫుల్), సందేశాత్మకంగా (మెసేజ్ ఓరియంటెడ్) ఉండేలా చూసుకోవాలి. ప్రశ్న మౌలిక అర్థం ఇందులో ప్రతిబింబించేవిధంగా మౌలికాంశాలను (కోర్ ఎలిమెంట్స్) స్పష్టంగా, క్లుప్తంగా తక్కువ పదాల్లో ఎక్కువ అర్థం వచ్చేవిధంగా, ప్రభావవంతంగా (ఎఫెక్టివ్) ఉండేవిధంగా రాయాలి. సాధారణంగా ఉపోద్ఘాతం రెండు లేదా మూడు పేరాగ్రాఫ్‌లుగా (ప్రతి పేరాగ్రాఫ్‌లో 5 నుంచి 7 లైన్లు) ఉండేవిధంగా చూసుకోవాలి.

మధ్య భాగం (బాడీ పార్ట్)

- జనరల్ ఎస్సే సమగ్ర వివరణ మధ్య భాగంలోనే కనిపిస్తుంది. ముఖ్యంగా అభ్యర్థికి సంబంధిత ప్రశ్నపట్ల ఉన్న అవగాహన, విషయస్పష్టత, వాస్తవికాంశాలు, భాష, భావవ్యక్తీకరణ తీరు, విషయాన్ని విభిన్న కోణాల్లో సమగ్రంగా, సంపూర్ణంగా విశ్లేషించే తీరు పేరాగ్రాఫ్‌ల మధ్య అనుసంధానం, ప్రధానంగా సున్నితమైన అంశాలను వివరించేటప్పుడు భావోద్వేగాలను నియంత్రించుకుంటూ (ఎమోషనల్ కంట్రోల్) స్థితప్రజ్ఞత (బ్యాలెన్స్ మైండ్), తటస్థత (న్యూట్రాలిటీ) వంటి అంశాలతోపాటు సంబంధిత అంశంపట్ల లోతైన అవగాహన, ఆశావాద దృక్పథం, అంతిమంగా మధ్యభాగంలోని సమాచారం ఆధారంగా ఒక ప్రభుత్వ అధికారికి ఉండాల్సిన లక్షణాలు ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని అంచనావేయడం జరుగుతుంది.

ముగింపు (కన్‌క్లూజన్)

- ముగింపు మరింత ప్రభావవంతంగా ఉండేలా చూసుకోవాలి. ఇందులో పరిష్కారం మార్గాలు భవిష్యత్ దర్పణం (ఫ్యూచరిస్టిక్, విజనరీ) కనిపించాలి. ముందు రాసిన విషయాలు పునరావృతం కాకుండా చూసుకోవాలి. అదేవిధంగా ఉపోద్ఘాతంలోని అంశానికి ముగింపులోని అంశానికి అనుసంధానం ఉన్నట్లు కనిపించాలి. ముగింపు ఎంత ప్రభావవంతంగా ఉంటే అన్ని ఎక్కువ మార్కులు రావడానికి అవకాశం ఉంది.

సృజనాత్మకంగా ఉండాలి

- జనరల్ ఎస్సే రాయడం ఒక కళ. అయితే నిరంతరం సాధన చేయడం ద్వారా ప్రతి అభ్యర్థి దీనిలో ప్రావీణ్యాన్ని సాధించవచ్చు. ప్రశ్న ఎంపిక, సమయపాలనకు అధిక ప్రాధాన్యమివ్వడంతో పాటు సమాచారాన్ని క్రమబద్ధంగా, తర్కబద్ధంగా, క్లుప్తంగా, సమగ్ర దృక్పథంతో సందర్భానుసారం వర్తమాన అంశాలను జోడిస్తూ నిరంతరం కొనసాగే ఒక జీవనదిలా సమాచారాన్ని రాయగలిగితే జనరల్ ఎస్సేలో గరిష్ఠ మార్కులు పొందవచ్చు.
- మహోన్నత లక్ష్యాన్ని ఎంచుకుని తదనుగుణంగా జీవితాన్ని మలచుకుని నిరాశ, నిస్పృహలను త్యజించి నిజాయితీగా ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీలేదు. ఒకసారి రంగంలోకి దిగిన తర్వాత వెనుకంజ వేయకూడదు. ఇది కర్తవ్యధీరుల లక్షణం. లక్ష్యసాధనకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండటమే విజయ రహస్యం, విజయం గమ్యం కాదు ఒక గమనం మాత్రమే. శ్రమలో ఆనందాన్ని పొందగలిగితే విజయం దానంతట అదే మన దరికి చేరుతుంది. కాబట్టి అభ్యర్థులు సమయాన్ని వృథాచేయకుండా నిజాయితీగా నిరంతరం కష్టపడితే సివిల్ సర్వీసెస్‌లో తప్పనిసరిగా విజయం సాధిస్తారు.

సివిల్స్ మెయిన్-2016

జనరల్ ఎస్సే

టైమ్: 3 గంటలు **మార్కులు:** 250

Write Two essays, choosing ONE from each of the selections A and B, in about 1000-1200 words each

125X2 = 250

Section-A
1. If development is not engendered, it is endangered
2. Need brings greed, if greed increases it spoils breed
3. Water disputes between states in federal india
4. Innovation is the key determinant of economic

Section-B
1. Cooperative federalism: Myth or Reality
2. Cyberspace and Internet: Blessing or curse to the human civilization in the long run
3. Near jobless growth in India: An anomaly or an outcome of economic reforms
4. Digital economy: A leveller or a source of economic inequality

2017

Section-A
1. Farming has last the ability to be a source of subsistence for majority of farmers in India
2. Impact of the new economic measures on fiscal ties between the union and states in India
3. Destiny of a nation is shaped in its classroom
4. Has the Non-Alignment Movement (NAM) lost its relevance in a multipolar world

Section-B
1. Joy is the simplest form of gratitude
2. Fulfilment of new woman in India is a myth
3. We many brave human laws but cannot resist natural laws.
4. Social Media is inherently a selfish medium.

2018

Section-A
1. Alternative technologies for a climate change resilient India
2. A good life is one inspired by love and guided by knowledge
3. Poverty anywhere is a threat to prosperity everywhere
4. Management of India borders disputes- a complex task

Section-B
1. Customary morality cannot be a guide to modern life
2. The past is a permanent dimension of human consciousness and values
3. A people that values its privileges above its principles loses both
4. Reality does not conform to the ideal, but confirms it.

నూతనకంటి వెంకట్
జాయింట్ సెక్రటరీ
గ్రూప్-1 అధికారుల సంఘం

నమస్తే తెలంగాణ
నిపుణ
కరీంనగర్
సోమవారం 17 జూన్ 2019

ఊర్లల్లో ఉండేవారు, నిరక్షరాస్యులే వ్యవసాయం చేస్తారనేది పాతమాట. ఇప్పుడు ఇంజినీరింగ్, పీహెచ్‌డీలు చేసిన ఉన్నత విద్యావంతులు కూడా 'సాగుబడి' వైపు కదులున్నారు. సాగులో సాంప్రదాయ విధానాలతోపాటు, సరికొత్త సాంకేతిక పద్ధతులను అవలంబించి ఆదర్శ రైతులుగా నిలుస్తున్నారు. అలాగే వ్యవసాయరంగంలో ఉండే సమస్యలను తమ వినూత్నమైన ఆలోచనలు, ఆధునిక టెక్నాలజీ సాయంతో పరిష్కారం చూపుతున్నవారూ ఉన్నారు. ఇలా ఇతరులకు మార్గదర్శకులుగా నిలవడమే కాకుండా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. వ్యవసాయ విధానంలో ఉండే వివిధ దశలను ఆధారంగా చేసుకుని ఉపాధికి బాటలు వేస్తున్నారు. అసలు వ్యవసాయంలో ఉండే దశలు ఏవి, 'అగ్రి' కోర్సులతో కొంగొత్త అవకాశాలు ఎలా అందుకోవచ్చనే విషయాలు...

సరికొత్త వ్యవసాయం ఉద్యోగాల ఫలసాయం

- దేశంలో ఇప్పటికీ వ్యవసాయమే జీవనాధారంగా, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి పొందుతున్నవారి సంఖ్య ఎక్కువగానే ఉన్నది. దేశం ఇతర రంగాల్లో ఎంతగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ వ్యవసాయ రంగంపై సుమారు 60 శాతం ఆధారపడి ఉన్నారు. జీడీపీలో 25 శాతం వాటా వ్యవ'సాయానిదే' ఉందంటే దీని ఆవశ్యకత ఎంత ఉందో అర్థమవుతున్నది. దీని కితోడు నానాటికి జనాభా అధికమవుతుండటంతో వారందరికీ సరిపోయేలా వ్యవసాయ ఉత్పత్తులను కూడా పెంచాల్సి ఉంది. దీంతో సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులే కాకుండా, కొత్త వంగడాలు సృష్టించడం, అధిక దిగుబడికి అవసరమైన పరిశోధనలు చేయడం, ఆధునిక పద్ధతులను అనుసరించడం, తక్కువ వ్యయంతో ఎక్కువ ఉత్పత్తి జరిగేలా పంటలను సాగు చేయడానికి అవసరమైన మెళకువలు నేర్పుతూ అగ్రికల్చర్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో యువత వ్యవసాయ కోర్సులవైపు మళ్లుతున్నది. దీనికితోడు పంటల సాగులో నూతన సాంకేతిక, శాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తుండటంతో వ్యవసాయ, దాని అనుబంధ రంగాలు కొత్తరూపును సంతరించుకుంటున్నాయి. దీంతో వ్యవసాయ విద్య పరిధులు, అవకాశాలు రెండూ విస్తరిస్తున్నాయి.

ఉపాధికి తోవ..

- వ్యవసాయం అంటే కేవలం దుక్కిదున్ని, విత్తనాలు వేసి, పంట పండించి వాటిని అమ్మడమే కాదు. భూమిని చదును చేయడం దగ్గర నుంచి పంటను కోత కోసి, మార్కెట్‌కు తరలించడం వరకు అందులో అనేక దశలు ఉంటాయి. ఇవి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎక్కువమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. అలాంటివి కొన్ని..

ప్రొడక్షన్ అగ్రికల్చర్

- వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులను పెంచడం వంటివి ఇందులో ఉంటాయి. పంటలు, పండ్లు, కూరగాయల ఉత్పత్తి, కోళ్లు, పశు సంపదను అధికం చేయడం, డెయిరీని స్థాపించడం, మేకలు, గొర్రెలు, పందుల పెంపకం కూడా దీని పరిధిలోనే ఉంటుంది. దేశంలో పాలు, పాల పదార్థాల ఉత్పత్తి పరిశ్రమలో అధికంగా ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి.

అగ్రికల్చరల్ సేల్స్ అండ్ సర్వీస్

- పంటల సాగుకు అవసరమైన సేంద్రీయ ఎరువులు (ఫెర్టిలైజర్స్), క్రిమి సంహారక మందులు (పెస్టిసైడ్స్), వ్యవసాయ పరికరాలు, విత్తనాల విక్రయం వంటివి అమ్మకపు (సేల్స్) విభాగంలోకి వస్తాయి. అందువల్ల సేల్స్ అండ్ ప్రమోషన్ విభాగంలో ఉద్యోగాలు విరివిగా లభిస్తున్నాయి. వీటితోపాటు పంటలు కోయడం, ఉన్ని కత్తిరించడం, పశువుల గిట్టలు (hoofs) కత్తిరించడం, గుర్రాలకు నాడలు వేయడం వంటి వ్యవసాయ సంబంధ సేవల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి.

మార్కెటింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్

- వ్యవసాయానికి, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లపై అవగాహన, వ్యాపార అర్థశాస్త్ర అధ్యయనం, విజయవంతమైన మార్కెటింగ్ మెళకువలవంటివి సహాయపడుతాయి.

అగ్రికల్చర్ మెకానిక్స్

- వ్యవసాయ ఉత్పత్తులను పెంచడానికి, వాటిని నిలువచేసుకోవడానికి అవసరమైన కట్టడాల నిర్మాణాలు, వాటికి ప్లానింగ్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్, యంత్రాల నిర్వహణ, వెల్డింగ్, ఎలక్ట్రికల్ వర్క్, ప్లంబింగ్ వంటివి ఇందులో ఉంటాయి.

అగ్రికల్చర్ ప్రాసెసింగ్

- అగ్రికల్చర్ సైన్స్‌తో ఫుడ్ సైన్స్‌కు దగ్గరి సంబంధం ఉంటుంది. దీంతో అగ్రికల్చర్‌లో డిగ్రీ చేసినవారు ఎలాంటి ఆహార పరిశ్రమలోనైనా ఉద్యోగాలు పొందవచ్చు. అదేవిధంగా ఆహార పరిశ్రమలో ప్లాంట్ వర్కర్స్, ఎగ్ ప్రాసెసర్స్ వంటి నిపుణులు, సాధారణ శ్రామికుల అవసరం ఉన్నది.

ఫారెస్ట్రీ

- పచ్చదనాన్ని ఆస్వాదించేవారికి అటవీ ఉద్యోగాలు మంచి అవకాశాలు. కలప ఉత్పత్తి, పెంపకం, అటవీ భూముల అభివృద్ధి, నిర్వహణ వంటివి ఇందులో ఉంటాయి.

హార్టికల్చర్

- గార్డెన్ల సాగు, నిర్వహణకు సంబంధించిన ఉద్యోగాలు హార్టికల్చర్ కెరీర్ పరిధిలోకి వస్తాయి. ఇందులో గ్రీన్‌హౌస్, నర్సరీ మేనేజ్‌మెంట్, టర్ఫ్ మేనేజ్‌మెంట్, ఫ్లోరికల్చర్, ల్యాండ్‌స్కేపింగ్ వంటివి ఉంటాయి.

రూరల్ రిక్రియేషన్ అండ్ రిసోర్సెస్

- ఇది ఎప్పటికీ తరిగిపోని, పునరుత్పాదక వనరులకు సంబంధించింది. వైల్డ్‌లైఫ్, జలవనరులు, భూమితో సంబంధమున్న ఉద్యోగాలు దీనిపరిధిలోకి వస్తాయి.

నూతన ఆవిష్కరణలకు వేదిక

- వినూత్నంగా ఉండాలని కోరుకునేవారికోసం వ్యవసాయరంగంలో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. పెరుగుతున్న ఉత్పత్తులు, కొత్తగా పుట్టుకొస్తున్న సమస్యలు వాటికి సరికొత్త పరిష్కారాలు, వ్యవసాయానికి అవసరమైన నూతన ఆవిష్కరణలు ఇలా అనేక రంగాల్లో ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయి.

అగ్రిటెక్ ఎంట్రప్రెన్యూర్

- పంటల అధిక దిగుబడికి, వినియోగదారులకు అవసరమైన ఆహార పదార్థాలను వీలైనంత తొందరగా అందించడానికి మోతాదుకు మించి రసాయనాలను వాడుతుండటంతో ఇప్పటికే పర్యావరణానికి హాని జరిగింది. వ్యవసాయ రంగంలో ఉండే ఇలాంటి సమస్యలను అధిగమించడానికి సరికొత్త ఆలోచనలతో స్టార్టప్‌లు ప్రారంభమవుతున్నాయి. ఇవి ఆరోగ్యకరమైన, ఆహార పదార్థాల ఉత్పత్తి స్థిరంగా కొనసాగేలా వినూత్నమైన, సృజనాత్మక, పర్యావరణ అనుకూల పరిష్కారాలను చూపుతున్నాయి. ఉదాహరణకు పుణెలో ప్రారంభమైన ఒక ఎం-కామర్స్ సంస్థ వ్యవసాయానికి సంబంధించిన పరికరాలు, ఉత్పత్తులను నేరుగా రైతులకే అమ్ముతున్నది. ఇలా దేశంలోని సుమారు 25 వేలకుపైగా గ్రామాల్లో తమ సేవలను అందిస్తున్నది. అదేవిధంగా దక్షిణ భారతదేశానికి చెందిన ఒక స్టార్టప్ కంపెనీ సుమారు మూడువేల మంది రైతులు పండించిన పంటలను 12 గంటల్లోనే హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లోని దాదాపు నాలుగువేల రిటైల్ స్టోర్లకు చేరవేస్తున్నది. దీంతో వారికి సరైన ధరలు వచ్చేలా చూస్తున్నది. వీటితోపాటు స్టెల్‌యాప్స్, బాంబే హెంప్ కంపెనీ వంటి స్టార్టప్‌లు తమ కొత్త ఆలోచనలు, నూతన ఆవిష్కరణలతో రైతులకు సహాయం అందిస్తుండటంతోపాటు అనేకమందికి ఉపాధి కల్పిస్తున్నాయి.

అగ్రికల్చర్ అడ్వెంచరర్

- వ్యవసాయ రంగంలో అనునిత్యం వినూత్నమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించడానికి ఆస్కారమున్నది. అది ఉపాధి అవకాశాలు సృష్టించడానికి వేదికగా నిలుస్తున్నది. అందరిలా నిర్ణీత వేళల్లో ఉద్యోగం చేయడం ఇష్టంలేని వారు ఈ రంగంలోకి ప్రవేశించి కొత్త ఆవిష్కరణలు రూపొందించే అడ్వెంచరర్‌గా మారవచ్చు.

అగ్రికల్చర్ జర్నలిస్ట్

- వ్యవసాయ జర్నలిస్ట్‌గా పనిచేయడం వల్ల ఈ రంగానికి సంబంధించిన ప్రభుత్వ పథకాలు, ఏ కాలంలో ఎలాంటి పంటలను సాగు చేయాలి, పరిశ్రమల నిబంధనలు ఎలా ఉంటాయి, నూతన పరికరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయరంగంలో చోటుచేసుకుంటున్న కొత్త విషయాలను ఎప్పటికప్పుడు రైతులు, పాఠకులకు చేరవేయవచ్చు.

ప్రింట్ అండ్ ప్యాకేజింగ్ డిజైనర్

- వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార పరిశ్రమల ఆలోచనలకు అనుగుణంగా సృజనాత్మకంగా, ఆయా ఉత్పత్తుల ప్యాకెట్లను డిజైన్ చేయగలిగే వారికి డిమాండ్ అధికంగా ఉన్నది. ఇలాంటి వారు కిరాణా దుకాణాలు, రిటైల్ వ్యాపార రంగాల్లో ఉద్యోగాలు పొందుతున్నారు.

ఎవరు చదవచ్చు

- సైన్స్, మ్యాథ్స్ అంటే ఇష్టం ఉండి, మొక్కలు, జంతువులు, భూమి, వ్యవసాయం గురించి నేర్చుకోవాలనే తపన ఉన్నవారు వ్యవసాయ కోర్సులు చేయవచ్చు. వ్యవసాయ పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన వినియోగదారుల అవసరాల్లో అనునిత్యం మార్పులు వస్తుండటం, రోజురోజుకు కొత్త పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్నప్పటికీ సరికొత్త సవాళ్లు, అడ్డంకులు కలుగుతూనే ఉన్నాయి. వీటి నుంచి బయటపడటానికి వేగంగా ఆలోచించడంతోపాటు, తగిన పరిష్కార మార్గాలు చూపగలగాలి. దీంతోపాటు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండి రైతులు, అమ్మకందారులు, తయారీదారులు, వినియోగదారులతో నేరుగా మాట్లాడగలిగే నైపుణ్యం ఉండాలి.

ఎక్కడ చదవచ్చు..

- దేశంలో సుమారు నాలుగు వందల కాలేజీలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు సంబంధించిన అంశాల్లో డిగ్రీ, పీజీ కోర్సులను అందిస్తున్నాయి. మన ఆసక్తిని బట్టి ఆ కోర్సులను ఆఫర్‌చేస్తున్న కాలేజీలు, యూనివర్సిటీలను ఎంపికచేసుకోవచ్చు. ఆయా కోర్సులను అందిస్తున్న ప్రముఖ విద్యాసంస్థలు..
- ప్రొ.జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ- హైదరాబాద్
- ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ)- న్యూఢిల్లీ
- తమిళనాడు అగ్రికల్చరల్ యూనివర్సిటీ- కోయంబత్తూర్
- సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ (సీఐఏఈ)- భోపాల్
- అంబిల్ ధర్మలింగం అగ్రికల్చరల్ కాలేజ్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఏడీఏసీ అండ్ ఆర్ఐ)- తిరుచిరాపల్లి
- ఇండియన్ అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఎస్ఆర్ఐ)- న్యూఢిల్లీ
- నేషనల్ డెయిరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్- కర్నాల్
- కొచ్చిన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ- కొచ్చి
- సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్- ముంబై
- నేషనల్ బ్యూరో ఆఫ్ ఫిష్ జెనెటిక్ రిసోర్సెస్ (ఎన్‌బీఎఫ్‌జీఆర్)- లక్నో
- వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా- డెహ్రాడూన్

కోర్సులు

- ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయాలనుకునే వారికోసం సాగులో మెళకువలు నేర్చుకునేలా పదో తరగతి, ఇంటర్ విద్యార్హతతో సర్టిఫికెట్, డిప్లొమా, బ్యాచిలర్ కోర్సులు వివిధ యూనివర్సిటీలు అందిస్తున్నాయి.

సర్టిఫికెట్ కోర్సులు

- ఈ కోర్సులు సాధారణంగా ఏడాది నుంచి రెండేండ్ల కాలవ్యవధి కలిగి ఉంటాయి. వీటిలో హార్టికల్చర్, ఫ్లోరికల్చర్, ఆక్వాకల్చర్, చేపల పెంపకం, తేనెటీగల పెంపకం, ఫ్రూట్ ప్రొడక్షన్ కోర్సులు చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఈ కోర్సులు చేయాలంటే పదో తరగతి లేదా ఇంటర్ పాసవ్వాల్సి ఉంటుంది.

డిప్లొమా కోర్సులు

- వీటిలో అగ్రికల్చర్, డెయిరీ టెక్నాలజీ, ఫ్లోరీరికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, హార్టికల్చర్ కోర్సులు ముఖ్యమైనవి. ఈ కోర్సుల కాలవ్యవధి సాధారణంగా మూడేండ్లు ఉంటుంది. అయితే వీటిలో కొన్నింటిని ఒకటి నుంచి మూడేండ్ల కాలవ్యవధిలో కూడా చేయవచ్చు. డిప్లొమా కోర్సులు చేయాలంటే ఎంపిక చేసుకున్నదాన్ని బట్టి పది లేదా ఇంటర్ పూర్తిచేయాలి.

బ్యాచిలర్ కోర్సులు

- ఇంటర్ పూర్తి చేసినవారు వ్యవసాయ డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సులు చేయవచ్చు. ఇందులో వివిధ కాంబినేషన్లతో బ్యాచిలర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అవి..

అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్‌లో బీబీఏ

- ఇంటర్‌లో ఏ గ్రూప్‌వారైనా ఈ కోర్సు చేయవచ్చు. ఈ కోర్సును మూండేడ్లలో పూర్తి చేయవచ్చు.

బీఎస్సీ అగ్రికల్చర్

- ఇందులో అగ్రికల్చర్, డెయిరీ సైన్స్, ప్లాంట్ సైన్స్, అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ, అగ్రికల్చర్ అండ్ ఫుడ్ సైన్స్, హార్టికల్చర్, ప్లాంట్ పాథాలజీ, ఫిషరీస్ సైన్స్ లేదా ఫారెస్ట్రీ అంశాల్లో కోర్సులు ఉన్నాయి. వీటి కాలవ్యవధి కూడా మూడేండ్లు. ఈ కోర్సులు చేయాలంటే ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ (పీసీబీ) సబ్జెక్టులు, వీటితోపాటు మ్యాథ్స్ సబ్జెక్టు చదివినవారై ఉండాలి.

బీఈ లేదా బీటెక్

- ఇందులో అగ్రికల్చరల్ ఇంజినీరింగ్, అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అగ్రికల్చర్ అండ్ డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చర్ అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులు చేయాలంటే ఇంటర్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ లేదా బయాలజీ సబ్జెక్టులతో సైన్స్ స్ట్రీమ్‌లో ఉత్తీర్ణులై ఉండాలి. నాలుగేండ్ల కాలవ్యవధి ఉండే ఈ కోర్సులు చేయాలంటే ఆయా విద్యాసంస్థలు నిర్వహించే ప్రవేశపరీక్షల్లో అర్హత సాధించాలి

- కోర్సులో భాగంగా వ్యవసాయం ఏ పద్ధతుల్లో చేయాలి, ఏ భూమిలో ఎలాంటి పటలను సాగు చేయవచ్చు, పశువులకు అవసరమైన గడ్డి సాగుతోపాటు ఇతర వ్యవసాయ పద్ధతులు, పంటల సాగుకు సంబంధించిన అనేక ఆధునిక సాంకేతిక విధానాల గురించి అధ్యయనం చేయవచ్చు.

...✍ సుంకరి గణేష్

హైటెక్ ఫార్మర్

- సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించడం ద్వారా శ్రమను, సమయాన్ని, ధనాన్ని ఆదాచేయవచ్చు. దీనిద్వారా భారతదేశ వ్యవసాయ రంగానికి కొత్త రూపు తీసుకురావడానికి అవకాశం ఉంటుంది. ఇలా ఆధునిక పద్ధతులను ఉపయోగించడం ద్వారా హైటెక్ రైతులు గాలిలో మొక్కలను పెంచడానికి (Aeroponics), నీటిలో మొక్కలను పెంచడానికి (Hydroponics), పంటను సర్వే చేయడానికి డ్రోన్లను ఉపయోగించడం, ఉపగ్రహాల సహాయంతో ట్రాక్టర్లను నడపడానికి అవసరమైన ఉద్యోగాలు కల్పించవచ్చు. ఉదాహరణకు క్రాప్లన్ టెక్నాలజీ సొల్యూషన్స్ అనే సంస్థ పంట నష్టాన్ని గుర్తించడానికి 'స్మార్ట్‌ఫార్మ్' అనే క్లౌడ్ ఆధారిత ప్లాట్‌ఫామ్‌ను ప్రవేశపెట్టింది. భూమిలో ఉండే ఖనిజ లవణాల స్థాయిని తెలుసుకోవడానికి 'గ్రీన్‌సీకర్స్' అనే పరికరాన్ని ట్రింబుల్ అనే సంస్థ అభివృద్ధి చేసింది. పంట కాలాలను నిర్ణయించే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత వ్యవస్థను రోబోట్ బాస్ట్ ఇంజినీరింగ్ సంస్థ తయారుచేసింది. వీటిద్వారా భూసార పరీక్షలు నిర్వహించి రైతులు తమ పొలాలు ఏయే పంటల సాగుకు అనుకూలంగా ఉన్నాయి, ఎలాంటి విత్తనాలు వేయాలి, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి రాబట్టడానికి ఎంత మోతాదులో రసాయనాలను ఉపయోగించాలనే విషయాలను తెలుపుతున్నాయి.

సుడోకు

డైలీ సుడోకు 65 సమాధానం

6	2	7	3	1	8	5	4	9
9	8	5	4	7	2	1	6	3
1	3	4	5	6	9	8	2	7
7	4	6	8	3	5	9	1	2
3	1	8	9	2	6	7	5	4
2	5	9	7	4	1	3	8	6
5	7	2	6	8	3	4	9	1
4	9	1	2	5	7	6	3	8
8	6	3	1	9	4	2	7	5

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -66

			3			2		
4		7					5	
2			1		7	9		
	4			7			2	3
	7		8		5		4	
9	6			3			7	
		9	6		2			5
	2					7		6
		4			9			

షూటింగ్‌లకు విరామం!

ఇటీవలకాలంలో సినిమా చిత్రీకరణలో మన కథానాయకులు వరుసగా ప్రమాదాలకు గురికావడం పరిశ్రమను కలవరపరుస్తున్నది. యాక్షన్ ఘట్టాల షూటింగ్‌లో చోటుచేసుకుంటున్న పొరపాట్లతో పాటు, డూప్‌లే కుండా సొంతంగా యాక్షన్ సీక్వెన్స్‌లో నటించాలనుకోవడం ప్రమాదాలకు కారణమవుతున్నది. ఈ ఘటనల వల్ల షూటింగ్‌లకు బ్రేక్ పడుతున్నది. ఈ నేపథ్యంలో సరైన జాగ్రత్తలు తీసుకుంటూ సుశిక్షుతులైన ట్రైనర్స్ ఆధ్వర్యంలో పోరాట ఘట్టాల్లో పాల్గొంటే శ్రేయస్కరంగా ఉంటుందని అభిమానులు కోరుకుంటున్నారు..

ఎన్టీఆర్

రామ్‌చరణ్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ కథానాయకులుగా రాజమౌళి దర్శకత్వంలో 'ఆర్ ఆర్ఆర్' చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. భారీ బడ్జెట్‌తో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తెరకెక్కిస్తున్న ఈ సినిమా దేశవ్యాప్తంగా సినీ ప్రియుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఈ చిత్రం హైదరాబాద్‌లో తొలిషెడ్యూల్ పూర్తిచేసుకుంది. అనంతరం అహ్మదాబాద్, పుణేలో కొన్ని కీలక ఘట్టాల్ని తెరకెక్కించారు. అయితే షూటింగ్ మధ్యలో ఇద్దరు హీరోలు అనూహ్యంగా గాయాలు పాలవడంతో చిత్రీకరణను కొన్ని రోజులు వాయిదా వేశారు. రామ్‌చరణ్ జిమ్‌లో వర్కవుట్స్ చేస్తుండగా కాలికి గాయమైంది. దీంతో పూణే షెడ్యూల్‌ను రద్దు చేస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఏప్రిల్ మొదటివారంలో ఈ ఘటన జరిగింది. దాంతో మూడు వారాల పాటు షూటింగ్‌కు విరామం ఇచ్చారు. 'ఆర్ఆర్ఆర్' షూటింగ్ సందర్భంగా ఎన్టీఆర్ కూడా గాయపడ్డారు. కుడి చేతికి చిన్న గాయం అయిందని తెలిసింది. కొన్ని ప్రైవేట్ కార్యక్రమాల్లో చేతికి పట్టీ కట్టుకొని ఎన్టీఆర్ కనిపించారు. అయితే ఎన్టీఆర్‌కు గాయమైన విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా ధృవీకరించలేదు. ఇద్దరు హీరోల గాయాల కారణంగా 'ఆర్ఆర్ఆర్' చిత్రీకరణ కొన్ని రోజులు వాయిదా పడింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది.

నాగశౌర్య

డూప్ లేకుండా నాగశౌర్య ప్రయత్నం..

స్వీయ నిర్మాణ సంస్థ ఐరా క్రియేషన్స్ పతాకంపై నాగశౌర్య ఓ చిత్రాన్ని చేస్తున్న విషయం తెలిసిందే. రమణతేజ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ విశాఖపట్నంలో జరుగుతున్నది. సినిమాలో కొన్ని కీలకమైన యాక్షన్ ఘట్టాల్ని అక్కడ చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా తెరకెక్కిస్తున్న ఓ యాక్షన్ ఎపిసోడ్‌లో నాగశౌర్య ఎడమ కాలికి తీవ్రంగా గాయమైంది. డూప్ లేకుండా ఓ భారీ భవనం నుంచి దూకడానికి ప్రయత్నిస్తుండగా నాగశౌర్య అదుపు తప్పి కిందపడ్డారు. ఆయన్ని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. గాయం నుంచి కోలుకోవడానికి నెలరోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దాంతో నాగశౌర్య షూటింగ్‌ను రద్దు చేసుకొని హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. నాగశౌర్య గాయం కారణంగా ముప్పైరోజుల పాటు షూటింగ్ వాయిదా పడింది.

పేలుడులో గాయపడ్డ సందీప్‌కిషన్

సందీప్‌కిషన్ కర్నూల్‌లో జరుగుతున్న షూటింగ్‌లో గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన జి.నాగేశ్వరరెడ్డి దర్శకత్వంలో 'తెనాలి రామకృష్ణ' చిత్రంలో నటిస్తున్నారు. యాక్షన్ ఘట్టాల్ని కర్నూల్‌లో చిత్రీకరిస్తున్నారు. ఇందులో భాగంగా బాంబు పేలుడు నేపథ్యంలో ఓ ఎపిసోడ్ ప్లాన్ చేశారు. పేలుడు సమయంలో బస్సు అద్దాలు పగిలి సందీప్‌కిషన్ ఎడమకన్ను క్రింద గాయాలయ్యాయి. రిస్కీ షాట్‌వల్లే ఈ ప్రమాదం జరిగిందని, ఎవరి తప్పిదం లేదని సందీప్‌కిషన్ తెలిపారు. ఈ ఘటనతో షూటింగ్‌ను రద్దు చేసుకున్న సందీప్‌కిషన్ ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు చేరుకున్నారు.

సందీప్‌కిషన్

'96' షూటింగ్‌లో గాయపడ్డ శర్వానంద్

ప్రస్తుతం శర్వానంద్ '96' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. దిల్‌రాజు నిర్మాత. సి. ప్రేమ్‌కుమార్ దర్శకుడు. ఈ సినిమా షూటింగ్‌లో భాగంగా శర్వానంద్ థాయ్‌లాండ్‌లో స్కైడైవింగ్ ప్రాక్టీస్ చేస్తున్నారు. సుశిక్షుతులైన ట్రైనర్స్ ఆధ్వర్యంలో శర్వానంద్ రెండు రోజుల పాటు ప్రాక్టీస్ చేశారు. మూడో రోజు ప్రాక్టీస్‌లో కూడా నాలుగుసార్లు క్రిందకు సురక్షితంగానే చేరుకున్నారు. ఐదోసారి ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు ఒక్కసారిగా గాలి ఎక్కువగా వీయడంతో క్రిందకు దిగడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. కాళ్లపై ల్యాండ్ కావాల్సివుండగా భుజాలతో నేలమీదకు దిగారు. దీంతో షోల్డర్‌లో ఫ్రాక్చర్ అయింది. ఈ సంఘటన తర్వాత శర్వానంద్ వెంటనే హైదరాబాద్‌కు పయనమయ్యారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో జాయిన్ అయిన అతన్ని డాక్టర్లు పరీక్షించి భుజానికి బలమైన గాయమైందని తెలిపారు. శస్త్ర చికిత్స అవసరమని సూచించారు. సోమవారం శర్వానంద్‌కు శస్త్ర చికిత్స జరగనుంది. ఆపరేషన్ అనంతరం కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని డాక్టర్లు సూచించారు.

శర్వానంద్

జైపూర్‌లో గోపీచంద్‌కు ప్రమాదం..

గోపీచంద్ కథానాయకుడిగా తిరు దర్శకత్వంలో అనిల్ సుంకర 'చాణక్య' పేరుతో ఓ చిత్రాన్ని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరిలో జైపూర్‌లో చిత్రీకరణ సందర్భంగా గోపీచంద్ గాయపడ్డారు. బైక్‌పై ఛేజింగ్ ఘట్టాల్ని చిత్రీకరిస్తుండగా బైక్ అదుపుతప్పడంతో గోపీచంద్ క్రింద పడ్డారు. దీంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స తీసుకున్న అనంతరం ఆయన తిరిగి షూటింగ్‌లో పాల్గొన్నారు. ఇక కథానాయిక అంజలి 'ఆనందభైరవి' షూటింగ్‌లో ప్రమాదానికి గురైందని చిత్ర బృందం తెలిపింది. స్కూటీ నడిపే సన్నివేశంలో అంజలి అదుపుతప్పి పడిపోయింది. దీంతో స్వల్ప గాయాలైనట్లు చిత్ర బృందం పేర్కొంది.

ప్రభాస్

జిబ్రాన్ నేపథ్య సంగీతం

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సాహో'. సుజీత్ దర్శకుడు. యువీ క్రియేషన్స్ పతాకంపై వంశీకృష్ణారెడ్డి, ప్రమోద్, విక్కీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'బాహుబలి' వంటి సంచలన విజయాల తరువాత ప్రభాస్ నటిస్తున్న చిత్రం కావడంతో ఈ సినిమాపై సర్వత్రా భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. దానికి తగ్గట్లే ఇటీవల విడుదల చేసి టీజర్ అమితంగా ఆకట్టుకుంది. ఈ చిత్రానికి శంకర్ ఎహసాన్ లాయ్ సంగీత దర్శకులుగా చిత్ర బృందం ఖరారు చేసింది. అయితే అనివార్య కారణాల వల్ల ఈ సినిమా నుంచి శంకర్ ఎహసాన్ లాయ్ తప్పుకోవడంతో జిబ్రాన్ నేపథ్య సంగీతాన్ని అందించారు. ఇటీవల విడుదల చేసిన టీజర్‌కు ఆయన అందించిన నేపథ్య సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అంతర్జాతీయ ప్రమాణాలతో జిబ్రాన్ ఈ చిత్రానికి రీరికార్డింగ్ అందిస్తున్నారని చిత్ర వర్గాలు పేర్కొన్నాయి. కాగా ఈ చిత్రాన్ని నాలుగు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 15న విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నారు.

చేతన్, కశీష్‌వోరా, మంజునాథ్, నరేష్, అనిల్, మారుతి

ఫస్ట్ ర్యాంకు రాజు వినోదం

'టైటిల్ మాదిరిగానే ఈ సినిమా మంచి మార్కులు సాధించాలి. కన్నడంలో విజయవంతమైన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించాలి' అని అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. చేతన్ మద్దినేని, కశీష్ వోరా జంటగా నటిస్తున్న చిత్రం 'ఫస్ట్ ర్యాంక్ రాజు'. 'విద్య 100% బుద్ధి 0%' ఉపశీర్షిక. నరేష్ కుమార్ దర్శకుడు. మంజునాథ్ వి. కందుకూర్ నిర్మిస్తున్నారు. ఈ నెల 21న ఈ చిత్రం విడుదలకానుంది. శనివారం హైదరాబాద్‌లో చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి దర్శకుడు అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ 'జీవితంలో విద్యతో పాటు బుద్ధి ఉండాలనే సందేశంతో రూపొందిస్తున్న చిత్రమిది. ఫస్ట్‌ర్యాంక్ విద్యార్థులను కించపరిచేలా ఉండదు. విద్యార్థులంతా చూడాల్సిన సినిమా ఇది' అని తెలిపారు. కథను నమ్మి ఇందులో నటించామని నాయకానాయికలు చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'మంచి సినిమా చేస్తే తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతో రూపొందించాం. అందరిని మెప్పించేలా ఉంటుంది' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మారుతి, కశీష్ వోరా తదితరులు పాల్గొన్నారు.

'చంటబ్బాయి'తో పోలికలు ఉండవు

ఆర్.ఎస్.జె.స్వరూప్

''చంటబ్బాయ్' తర్వాత పట్టణ నేపథ్యంలో సాగే డిటెక్టివ్ సినిమాలు తెలుగులో రాలేదు. మళ్లీ ఈ జోనర్‌లో సినిమా చేస్తే బాగుంటుందనే ఆలోచన నుంచి పుట్టిన కథ ఇది' అని అన్నారు ఆర్.ఎస్.జె స్వరూప్. ఆయన దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ'. నవీన్ పొలిశెట్టి, శృతిశర్మ జంటగా నటిస్తున్నారు. రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నారు. ఈ నెల 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆదివారం హైదరాబాద్‌లో దర్శకుడు స్వరూప్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'సాయి శ్రీనివాస ఆత్రేయ అనే లోకల్ డిటెక్టివ్ కథ ఇది. కేసులు రాకుండా ఖాళీగా ఉండే అతడు ఓ పెద్ద కేసు చిక్కుముడిని ఎలా ఛేదించాడన్నది ఆకట్టుకుంటుంది. కొత్త హీరోతో ఈ సినిమా చేస్తేనే ఫ్రెష్‌నెస్ కనిపిస్తుందనే ఆలోచనలో నవీన్ పొలిశెట్టిని కథానాయకుడిగా తీసుకున్నాం. 'చంటబ్బాయి'తో ఈ సినిమాకు ఎలాంటి పోలికలు ఉండవు. అది ఓ క్లాసిక్. ఆ సినిమాను టచ్ చేసే సాహసం చేయలేదు. పూర్తి ఫిక్షనల్ స్టోరీ ఇది. ఆద్యంతం నవ్విస్తూనే థ్రిల్‌ను పంచుతుంది. నెల్లూరు నా స్వస్థలం. ఇంజినీరింగ్ పూర్తిచేసి ఇన్ఫోసిస్‌లో కొన్నాళ్లు జాబ్ చేశాను. ఆ తర్వాత అమెరికా వెళ్లిపోయాను. సినిమాలపై ఇష్టంతో ఏడాది తర్వాత ఇండియాకు తిరిగివచ్చాను. లఘు చిత్రాలు, వాణిజ్య ప్రకటనలు రూపొందించిన అనుభవంతో ఈ సినిమాను తెరకెక్కించాను. తొలినాళ్లలో అనుభవం లేకపోవడంతో ప్రతి రోజు ఏదో ఒక సమస్య ఎదురయ్యేది. నచ్చిన రంగం కావడంతో అవన్నీ ఇష్టంగానే భరించాను. కామెడీ, థ్రిల్లర్ డ్రామాను మేళవిస్తూ సినిమాలు చేయడం నాకు ఇష్టం' అని తెలిపారు.

జర్నలిస్టు పాత్రలో..?

మలయాళ చిత్రం 'ప్రేమమ్' నుంచి నటనకు ఆస్కారమున్న పాత్రలకే ప్రాధాన్యతనిస్తోంది తమిళ సోయగం సాయిపల్లవి. 'ఫిదా'చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని ఫిదా చేసిన ఆమె తాజా చిత్రంతో మరోసారి ఆకట్టుకోబోతున్నదని తెలిసింది. అనతికాలంలోనే కథానాయికగా మంచి గుర్తింపును సొంతం చేసుకున్న సాయి పల్లవి తాజా చిత్రంలో జర్నలిస్ట్ పాత్రలో కనిపించనుందని తెలిసింది. ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'విరాటపర్వం'. వేణు ఊడుగుల దర్శకత్వం వహిస్తున్నారు. రానా కథానాయకుడిగి నటిస్తున్నారు. డి.సురేష్‌బాబు, సుధాకర్ చెరుకూరి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తొలుత ఈ చిత్రంలో రానా పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారని, హీరోయిన్ సాయి పల్లవి నక్సలైట్‌గా నటిస్తోందని ప్రచారం జరిగింది. అయితే తాజా సమాచారం ప్రకారం సాయి పల్లవి జర్నలిస్టుగా, రానా నక్సలైట్‌గా కనిపిస్తారని, ఈ రెండు పాత్రలు చాలా శక్తివంతంగా సాగుతాయని చిత్ర వర్గాల సమాచారం. 1980 నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో సాయి పల్లవి ఓ విప్లవకారుడి జీవితాన్ని పరిశోధించే యువతిగా కనిపించనుందని చిత్ర వర్గాల సమాచారం.

సాయిపల్లవి

మన కౌన్సిల్ మన ప్యానెల్

సి.కల్యాణ్

గోపీచంద్

'నిర్మాతల మండలి అంటే నిర్మాతల శ్రేయస్సు కోసం ఏర్పాటు చేయబడింది. అందుకే అందరం ఒక గ్రూప్‌గా ఏర్పడి దీన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించుకున్నాం. దీనికి ఎఫ్‌డీసీ చైర్మన్ రామ్మోహన్‌రావు, డి.సురేష్‌బాబు, అల్లు అరవింద్, చదలవాడ శ్రీనివాసరావు ముందుకొచ్చారు' అన్నారు సి. కల్యాణ్. రెండేళ్లకు ఒకసారి నిర్మాతల మండలి ఎన్నికలు జరగాల్సి వుంది. అయితే గత కొంత కాలంగా వాయిదా పడుతూ వస్తున్న నిర్మాతల మండలి ఎన్నికలు ఎట్టకేలకు ఈ నెల 30న జరుగనున్నాయి. సి.కల్యాణ్ వర్గం 'మన కౌన్సిల్ మన ప్యానెల్' నినాదంతో పోటీకి దిగుతున్నది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలో అంతా ఒక తాటిపై వుండాలని నిర్ణయించుకున్నాం. ఈ ఎన్నికల్లో మన ప్యానెల్, గిల్డ్ ప్యానెల్ సభ్యులు పోటీపడనున్నారు. నిజానికి ఎన్నికలు జరగకుండా అర్హులైన వారిని ఏకగ్రీవంగా ఎన్నుకుని నిర్మాతల మండలిని మరింత బలోపేతం చేయాలని భావించాం. కానీ సమయాభావం వల్ల సభ్యులు అందుబాటులో లేకపోవడంతో ఎన్నికలు నిర్వహించక తప్పడం లేదు' అన్నారు. ఈ కార్యక్రమంలో టి.ప్రసన్నకుమార్, వైవీఎస్ చౌదరి, మోహన్ వడ్లపట్ల, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయ్ అంటే ఇష్టం!

'తెలుగు ప్రేక్షకుల అభిరుచుల్లో మార్పులు కనిపిస్తున్నాయి. నాయకానాయికల కంటే కథకే ప్రాధాన్యతనిస్తూ మంచి సినిమాల్ని ఆదరిస్తున్నారు' అని చెప్పింది అక్షత శ్రీనివాస్. ఆమె కథానాయికగా నటిస్తున్న చిత్రం 'స్పెషల్'. నందమ్‌శ్రీవాస్తవ్ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అజయ్ ప్రధాన పాత్రధారి. ఈ నెల 21న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో అక్షత శ్రీనివాస్ మాట్లాడుతూ 'తెలుగులో నేను నటిస్తున్న రెండో సినిమా ఇది. పారితోషికం గురించి పట్టించుకోకుండా కథ నచ్చి ఈ సినిమాను అంగీకరించాను. నా పాత్ర శక్తివంతంగా ఉంటుంది. కెరీర్‌లో విభిన్నమైన ప్రయత్నంగా నిలిచిపోతుంది. సైకోపతీ అనే అంశం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఓ మైండ్ రీడర్ జీవితంలో ఎదురయ్యే మలుపులు ఉత్కంఠను పంచుతాయి. నిజ జీవిత సంఘటనల ఆధారంగా దర్శకుడు వాస్తవ్ ఈ సినిమాను రూపొందించారు. కన్నడ, తెలుగు, తమిళ భాషల్లో హీరోయిన్‌గా నటించాను. అలాగే 'శేఖరం గారి అబ్బాయి' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తూ దర్శకత్వం వహించాను. తెలుగులో విజయ్ దేవరకొండ, అల్లు అర్జున్ నటన నచ్చుతుంది. సురేందర్‌రెడ్డి నా అభిమాన దర్శకుడు. 'గ్రంథాలయం' పేరుతో మరో సినిమా చేస్తున్నాను. మహిళా ప్రధాన ఇతివృత్తాలతో సినిమాలు చేయాలనుంది' అని తెలిపింది.

అక్షిత శ్రీనివాస్

సప్తగిరి, నరేంద్ర, అర్చన

టార్గెట్ చేరుకున్నాం

'బడ్జెట్‌కు అనుగుణంగా మేము నిర్దేశించుకున్న టార్గెట్‌ను చేరుకున్నాం. తొలిరోజు మిశ్రమ స్పందన లభించినా ఆ తర్వాత పుంజుకొని సినిమా యావరేజ్ టాక్‌ను సొంతం చేసుకున్నది. ద్వితీయార్థం పది నిమిషాల నిడివి ఎక్కువైందనే విమర్శలు వచ్చాయి. ఆ సన్నివేశాల్ని సినిమా నుంచి తొలగిస్తున్నాం' అని అన్నారు సప్తగిరి. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'వజ్ర కవచధర గోవింద'. అరుణ్ పవార్ దర్శకుడు. నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డి నిర్మించారు. వైభవీ జోషి కథానాయిక. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లో చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. నిర్మాతలు మాట్లాడుతూ 'మేము పడిన కష్టానికి వందశాతం ప్రతిఫలం దక్కింది. ప్రేక్షక దేవుళ్లు మా సినిమాను ఆదరిస్తున్నారు. బీ, సీ సెంటర్స్‌లో సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది' అని తెలిపారు. పంపిణీదారుడు బ్రహ్మయ్య మాట్లాడుతూ '400 థియేటర్లలో ఈ సినిమాను విడుదల చేశాం. రెండు రోజుల్లో తొంభై లక్షల గ్రాస్‌ను సాధించింది. సప్తగిరి హీరోగా ఇదే టీమ్‌తో 'సప్తగిరికి దయ్యం పట్టింది' పేరుతో మరో సినిమాను నిర్మించబోతున్నాం' అని చెప్పారు. అమ్మాయిలకు శక్తివంతమైన పాత్రలు దక్కడం తెలుగు ఇండస్ట్రీలో అరుదని, ఇందులో తాను పోషించిన ఎమ్మెల్యే నల్లూరి ప్రసన్నలక్ష్మీ పాత్రకు మంచి స్పందన లభిస్తున్నదని అర్చన తెలిపింది. థియేటర్లలో ప్రేక్షకుల నవ్వుతున్న ప్రతి సన్నివేశాన్ని చూస్తుంటే సంతోషంతో పాటు గర్వంగా ఉందని దర్శకుడు అరుణ్ పవార్ అన్నారు. ఈ కార్యక్రమంలో అవినాష్, మహీధర్ తదితరులు పాల్గొన్నారు.